www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# ప్రజా విశ్వంభర

అక్షరం సాక్షిగా..

ఆదివారం
01-03-2026

RNI No : TGTEL/25/A1676

సంపుటి : 01 | సంచిక : 229 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




డా॥ కాచం సత్యనారాయణ
CMD

## ఇరాన్‌పై విరుచుకు పడిన ఇజ్రాయెల్-అమెరికా

- మినాబ్ నగరంలో బాలికల బడిపై దాడి
- 40 మంది విద్యార్థినుల దుర్మరణం
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- 45 మందికి పైగా తీవ్ర గాయాలు
- 'ఇజ్రాయెల్ ఫస్ట్'గా మారిన ట్రంప్ నినాదం
- దుబాయ్ విమానాశ్రయాల కార్యకలాపాలు నిలిపివేత
- అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించారంటూ రష్యా తీవ్ర ఆగ్రహం
- విద్యార్థినుల ప్రాణాలను బలిగొన్న క్షిపణి దాడులు



2

## వేట్లపాలెం దుర్ఘటన కలచివేసింది : మోడీ

- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం
- మృతులకు రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేలు చొప్పన పరిహారం
- ప్రకటించిన ప్రధాని



**విశ్వంభర, ఏపీ బ్యూరో :** ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణ సంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు దుర్ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం జరిగిన ఈ ఘోర ప్రమాదంలో 21 మందికిపైగా కార్మికులు దుర్మరణం పాలవ్వగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్న ప్రధాని మోదీ.. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ కష్టకాలంలో బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చనిపోయినవాళ్లకు ఒక్కొక్కరికి రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేలు చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడినవాళ్లు త్వరగా కోలుకోవాలని ప్రధాని ఆకాంక్షించారు.



## వేట్లపాలెంలో..
# మృత్యు విస్ఫోటనం

- సూర్యశ్రీ ఫైర్ వర్క్స్‌లో పేలుడు
- 23 మంది సజీవదహనం
- 5 కిలోమీటర్ల మేర వినిపించిన శబ్దం
- చెల్లాచెదురైన శరీర భాగాలు
- మృతుల్లో అత్యధికులు మహిళలే
- పరిమితికి మించి నిల్వ ఉంచడమే ప్రమాదానికి కారణమా?
- ఆరా తీసిన సీఎం చంద్రబాబు
- రంగంలోకి హోం మంత్రి అనిత
- కొనసాగుతున్న సహాయక చర్యలు



**విశ్వంభర, ఏపీ బ్యూరో:**

తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట మండలంలోని వేట్లపాలెం గ్రామంలో శనివారం మధ్యాహ్నం భారీ పేలుళ్లతో దద్దరిల్లి పోయింది గోదావరి కాలువ పక్కనే ఉన్న ఫైర్ వర్క్స్' బాణాసంచా తయారీ కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటల సమయంలో సంభవించిన భారీ పేలుడు 23 మంది నిరుపేద కార్మికుల ప్రాణాలను బలితీసుకుంది. పేలుడు ధాటికి భారీ ఎత్తున మంటలు ఎగసిపడటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది. ప్రమాద సమయంలో లోపల మొత్తం 34 మంది పనిచేస్తుండగా, మంటల తీవ్రతకు 21 మంది అక్కడికక్కడే సజీవదహనమయ్యారు. మిగిలిన 13 మంది కార్మికులు తీవ్ర గాయాలపాలవగా, వారిలో ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో ఏడుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. మృతుల్లో ఎక్కువ మంది మహిళా కార్మికులే ఉండటం స్థానికులను కలచివేసింది.

### యుద్ధక్షేత్రాన్ని తలపించిన ఘటనాస్థలి

ఈ విస్ఫోటనం ఎంత శక్తివంతంగా ఉందంటే, దాని శబ్ద తీవ్రతకు సుమారు 5 కిలోమీటర్ల మేర భూమి కంపించినట్లు స్థానికులు చెబుతున్నారు. పక్కనే ఉన్న గ్రామంలోని ఒక ప్రైవేట్ పాఠశాల భవనం స్లాబ్‌కు సైతం పగుళ్లు వచ్చాయి. ఘటనాస్థలికి చేరుకున్న సహాయక బృందాలకు అక్కడ భీభత్సమైన దృశ్యాలు కనిపించాయి. పేలుడు ధాటికి కార్మికుల శరీర భాగాలు చెల్లాచెదురుగా పడి ఉండగా, కొన్ని మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజిన్ల సాయంతో గంటల తరబడి పోరాడి మంటలను అదుపులోకి తెచ్చారు. సామర్థ్యానికి మించి నిల్వ చేసిన మందుగుండు సామాగ్రి వల్లే ఈ ఘోరం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు,..

మిగతా2లో...

## శారదాపీఠం భూ కేటాయింపు రద్దు

- రేవంత్ సర్కార్ నిర్ణయం
- కోకాపేటలో గత ప్రభుత్వం ఇచ్చిన 2 ఎకరాల భూమి వెనక్కి
- జలమండలికి భూమిని కేటాయిస్తూ జీవో జారీ
- నిబంధనల ఉల్లంఘనపై అధికారుల ఆరా
- 99 రోజుల కార్యాచరణపై సచివాలయంలో సీఎం సమీక్ష

2





## భూ భారతి కాదు..
# భూ దోపిడీ..

- 37 మండలాల్లో కుంభకోణం
- నామమాత్రంగా ఆపరేటర్ల అరెస్టు
- హైకోర్టు చెప్పినా.. మారలేదు
- సిట్ విచారణకు హరీశ్ రావు డిమాండ్

2



## పామాయిల్ రైతులకు
# తీపి కబురు

- టన్ను ధర రూ.21,546!
- గత ప్రభుత్వ కాలంతో పోలిస్తే రికార్డు స్థాయిలో పెరిగిన గెలల ధర
- 15 వేల మంది రైతులకు రూ.2 కోట్ల అదనపు లబ్ధి
- ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీల్లో ఆధునిక యంత్రాలతో పెరిగిన నూనె రికవరీ శాతం
- ఎకరాకు రూ.50,918 రాయితీ
- వచ్చే ఏడాది మరో 2 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యం
- తెలంగాణ ధరల నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ రైతులకు సైతం ప్రయోజనం



2

## పేదల గూడు చెదరగొడతారా?

- పేదల ఇళ్లపై 'సర్కార్' సర్జికల్ స్ట్రైక్..
- ఈటల ధ్వజం!
- ఖమ్మం వెలుగుమట్లలో బాధితులకు ఈటల రాజేందర్ పరామర్శ
- శత్రుదేశం దాడి చేసినట్లు పోలీసులతో ఇళ్లు కూల్చివేయడం దారుణం
- కూల్చిన చోటే ఇళ్లు కట్టించి ఇవ్వాలని మల్కాజిగిరి ఎంపీ డిమాండ్



2

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో
# 10 విమానాలు రద్దు

- పశ్చిమాసియాలో ముదిరిన ఉద్రిక్తతలు
- గగనతలాన్ని మూసివేసిన 11 దేశాలు
- ఖతార్ రాజధాని దోహాపై ఇరాన్ మిస్సైల్ అటాక్
- లుఫ్తాన్సా, విజ్ ఎయిర్ సర్వీసులు మార్చి 7 వరకు నిలిపివేత
- ముంబైకి దారి మళ్లించిన ఎయిర్ ఇండియా 'ఢిల్లీ-టెల్ అవీవ్' విమానం



2

## పోస్ట్ మార్టం రిపోర్ట్‌కు
# రూ.2లక్షల డిమాండ్

- సీఎంవో నుంచి ఫోన్ చేయించినా.. లంచం వైపే మొగ్గు
- నాలుగు నెలలుగా డబ్బుల కోసం వేధింపులు
- రూ.35వేలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ హోంగార్డు
- కీసర పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ నగేష్



2

## రైతు రిజిస్ట్రీలో
# తెలంగాణ నంబర్ వన్


- 39,77,791 మందికిగాను 43,59,371 మంది రైతుల నమోదు
- 110 శాతం లక్ష్యాన్నిసాధించిన స్టేట్
- వ్యవసాయరంగంలో పారదర్శకతను పెంపొందించనున్న రైతురిజిస్ట్రీ
- అధికారులపై మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రశంసలు



2

# ఎర్రబడిన 'హోమ్ ఫ్రంట్ కమాండ్ యాప్'

- ఇరాన్ ప్రతీకారేచ్ఛ.. ఇజ్రాయెల్‌లో సైరన్ల మోత
- ఇజ్రాయెల్ వైపు దూసుకొచ్చిన ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు
- ఖమేనీ నివాసం సహా 30 ప్రాంతాలే లక్ష్యంగా ఇజ్రాయెల్-అమెరికా దాడులు
- గగనతలంలోనే క్షిపణులను అడ్డుకుంటున్న ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థలు
- తొలి విడత దాడి మాత్రమేనని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ హెచ్చరిక




**విశ్వంభర, బ్యూరో:** ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో జరిపిన దాడుల తర్వాత పశ్చిమాసియాలో పరిస్థితులు యుద్ధ క్షేత్రాన్ని తలపిస్తున్నాయి. ఇరాన్ ప్రయోగించిన వందలాది క్షిపణులు ఇజ్రాయెల్ గగనతలంపైకి దూసుకురావడంతో ఆ దేశం అంతటా హై అలర్ట్ ప్రకటించారు. ఈ క్రమంలో ఇజ్రాయెల్ పౌరుల మొబైల్స్‌లోని 'హోమ్ ఫ్రంట్ కమాండ్ యాప్' ఒక్కసారిగా ఎరుపు రంగులోకి మారిపోయింది. క్షిపణులు వచ్చే దిశను బట్టి ఈ యాప్ నిరంతరం హెచ్చరికలు జారీ చేస్తుండటంతో పౌరులు బాంబు షెల్టర్లలోకి పరుగులు తీశారు. ముఖ్యంగా ఉత్తర ఇజ్రాయెల్ ప్రాంతంలో సైరన్ల మోత దద్దరిల్లిపోతోంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ తమ ప్రతీకార దాడులను ప్రారంభించామని, ఇవి ఇంకా కొనసాగుతాయని స్పష్టం చేయడంతో ఆందోళన మరింత పెరిగింది.

### ఖమేనీ నివాసమే లక్ష్యంగా భారీ బాంబు దాడి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు నేతృత్వంలో జరిగిన ఈ దాడులు అత్యంత వ్యూహాత్మకంగా సాగాయి. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ కార్యాలయం, నివాసంతో పాటు అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు ప్రయోగించినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. మొత్తం 30 కీలక ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించగా, నిఘా ప్రధాన కార్యాలయాలు కూడా ధ్వంసమయ్యాయి. అయితే, దాడులకు ముందే ఖమేనీని సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు సమాచారం అందుతోంది. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని అమెరికా ప్రకటించగా, ఇది చట్టవిరుద్ధమైన దురాక్రమణ అని ఇరాన్ విదేశాంగ శాఖ మండిపడింది.

### గగనతలంలో క్షిపణుల పోరు

ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను అడ్డుకోవడానికి ఇజ్రాయెల్ తన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను రంగంలోకి దించింది. ఆకాశంలోనే క్షిపణులు ఢీకొంటుండటంతో భారీ శబ్దాలు వినిపిస్తున్నాయి. ఇజ్రాయెల్ అమెరికా దళాలు సంయుక్తంగా తమ గగనతలాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాయి. మరోవైపు, ఈ యుద్ధ ప్రభావం వల్ల మధ్యప్రాచ్యంలోని 11 దేశాలు తమ విమానయాన సేవలను నిలిపివేశాయి. ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య మొదలైన ఈ పరస్పర దాడులు ప్రపంచ శాంతికి ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. దౌత్య చర్చలు విఫలమవడమే ఈ భారీ సైనిక చర్యలకు దారితీసినట్లు తెలుస్తోంది.



## క్రీడలతోనే ఆరోగ్యకర భవిష్యత్తు

**విశ్వంభర, హైదరాబాద్ :** యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించి గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నుంచి దూరంగా ఉంచడమే లక్ష్యంగా హైదరాబాదు ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో యువరా ఆధ్వర్యంలో క్రీడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ నరేష్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు యువతలో స్నేహభావం, శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా జాగ్రత్తపడాలని, గంజాయి, డ్రగ్స్ బారిన పడితే బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని హెచ్చరించారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో విద్యార్థి యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు. వాలీబాల్ మాజీ జాతీయ క్రీడాకారుడు కిరణ్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేస్తాయని తెలిపారు. యువత తమ సమయాన్ని క్రీడలు, విద్య వైపు మళ్లిస్తే సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవనశైలిని అవలంబించాలని సూచించారు. కార్యక్రమంలో అనగంటి వెంకటేష్, టి నాగరాజు, కోట రమేష్, సుందర్, ఆర్ ఎల్ మూర్తి, లెనిన్, కె అశోక్ రెడ్డి, జావిద్, మహేందర్, జగదీశ్, టి మహేందర్, విజయ్, నాగేందర్, రాజయ్య, దేవేందర్, రమ్య, రజనీకాంత్, శ్రీమాన్, అర్జున్, శ్రీకాంత్, ప్రవీణ్, అంజి, అశ్వాక్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## బర్కత్‌పుర యూరో కిడ్స్ రెండవ వార్షికోత్సవం




**విశ్వంభర, బాగ్ లింగంపల్లి:** బర్కత్పుర యూరో కిడ్స్ పాఠశాల రెండవ వార్షికోత్సవం హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కల్చరల్ ప్రోగ్రామ్స్ అండ్ గ్రాడ్యుయేషన్ శర్మని ఆకట్టుకుంది. చిన్నారుల ప్రతిభా ప్రదర్శనలు, నృత్యాలు, గీతాలు హాజరైన వారిని అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎస్తేర్ విద్యావతి, మోసెస్ ప్రవీణ్ కుమార్, లీన వర్జినియా మాట్లాడారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి పాఠశాల కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. విద్యార్థులను ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. చిన్నారుల గ్రాడ్యుయేషన్ వేడుకలు హర్షాతిరేక వాతావరణంలో సాగాయి. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రూత్ నిర్మల, కరస్పాండెంట్ థామస్ ఉదయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మేడికుంట ఆక్రమణలకు హైడ్రా చెక్

**విశ్వంభర, హైదరాబాద్ :** మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలం బాచుపల్లి గ్రామంలోని మేడికుంట చెరువు ఆక్రమణలపై హైడ్రా శనివారం చర్యలు చేపట్టింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్రధాన రహదారి వైపు ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించింది. మొత్తం 21 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు ఆక్రమణలతో 18 ఎకరాలకు కుదించబడినట్టు అధికారులు గుర్తించారు. మాంసం, చికెన్, చేపల దుకాణాల నుంచి వ్యర్థాలను చెరువులోకి వదిలి కాలుష్యం చేస్తున్నారనే ఫిర్యాదుల మేరకు మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ ఆక్రమణలు నిర్ధారించుకుని సుమారు 10 దుకాణాలను ఖాళీ చేయించారు. చెరువు ఒడ్డున పేరుకుపోయిన మాంసం వ్యర్థాలను తొలగించి, చెత్త వేయకుండా 10 మీటర్ల ఎత్తులో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. టిప్పర్లతో చెత్తను తరలించారు. అదే ప్రాంతంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు మున్సిపల్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. చెరువు ఆక్రమణలు తొలగడంతో ప్రజావినియోగంలోకి రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## భాష్యం ఆర్.కె.పురంలో నేషనల్ సైన్స్ డే




**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఆర్కె పురం భాష్యం పాఠశాలలో జాతీయ సైన్స్ డే దినోత్సవాన్నీ పురస్కరించుకొని ఎంతో ఘనంగా నిర్వహించారు. 1928 లో ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త సి.వి. రామన్ "రామన్ ఎఫెక్ట్ ఎంతో అద్భుతంగా ఆవిష్కరించినారు. దీనిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ డేగా జరుపుకుంటున్నాము అని భాష్యం పాఠశాల చైర్మెన్ రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ, సి ఈ ఓ చైతన్య లు మాట్లాడుతూ సైన్స్ మనకు నిత్య జీవితంలో ఎలా ఉపయోగపడుతుందో, దాని వలన గల ప్రయోజనాలేమిటో విద్యార్థులకు వివరించినారు. ఇందులో భాగంగా సి.వి రామన్ సైన్స్ టాలెంట్ టెస్ట్ పాఠశాలలోని విద్యార్థులందరికి నిర్వహించి ,అత్యంత ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ప్రతి సెక్షను నుండి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్ ఈ ఓ అంకమ్మ రావు, పాఠశాల ప్రిన్సిపాల్ అప్పారావు , లిటిల్ ఛాంప్స్ ప్రిన్సిపాల్ ప్రీతా సునీల్ లు పాల్గొన్నారు.

## రవీంద్ర భారతి పాఠశాలలో ఘనంగా సైన్స్ ఫెయిర్

**విశ్వంభర, హస్తినాపురం :** హస్తినాపురం రవీంద్ర భారతి పాఠశాల లో సైన్స్ ఫేర్ ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ శాస్త్రీయ నమూనాలు, ప్రయోగాలు మరియు ఆవిష్కరణలను ప్రదర్శించి తమ సృజనాత్మకతను, విజ్ఞానాన్ని ప్రతిబింబించారు. ఈ సైన్స్ ఫేర్‌కు ముఖ్య అతిథిగా పి ఎస్ ఆర్ వైస్ ప్రెసిడెంట్ - స్పేస్ సిస్టమ్స్, వ్యవస్థాపకులు , మాజీ డైరెక్టర్, డి ఆర్ డి ఓ డా. శ్రీనివాస్ శాస్త్రి హాజరై విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఆయన తన ప్రసంగంలో శాస్త్ర విజ్ఞానం దేశాభివృద్ధికి ఎంత ముఖ్యమో వివరించి, విద్యార్థులు పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సైన్స్ ఫేర్ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, పరిశోధనా తత్వం సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. భవిష్యత్ శాస్త్రవేత్తలను తీర్చిదిద్దే దిశగా ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ అరుణ కూడా పాల్గొని విద్యార్థుల ప్రదర్శనలను అభినందించారు.



## ఆహార భద్రత చట్టం పకడ్బందీగా అమలు చేయాలి

**- రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**



**విశ్వంభర, సరూర్ నగర్ :** ఆహార భద్రత చట్టం పకడ్బందీగా అమలు చేయాలి అని విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్, హయత్ నగర్ మండలంలో క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా చౌక ధర దుకాణాలను, అంగన్వాడి కేంద్రాన్ని, విక్టోరియా మెమోరియల్ రెసిడెన్షియల్ స్కూల్, వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ ను కమిషన్ సభ్యులు ఆనంద్, శారద, భారతి, జ్యోతిలతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జాతీయ ఆహార భద్రతా చట్టం 2013 అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు, అంగన్వాడీలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రణాళిక బద్ధంగా మెనూ ను రూపొందించిందని, దానికి అనుగుణంగా మధ్యాహ్న భోజనం అందించాలన్నారు.పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులందరికీ చేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. లబ్దిదారులకు చట్టబద్ధమైన హక్కులు అమలు చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, బరువు తక్కువ ఉన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు కోడిగుడ్లు, పోషకాహారం కచ్చితంగా అందించాలని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని జిల్లా సంక్షేమ అధికారికి సూచించారు. స్టాక్ రిజిస్టర్లు, అమ్మకాల రిజిస్టర్లు, కేటాయింపు ఉత్తర్వులు, ఈపోస్ లావాదేవీలను పరిశీలించారు. లబ్ధిదారులకు బియ్యం సకాలంలో అందుతున్నాయా, అక్రమాలు జరుగుతున్నాయా అనే అంశాలపై వివరాలు తీసుకున్నారు. ఐసిడిఎస్, పీఎం పోషణ పథకాల అమలు, పోషకాహార సరఫరా నాణ్యత, ప్రసూతి ప్రయోజన పథకం అమలు, ఎన్ఎఫ్ఎస్ఏ కింద అర్హ కుటుంబాల గుర్తింపు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పనితీరు, సామాజి క తనిఖీలు, విజిలెన్స్ కమిటీల పనితీరు, గోదాముల పరిస్థితి, నాణ్యత సంరక్షణ చర్యలపై చర్చించారు. నాణ్యమైన ఆహార ధాన్యాలు పార దర్శకంగా, సకాలంలో లబ్దిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కమిషన్ చైర్మన్ పర్యటనలో ఆర్డీఓలు అనంత్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, డిఇఓ సుసిందర్ రావు, డీఎంహెచ్ఓ లలితా దేవి, జిల్లా పౌరసరఫరాల అధికారి వనజాత, జిల్లా మేనేజర్ హరీష్, సంక్షేమ శాఖ అధికారులు రామరావు, రమేశ్వరి దేవి, సరూర్ నగర్ తహసిల్దార్ వేణుగోపాల్ , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విస్తృతమైన అవగాహనతోనే క్యాన్సర్ నివారణ

**- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**




**విశ్వంభర, ఎల్బీనగర్ :** వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎఫ్.సీ.ఐ.కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నందు బసవతారకం ఇండోఅమెరికన్ కాన్సర్ హాస్పిటల్, పరిశోధన సంస్థ వారు నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి. ఈ సందర్భంగా మహిళలకు నిర్వహిస్తున్న పరీక్షల మీద డాక్టర్లను అడిగి పలు వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పరీక్షలు ఉచితంగా చేయడానికి ముందుకు వచ్చిన బసవతారకం ఇండోఅమెరికర్ కాన్సర్ హాస్పిటల్ వారికి ధన్యవాదాలు తెలిపారు. విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు అందుబాటులో ఉన్న చికిత్సా ఎంపికల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుంది అని అన్నారు.ఈ కార్యక్రమాలు కీలకమైన ఆరోగ్య సంరక్షణ సమాచారాన్ని తరచుగా పొందలేని నిరుపేద వ్యక్తులను లక్ష్యంగా చేసుకుంటాయి అని అన్నారు. ఆరోగ్య సంరక్షణ సేవలకు అతీతంగా ఈ విస్తృతమైన సౌకర్యం విద్యా కార్యక్రమాలు నిర్వహిస్తుంది . సమగ్రమైన అందుబాటులో ఉండే ఆరోగ్య సంరక్షణ నిర్ధారించడానికి అత్యంత నైపుణ్యం కలిగిన అంకాలజిస్టులు ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్, కటికరెడ్డి అరవింద్ రెడ్డి,సత్తిరెడ్డి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

**- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక**



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం బలోపేతం కోసం గత మూడు సంవత్సరాలుగా పలు కార్యక్రమాలు చేపట్టినట్లు హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో వెల్లడించారు. నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గం పెన్షనర్ల ప్రధాన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నూతన కమిటీని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా పి వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం సి లింగన్న, ఆర్థిక కార్యదర్శిగా బి ప్రహ్లాద రావు ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఆర్ సీతారామయ్యను ఎంపిక చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జి శ్రీనివాసరెడ్డి, ఎన్ విష్ణువర్ధన్ రెడ్డి, కే యుగేందర్ రెడ్డి, జగదీష్ చంద్ర ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శులుగా దుబ్బాకుల వెంకటేశ్వర్లు, జీవి మనోహర్ కుమార్, ఏ లక్ష్మీనారాయణ, పి శ్యామ్ రావు, ఏబీ విజయలక్ష్మి, ఏ గంగ తదితరులు కమిటీ సభ్యులుగా ఎన్నుకోబడ్డారు. పి.ఆర్.సి కమిటీకి 29 అంశాలపై నివేదిక సమర్పించి 51 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని కోరినా ప్రభుత్వం స్పందించలేదని పేర్కొన్నారు. పెండింగ్ డి.ఆర్‌లు, బకాయిల చెల్లింపుపై తక్షణ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇ.హెచ్.ఎస్ నగదు రహిత వైద్యచికిత్స అమలుపై మంత్రివర్గ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, అమలులో సంఘ ప్రతినిధులకు ట్రస్టులో స్థానం కల్పించాలని కోరారు. సి.వి.పి రికవరీ అంశంపై సుప్రీం కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో అనుకూల తీర్పు రాకపోతే ప్రభుత్వం జోక్యం చేసుకుని పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.




## విజ్ఞాన ప్రదర్శనకు ప్రశంసలు

**విశ్వంభర, హైదరాబాద్ :** నేషనల్ సైన్స్ డే సందర్భంగా తెలంగాణ బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాదు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. "శాస్త్ర సాంకేతికత - భారత దేశ భవిష్యత్తు" అంశంపై జరిగిన సెమినార్‌లో ప్రొఫెసర్ రామచంద్రయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు వ్యవసాయం, ట్రాఫిక్ సమస్యలు, మైక్రో ప్లాస్టిక్ ప్రభావం, కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ తదితర అంశాలపై ప్రాజెక్టులు ప్రదర్శించారు. ప్రపంచం విజ్ఞానం వైపు దూసుకెళ్తోందని, విద్యార్థుల్లో వైజ్ఞానిక దృక్పథం పెంపొందించాల్సిన అవసరం ఉందని ప్రొఫెసర్ పేర్కొన్నారు. 150 ప్రాజెక్టులతో 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్ సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## జూన్ నాటికి మూసారంబాగ్ వంతెన పూర్తి చేయాలి



**విశ్వంభర, హైదరాబాద్ :** మూసారంబాగ్ హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను వచ్చే జూన్ నెలాఖరు నాటికి పూర్తిచేయాలని సికింద్రాబాదు జోన్ నూతన కమిషనర్ కే మంగతాయారు ఆదేశించారు. శనివారం సర్కిల్ డీసీ మారుతి దివాకర్, ప్రాజెక్టు అధికారులు, కాంట్రాక్టర్‌తో కలిసి పనులను పరిశీలించి పురోగతిని తెలుసుకున్నారు. వంతెన నిర్మాణం ఆలస్యమవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై పలువురు ప్రజాప్రతినిధులు, పత్రికలు దృష్టికి తీసుకువచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. ఇక ఆలస్యం లేకుండా నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

### గోల్నాక కమేళా అభివృద్ధిపై సమీక్ష

సికింద్రాబాదు జోన్ కమిషనర్ కే మంగతాయారు గోల్నాక కమేళాను శనివారం సందర్శించారు. వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ సుగుణ, డీసీ మారుతి దివాకర్, టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులతో కలిసి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. సుమారు కోటి రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులపై చర్చించారు. కాంక్రీటింగ్, డ్రైనేజీ, వాటర్ ట్యాంకర్ మరమ్మత్తులు, పైప్‌లైన్ ఏర్పాటు వంటి పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు.

## ఎల్చిగూడా బస్తీ సమస్యలు పరిష్కరించాలి



**విశ్వంభర, హైదరాబాద్ :** లోయర్ ట్యాంక్ బండ్ సమీపంలోని ఎల్చిగూడా బస్తీ వాసుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీసీ రాజ్యాధికార సమితి నాయకులు డిమాండ్ చేశారు. గ్రేటర్ ప్రధాన కార్యదర్శి మిరియాల శ్రీలత శనివారం బస్తీని సందర్శించి స్థానికులతో మాట్లాడారు. పారిశుధ్యం, మరుగుదొడ్లు, తాగునీరు వంటి కనీస వసతులు లేవని బస్తీవాసులు వాపోయారు. ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సమస్యలపై నివేదికను ఎమ్మార్వోకు అందజేసినట్టు సమితి సీఈఓ పోశాల సరస్వతి తెలిపారు. సమస్యలు పరిష్కారం కాని పక్షంలో ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

## టీటీడీకి రూ.10 లక్షల విరాళం



**విశ్వంభర, తిరుమల :** అమెరికాకు చెందిన రావిపాటి శిరీష, శివ ప్రసాద్ దంపతులు శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం బర్డ్ ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో డిప్యూటీ ఈవో లోకనాథంకు విరాళం డీడీని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు పాల్గొన్నారు.

ప్రజా విశ్వంభర
V3 NEWS

# మైదానానికి అడవి లేఖ

ఛత్తీస్ గడ్ కు చెందిన గరియాబంద్ జిల్లా కుల్హాడీ ఘాట్ అటవీ ప్రాంతం గోరుముడి గ్రామ పరిధిలోని అడవిలో ఈ భీకర సమరం చోటు చేసుకుంది. జనవరి 20 తెల్ల వారుజాము 5 గంటల 15 నిమిషాల నుండి మొదలై 22 సాయంత్రం 4 గంటల వరకు ఈ సమరం కొనసాగింది. ఈ భీకర సమరంలో అనేక దఫాలుగా జరిగిన కాల్పుల్లో మూడు చోట్ల మొత్తం 16 మంది కామ్రేడ్స్ అమరత్వం చెందారు. ఆ అమరులకు వినమ్రంగా తలవంచి జోహార్లు చెప్తుదాం. వాళ్లు కలలు గన్న నవ సమాజ స్థాపనకై తుదకంటా పోరాడుతామని శపథం చేద్దాం. మీ త్యాగం వృధా కాదని ఎలుగెత్తి చాటుదాం. ఆ అమరుల స్ఫూర్తితో వేలాది మంది నూతన తరం విప్లవకారుల్ని సృష్టించి తీరుతామని శపథం చేద్దాం.

వివిధ యూనిట్లకు చెందిన PLGA బలగాలు, వివిద స్థాయిల పార్టీ కమిటీల నాయకత్వంతో కూడిన బలగాలు మొత్తం 49 మంది వున్నాం. ఓ ప్రత్యేక పని కోసం సన్నాహాల్లో భాగంగా గత కొద్ది రోజులుగా తగిన జాగ్రత్తలతో ఉంటున్నాం. AC, DVC, SC, CC స్థాయి నాయకత్వం కూడా ఇందులో ఉంది. జనవరి 19 ఉదయం ముగ్గురితో కూడిన టీంను మరో ప్రత్యేక పనికోసం విడగొట్టి వాళ్లకు లాల్ సలాం చెప్పి పంపాం. దానితో మిగిలిన 46 మంది టీం 19 సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఘటనా స్థలానికి చేరుకుంటుండగా వాగు ఇవతలి వైపు వెదుర్ల కోసం వచ్చిన ఇద్దరు గ్రామస్థులు (ఒకరు గోరుముడి గ్రామానికి చెందిన వాడు కాగా మరొకరు బేస్రజరి గ్రామస్తుడు) అకస్మాత్తుగా తారసపడ్డారు. మనల్ని ఎలాగూ చూశారు గనుక స్థానిక DVC సభ్యురాలు (ఆమె టోటల్ కమాండర్ కూడా) వెళ్లి వాళ్లతో మాట్లాడి అర్థం చేయించి పంపించింది. తర్వాత మేం ముందుకు కదిలి వాగు అవతలి వైపుకు వెళ్లి పాత దేరాలోనే మకాం వేశాం. కమాండర్ రోల్ కాల్ చేసి సెక్షన్ల దేరాలు, కవర్లు, సెంట్రీ దిశలు, రోజువారీ ప్రోగ్రాంలో భాగంగా రొటీన్ గా చేసే పనులన్నీ బ్రీఫింగ్ చేసింది.

రోల్ కాల్ ముగియగానే నేను కమాండర్ దగ్గరికి వెళ్లి కలిసిన గ్రామస్థులు ఏ ఊరి వాళ్లు? పరిచితులేనా? అపరిచితులా? గతంలో ఏమైనా మనం అనుమానించి అర్థం చేయించి వదిలిన వాళ్లా? వాళ్లను విశ్వసించి ఇక్కడే వుండొచ్చా లాంటి ప్రశ్నలన్నీ అడిగాను. అలా అనుమానించదగిన వాళ్ల లాగా లేరు. అప్పుడప్పుడు మనం ఊర్లోకి పోయినప్పుడు గోరుముడి దాద మనని కలిసే దాదనే. మనకు కొద్ది రోజుల క్రితం పోలీసుల కూంబింగు గురించిన సమాచారం ఇచ్చింది ఇతనే. అప్పుడప్పుడు మనకు సరుకులు కూడా తెచ్చి ఇస్తాడు అని కమాండర్ చెప్పింది. మరి బేస్రజరి దాద ఎందుకొచ్చాడు? బేస్రజరీలో ఒకతన్ని ఇన్ఫార్మర్ గా గతంలో అనుమానించాం. ఇంకా క్లియర్ చేయాల్సింది మిగిలే ఉంది అన్నారు కదా! ఆ కుటుంబానికి సంబందించిన వాడా? నేను మళ్లీ ప్రశ్నించాను. ఆ కుటుంబం కాదు. ఈ గోరుముడి దాద ఈ ఊరి దాదా స్వంత అక్కను పెళ్లి చేసుకున్నాడు. కాబట్టి చుట్టరికం కోసం వచ్చాడు. ఇద్దరు కలిసి వెదుర్ల కోసం వచ్చారు. అంత డౌటుగా అయితే లేదు అనడంతో నేను నా డేరాకు వెళ్లిపోయాను. నేను కమాండర్ తో ఈ సంభాషణ చేస్తున్నంత సేపు జైరాం దాద, రాష్ట్ర కమిటీ సభ్యుడు, స్థానిక బాధ్యుడు గుడ్డు కూడా అక్కడే వున్నారు. వాళ్లిద్దరి నుండి కూడా ఎలాంటి నెగెటివ్ ప్రతిక్రియ లేక పోవడంతో కూడా నేను విషయాన్ని అక్కడితో వదిలేశాను. ఎందుకంటే నాకంటే జైరాం, గుడ్డులకే ఈ టెర్రెయిన్ పై, గ్రామాలపై పట్టు ఎక్కువ కాబట్టి కూడా నేను అంత ప్రమాదం కాదేమోలే అనుకుని వదిలేశాను.

తెల్లవారి మధ్యాహ్నం ఒక రాష్ట్ర కమిటీ సభ్యుడితో కలిసి ఓ సెక్షన్ బలగాలు విడిపోయి వెళ్లిపోవాల్సి వుంది. వాళ్లతో ఇతర కామ్రేడ్సుకు ఉత్తరాలు పంపాల్సి వుంది. రెండు రోజులుగా మా బ్యూరో ప్లానింగు మీటింగు ముగించుకుని ఉత్తరాలు రాయడం, విడిపోవడం అనే మూడ్ లో వున్నాం. మరో రోజు తర్వాత మరో ప్లటూన్ సంఖ్యలో బలగాలు విడిపోయేందుకు ప్లాన్ ఫైనల్ అయింది. రాత్రి అందరం తిని పడుకున్నాం. నేను కొన్ని ఉత్తరాలు టైపు చేశాను. మరో ఉత్తరం ఉదయం రాసి మధ్యాహ్నానికి పూర్తి చేసి ఇవ్వొచ్చులే అనుకుని రాత్రి రేడియోలో కరెంట్ అఫైర్స్, వార్తలు విని 11గంటలకు పడుకున్నాను.

ఉదయమే 5 గంటలకే మెలుకువ రావడంతో లేచి హిందీ, ఇంగ్లీషు వార్తలు విన్నాను. వెన్నెల వెలుతురు ఉంది. ఐదుంపావుకు మా ముందు వున్న A సెక్షన్ B సెక్షన్ లో పెద్ద పెద్ద శబ్దం వచ్చేలా ఝిల్లీలు సర్దడం చేస్తున్నారు. ఇది రోజు వారీగా సర్దే సమయం కాదు, అంత శబ్దం వచ్చేలా సర్దరు. ఇది ప్రత్యేకంగానే ఉంది. నేను ఆ రెండు సెక్షన్ల వాళ్లను 'ఏయ్! ఏం జరుగుతుంది? ఎందుకంత శబ్దాలు చేస్తున్నారు?' అని అరిచాను. అయినా ఎవరూ జవాబు ఇవ్వలేదు. సరికదా మరంత జోరుగా శబ్దాలతో సర్దడంతో నేనూ నా ముఖ్యమైన సామాను తీసుకుని బూట్లు తొడుక్కుని ఝిల్లీ లోంచి బయటి కొచ్చి గార్డులను పిలిచాను. ఒక గార్డు నాలుగున్నరకే ఆంబుష్ డ్యూటీకి వెళ్లిపోయాడు. మరో గార్డు లేచాడు. ఏదో అనుమానం వచ్చినట్లుంది. ముఖ్యమైన సామాన్లన్నీ తొందరగా సర్ది పట్టుకో అన్నాను. తను చేతికందిన సామానంతా పట్టుకున్నాడు. అప్పుడు కమాండర్ నా వద్దకు వచ్చి ఎ సెక్షన్ వైపు నుండి పోలీసులు వస్తున్నారట. కాసేపట్లో ఫైరింగ్ మొదలయ్యేలాగుంది. మనం వాగు అవతలి వైపు రిట్రీట్ అవుదామన్నాడు జైరాం దాద, అని నాతో చెప్పింది. సరే పదండి అన్నాను నేను. ఫార్మేషన్ లేదు అంతా గజిబిజిగా వెనుక వాళ్లు ముందు, ముందు వాళ్లు వెనుక నడుస్తున్నారు. వాగు దాటి అవతలి వైపు వెళ్లి కొంత దూరం వరకు గుట్ట పైకి ఎక్కాం. ఆరున్నర అవుతున్నది. ఉన్నఫలంగా దొరికిన సామాన్లన్నీ చేతుల్లో, తలపైన, చంకల్లో పట్టుకుని నడుస్తున్న వాళ్లు కాసేపు ఆగితే మంచిగా సర్దుకుని పోవచ్చు అంటున్నారు. సరే అని కమాండర్ కాసేపు సర్దడానికి ఆగమనే ఆదేశం ఇచ్చింది. సర్దుకుని మళ్లీ బయలుదేరాం. మేం రెండు వాగుల మధ్య గుట్టపైన ఉన్నాం.

టెర్రెయిన్: మేం ప్రవేశించిన టెర్రెయిన్ రెండు వాగుల మధ్యనున్న గుట్ట. తూర్పు దిశలో గుట్ట పై స్టెప్పు టాపు ఉంటుంది. రాజుల కాలం నాటి కోట గోడలాగా ఉండి దాన్ని ఎక్కడం గానీ, దిగడం గానీ సాధ్యం కాదు. ఆ టాపు నుండే రెండు కిలో మీటర్ల ఎడంతో టాపు పై భాగపు నీరంతా రెండు జలపాతాలుగా కిందికి జారి ఈ రెండు వాగులు ఏర్పడ్డాయి. వర్షా కాలంలోనే ఆ జలపాతాలు పారుతాయి. అక్టోబర్ నాటికే నీటి ప్రవాహం ఆగిపోయి కింద అక్కడక్కడ నీటి మడుగులు మార్చి వరకు వుంటాయి. అయితే ఈ రెండు వాగులు జలపాతం కిందికి జారుతున్న అంచున మాత్రమే వాగును దాటే అవకాశం వుంది. అది వదిలేస్తే రెండు కిలో మీటర్ల కింది వరకు ఆ వాగుల్ని మధ్యలో ఎక్కడా దాటడం సాధ్యం కాదు. పెద్ద లోయలాగా ఉంటుంది. వాగుల కింది భాగం ఏటవాలుగా ఉండి నేల ప్రారంభమవుతుంది గనుక అక్కడంతా దాటొచ్చు.

సమాచారం: గత కొంత కాలంగా ఆ దేరాల్ని ఉపయోగిస్తున్న విషయం అర్థమయి శత్రువు ఆ టెర్రెయిన్ నంతా రెక్కీ చేసుకుని వున్నాడు. మేం ఆ లొకేషన్ కు వస్తే సమాచారం ఇచ్చేలా ఇన్ఫార్మర్స్ ను ఎంగేజ్ చేసి వున్నాడు. ఈ విషయాన్ని పసిగట్టడంలో మేం విఫలమయ్యాం. సరిగ్గా ఆ లొకేషన్లోనే దేరా స్థలానికి దగ్గరలోనే వాడి నెట్ వర్క్ మనుషుల్ని టచ్ అయ్యాం. మంచి వాళ్లే లీకేజ్ చేయరని భ్రమపడి అక్కడే దేరా వేశాం. నాలుగు గంటలకు గ్రామస్థులు కలిస్తే 6 గంటలకల్లా శత్రువుకు సమాచారం వెళ్లింది. తెల్లవారి ఆరు గంటల వరకు శత్రువుకు ప్లానింగు, బలగాల మోహరింపుకు 12 గంటల సమయం చిక్కింది.

శత్రు బలగాల మోహరింపు: 19 సాయంత్రం ఇన్ఫార్మర్స్ ద్వారా మా సమాచారం చేరగానే గరియాబంద్, నువాపడ, జిల్లాలకు చెందిన పోలీసు బలగాలు, (ఈ30,SOG,), కోబ్రా బలగాలు, రెండు రాష్ట్రాల ఉన్నతాధికారుల గైడెన్స్ లో రాత్రికి రాత్రే 12 ప్లటూన్ల బలగాలు ఎంగేజ్ అయ్యాయి. (సుమారు మూడు నుండి నాలుగు వందల మంది) ఇవి ఇన్నర్ సర్కిల్లో మోహరించబడిన బలగాలు మాత్రమే. అవుటర్ సర్కిల్లో వున్న సపోర్టు బలగాలు విడిగానే.

టాపు పై భాగంలో మూడు చోట్ల మూడు ప్లటూన్ల ఒడిశా బలగాలు, రెండు జలపాతాలు దుంకే చోట దాటడానికి అనువైన స్థలాన్ని కవర్ చేస్తూ రెండు ప్లటూన్లు, వాగుల కింది భాగం దాటగలిగే ప్రాంతమంతా సీల్ చేస్తూ వరుసగా గ్యాపు లేకుండా ప్యారలల్ గా మరో నాలుగు ప్లటూన్లు, రెండు వాగుల మధ్య (మేం ప్రవేశించిన) గుట్ట మీద ఒక SOG ప్లటూన్ ను మోహరించారు. ఈ బలగాలన్నీ తెల్లవారు జాము 6 గంటలకల్లా తమ తమ పొజిషన్లను ఆక్రమించుకున్నాయి.

ఆపరేషన్: మేం వాగు నుండి నీళ్లు తెచ్చుకున్న దారి గుండా తెల్లవారు జాము ఐదు గంటలకు ఒక ప్లటూన్ బలగాలు వెన్నెల వెలుతురులో A సెక్షన్ ముందుకు ప్రవేశించి మమ్మల్ని ఆందోళనకు గురి చేసి వెనక్కి నెట్టేలా ప్రయత్నించాయి. అందుకే ఆ బలగాలు మాపై కాల్పులు చేయలేదు. పెద్ద శబ్దాలతో మా వైపు అడ్వాన్స్ అవుతున్నట్లు నటించాయి. మేం శత్రువు ఊహించినట్లుగానే వాగు దాటి రెండు వాగుల మధ్య టెర్రెయిన్ లోకి ప్రవేశించాం. అప్పుడు ఆ ప్లటూన్ మేం తిరిగి వాగు దాటకుండా నిలువరించడానికి మేం వాగు దాటిన పాయింటును ఆక్రమించుకుంది. అప్పుడిక మేం పూర్తిగా శత్రువు చక్రభందంలో ఇరుక్కుపోయాం. 20 తారీకు ఉదయం నుండి 22 నాడు సాయంత్రం దాకా సాగిన భీకర సమరం రెండు జలపాతాల మధ్య రెండు కిలో మీటర్ల పొడవు, రెండు కిలో మీటర్ల వెడల్పు గల టెర్రెయిన్ లోనే. చుట్టూ చక్రబంధం చేసిన బలగాలు కాకుండానే మధ్య టెర్రెయిన్లో మమ్మల్ని వెంటాడుతూ కదిలేందుకు మరో రెండు లేదా మూడు ప్లటూన్ల బలగాలు మోహరించబడ్డాయి.

మా రిట్రీటు: అరగంట రిట్రీట్ తర్వాత కాసేపాగి సామాన్లు సరిగ్గా సర్దుకుని మళ్లీ బయలు దేరాం. ఈ రెండు వాగుల మధ్య భాగాన్ని వీలైనంత త్వరగా దాటాలనేది మా ప్రయత్నం. రెండవ వాగు పై బాగంలో జలపాతం దుంకే చోట దాటాలని బయలుదేరాం. మేం టాపు అంచునుండి ఆ దిశగా ప్రయాణిస్తున్నప్పుడే టాపు పైనున్న బలగాలు మమ్మల్ని చూశాయి. మేం వాళ్లను చూశాం. మేం దాటాలనుకుంటున్న దిశలో ఆంబుష్ కూర్చున్న బలగాల్ని టాపు పై బలగాలు అలర్ట్ చేశాయి. వాళ్లు మా రాక కోసం కాచుకుని వున్నారు. మేం ఆ బ్యాచ్ సమీపానికి వెళ్లగానే మా పైలెట్లు శత్రువును గమనించి 'ఇక్కడ దాటడం సాధ్యం కాదు శత్రువు పొంచి వున్నాడు' అని వెనక్కి మళ్లారు. అప్పుడందరం వాగు కింది భాగాన దాటుదామని రూట్ మార్చుకుని బయలు దేరాం.

కొంత దూరం కిందికి పోయాక మరో చోట ప్రయత్నించగా అక్కడ శత్రువు బలగాలు పొంచి వుండడం గమనించి మరింత కిందికి వెళ్లాం. అక్కడ దాటుదామనుకుంటుండగా వాగు సమీపంలోకి పోగానే అక్కడ ముందే పొంచి వున్న బలగాలు మాపై ర్యాపిడ్ ఫైరింగ్ చేశాయి. మేం కూడా వెంటనే కౌంటర్ ఫైరింగ్ చేస్తూ కొంత వెనక్కి తగ్గి మరింత కిందికి ప్రయాణమయ్యాం. ఈ ఫైరింగులో కామ్రేడ్ సుఖ్ రాం (SCM అలోక్ దా గార్డు) స్వల్పంగా గాయపడ్డాడు. మరో చోట దాటే ప్రయత్నంలో భీకరంగా కాల్పులు జరిగాయి. అందులో కామ్రేడ్ జనీల (ACM పాయిలిఖండ్ దళం), కామ్రేడ్ నిర్మల (ఎసిఎమ్ ఉదంతి దళం) ఇద్దరు మహిళా కామ్రేడ్స్ వీరోచితంగా పోరాడుతూ అమరులయ్యారు. నిర్మల దగ్గరి SLR, తూటాల పోచ్ తీసుకుని ఫైరింగు చేస్తూ మరో దిశలో రిట్రీట్ మొదలు పెట్టాం. జనీల SLR తీసుకు రావడం సాధ్యం కాలేదు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఐదు చోట్ల శత్రువు తారసపడగా 4 వ చోట, 5 వ చోట భీకరంగా కాల్పులు జరిగాయి. 4 వ చోట ఒకరు స్వల్పంగా గాయపడగా, 5 వ చోట జరిగిన కాల్పుల్లో ఇద్దరు కామ్రేడ్స్ అమరులయ్యారు.

తర్వాత చుట్టూ తిరిగి మొదట ఖాళీ చేసిన దేరా దగ్గరలోకి వచ్చి ఓ మూలన కొన్ని గంటలు ఆగాం. శత్రువు చుట్టూ మోహరించి వున్నాడు. ఏ మూల ఖాళీ లేదు. కాబట్టి ఏదో ఒక చోట గండి కొట్టుకుని పోవడం తప్ప మరో మార్గం లేదనే నిర్ణయానికి వచ్చాం. అయితే చీకటి పడ్డాక మనకు అనుకూలంగా ఉంటుంది గనుక చీకటి పడే వరకు వేచి చూద్దాం అని ఆగాం.

రెండు, మూడు గంటల తర్వాత జనీల, నిర్మల అమరత్వం చెందిన దగ్గర ఫైరింగ్ చేసిన బలగాల్లోంచి ఒక బ్యాచ్ సెర్చింగ్ చేస్తూ మేమున్న దిశలో A సెక్షన్ ముందుకు రాసాగింది. ముందు వాళ్లు కొంత గాబరా పడి ఇటే వస్తున్నాడు, దగ్గరికొచ్చాడు అంటూ వెనక్కి రావడం మొదలెట్టడంతో వెదుర్లు విరుగుతున్న చప్పుడు, ఎండుటాకులు విరుగుతున్న చప్పుడు విని శత్రువు కాల్పులు (ఇది ఆరవ సారీ ఫైరింగ్ ఇందులో ఏ నష్టమూ లేదు) ప్రారంభించాడు. మేం కౌంటర్ ఫైరింగ్ చేస్తూ గుట్ట పై వైపు వెళ్లాం. (మొదట దాటాలనుకున్న దిశలోనే) కొంత దూరం వెళ్లే సరికి మేం ఆ దిశలో వస్తున్నట్లు మాపై ఫైరింగ్ చేసిన బలగాలు సమాచారం ఇవ్వడంతో గుట్టపైనున్న శత్రువు మాకు అడ్డంగా వచ్చాడు. అది గమనించి పైలెట్లు మళ్లీ వెనక్కి మళ్లారు. ఏదైనా ఎత్తైన ప్రదేశాన్ని ఆక్రమించుకుని శత్రువు దగ్గరికొస్తే ఆఖరి తూటా వరకు కొట్లాడుదాం అని నిర్ణయించుకుని



ఇంతకు ముందు కాల్పులు జరిగిన ఇవతలి పెద్ద పెద్ద బండ రాళ్లను కవర్ చేసుకుని ఆగాం. గుట్టపై (రెండు వాగుల మధ్య గుట్ట)నున్న SOG ప్లటూన్ సెర్చ్ చేస్తూ మేమున్న పాయింటుకు చేరుకుంది. మేం ముందే శత్రువు వస్తున్న దిశలో కుక్కర్ బాంబ్ ఫిట్ చేశాం. శత్రువు సమీపించగానే సుఖ్ రాం పేల్చాడు. కానీ ఏదో లోపంతో కుక్కర్ పేలలేదు. శత్రువు మా సమీపానికి వచ్చి విపరీతంగా ఆటో ఫైరింగ్, షెల్లింగ్ చేశాడు. ఈ కాల్పుల్లో మరో కామ్రేడ్ గాయపడ్డాడు. సాయంత్రం నాలుగు గంటలకు ఈ కాల్పులు జరిగాయి. చీకటి అయ్యే వరకు మరో రెండు గంటలు ఆ కాల్పులు జరిగిన చోటనే కొంత కిందికి జరిగి కవర్లు తీసుకుని వున్నాం. మా చుట్టూ క్లోజ్డ్ రేంజిలో బలగాలు మోహరించి వున్నాయి. రేపటి యుద్ధం కోసం శత్రువూ, మేం ఎవరి ఆలోచనల్లో వాళ్లం మునిగి వున్నాం.

మేం చీకటి కాగానే కోర్ గ్రూపు మరో సారి సమావేశం అయ్యాం. ఈ రాత్రికి ఎలాగైనా ఏదో ఓ మూలన గండి కొట్టుకుని పోవాల్సిందే. తెల్లారితే మరిన్ని బలగాలు మోహరించబడతాయి. ఒక్కరం కూడా మిగలం. కాబట్టి చీకటి మాటున ఏదో ఓ మూలన బ్రేక్ చేసుకుని పోదాం అని నిర్ణయించుకున్నాం. ఆ క్రమంలో అమరులయ్యే వాళ్లు అవుతారు మిగిలే వాళ్లు మిగులుతారు అనుకున్నాం. ఏ మూలన బ్రేక్ చేయాలో నిర్ణయించుకున్నాం. ముందు కదిలే బ్రేకింగ్ టీం ఐదుగురిని నిర్ణయించి అర్థం చేయించాం. మాకు చివరి ఫైరింగ్ జరిగిన పాయింటుకు 50 గజాల దిగువన మేమున్నాం. మాపై కాల్పులు చేసిన శత్రువు అక్కడే ఆగాడా? కొంత వెనక్కి వెళ్లాడా? స్పష్టత లేదు. మాకు మూడు వైపులా శత్రువు వంద గజాల దూరంలో వున్నది మాత్రం అర్థమవుతున్నది. కాబట్టి పై బాగానికే చప్పుళ్లు లేకుండా చెక్ చేస్తూ వెళ్లాలనీ బయలు దేరాం. చీకటి కాగానే ఎక్కడ మోహరించిన బలగాలు అక్కడ మేం పోలేదు ఉన్నాం అని తెలియజేయడానికా? ఏదైనా జంతువులు నడుస్తున్న శబ్దాలు విని మేము అనుకుని కాల్పులు చేశారో గానీ ఒక బ్యాచీ తర్వాత మరో బ్యాచీ కొంత సేపు కాల్పులు జరిపారు. అవన్నీ వింటూనే మేం అనుకున్న దిశలో ముందుకు కదిలాం. శత్రు సమీపానికి చేరగానే రెండు వైపుల నుండి విపరీతమైన కాల్పులు, షెల్లింగ్ ప్రారంభించాడు శత్రువు. మేం కూడా అంతే భీకరంగా కాలుస్తూ దగ్గరి వరకూ వెళ్లాం. పైలెట్లు సాధ్యం కాదని మళ్లీ వెనక్కి మళ్లారు. దాంతో అందరం మరోసారి వెనక్కి వచ్చాం. అయితే అంత ఫైరింగులో ఎవరూ గాయపడలేదు. రాత్రి ఎనిమిదయింది. చేసేదేమీ లేదు ఇక్కడ సాధ్యం కాదంటే మళ్లీ గుట్టపైకైనా పదండి. వాగు మొదట్లోనైనా దాటుదాం అని పైకి బయలుదేరాం. కొద్ది సేపటికి మేం వెనక్కి అటువైపు వస్తున్న విషయం ఇక్కడి బలగాలు సమాచారం ఇవ్వడంతో పై వైపున్న శత్రువు కాల్పులు ప్రారంభించాడు. మేం మధ్యలో ఆగిపోయాం. అందరూ అలిసి పోయారు. చాలా తూటాలే ఖర్చయ్యాయి. కొన్ని తుపాకులు స్ట్రక్కయ్యాయి. అందరిలో ఇక బైట పడడం సాధ్యం కాదనే వాతావరణం నెలకొంది. అక్కడ మరోసారి మాట్లాడుకుని ఇక వేరే మార్గం లేదు. పైకి పోయినా అదే పరిస్థితి కాబట్టి మళ్లీ గుట్ట ఎక్కే బదులు చావో రేవో ఇక్కడే తేల్చుకుందాం. ఇక్కడే మరోసారి గండి కొట్టుకుని కింది వైపే రిట్రీట్ అవుదాం. ఎవరూ వెనక్కి రావద్దు అని నిర్ణయించుకుని మళ్లీ అదే చోటుకు దూసుకు పోయాం. కాల్పులు చేస్తూ క్రాలింగ్ చేస్తూ చాలా సమీపానికి దూసుకు పోయాం. ముందు బ్రేకింగ్ టీం ఐదుగురు వాళ్ల తర్వాత మిగతా వాళ్లం ప్యారలల్లో ముందుకు కదులుతున్నాం. నాకు ఎడమ పక్కన నా గార్డు మోహన్, మోహన్ కు మరింత ఎడమన SCM గుడ్డు, నా ముందు SCM అలోక్. నా వెనక CCM జైరాం దాద. మరో SCM సత్యం నాకు కుడి పక్కన. బ్రేకింగ్ టీంకు నాకు మధ్యన సత్యం. అక్కడ గంటసేపు జరిగిన భీకర యుద్ధంలో శత్రువు ముందే ఏర్పర్చుకున్న కవర్లల్లో, అనుకూల స్థితిలో వున్నాడు. మేం అననుకూల స్థితిలో, బలహీనమైన కవర్లు. చీకట్లో శత్రువు ఎక్కడ పొంచి వున్నది అర్థం కాని స్థితిలో మొండిగా యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలోనే 12 మంది ప్రియతమ కామ్రేడ్సు సాహసంతో పోరాడుతూ శత్రువు చేసిన ర్యాపిడ్ ఫైరింగ్, విపరీతమైన షెల్లింగు లో మా కళ్ల ముందే అమరులయ్యారు. షెల్స్ లో విషం కలిపినట్లున్నారు. తూటాలు తగిలిన వాళ్లకు అంత నొప్పి లేదుగానీ షెల్స్ ముక్కలు తగిలిన వాళ్లు మాత్రం నొప్పి, మంట భరించలేనంతగా వుండడంతో హృదయ విదారకంగా అరవడమే గాక వెంటనే తీవ్రమైన దాహం, వాంతులు కూడా చేసుకుంటున్నారు. (మానవాధికార సంఘాల వాళ్లు ఈ విషపు పూతతో వున్న షెల్స్ వాడకాన్ని నిషేదించేలాగా గొంతెత్తాల్సిన అవసరం వుంది) నాకూ ఓ విషపు ముక్క తగిలింది గనుక నా ప్రత్యక్ష అనుభవంతో చెపుతున్న. బ్రేకింగ్ టీం మళ్లీ సాధ్యం కాదని తెలియజేయడంతో సత్యం వెనక్కి రమ్మని ఆదేశించాడు. అందరం మళ్లీ వెనక్కి మళ్లాం. అమరులైన 12 మంది అమరులు కాగా మిగిలిన కొద్ది మందికి స్వల్ప గాయాలయ్యాయి. మిగతా వాళ్లంతా బాగానే వున్నారు. 33 మందిమి మళ్లీ వెనక్కి మళ్లాం.

జనవరి 20 రాత్రి రెండవ సారి బ్రేకింగ్ సమయంలో అమరులైన 11 మందిలో 1. కామ్రేడ్ రామచంద్రారెడ్డి @చలపతి @జయరాం (సీసీఎమ్/ఒడిశా రాష్ట్ర కమిటి కార్యదర్శి) 2. కామ్రేడ్ సుపో సన్ను @ గుడ్డు (DGN డివిజన్ కార్యదర్శి/ రాష్ట్ర కమిటీ సభ్యుడు) 3. కామ్రేడ్ బంటి @ అలోక్ (ఒడిశా రాష్ట్ర కమిటి సభ్యుడు, ఒడిశా భూమి పుత్రుడు) 4. కామ్రేడ్ మాను (వన్ కంపని పిపిసిఎమ్ డికె) 5. మూచాకి ఎర్రాల్ @ శంకర్ (ఎసిఎమ్ బిబిఎమ్ డివిజన్), 6. కామ్రేడ్ రింకి (ఎస్ డి కె ఎసిఎమ్ DGN డివిజన్) 7. కామ్రేడ్ రామె (పాయిలిఖండ్ ఎసిఎమ్ డిజిఎన్ డివిజన్) 8. కామ్రేడ్ మోహన్ @ ఉంగాల్ (SCM గార్డ్(PM)BBM డివిజన్)9. కామ్రేడ్ సుఖ్ రాం (SCM అలోక్ గార్డ్ PM) 10. కామ్రేడ్ దేవాల్ (CCM గార్డుPM) 11. కామ్రేడ్ రవి (DVCM గార్డు PM DGN డివిజన్) వీళ్లంతా ఉన్నారు.

మళ్లీ గుట్ట పైభాగం వైపు బయలు దేరాం. ఈ సారైనా తెల్లవారక ముందే పైభాగంలో ఎలాగైనా దాటాల్సిందే అని బయలు దేరాం. కొంత దూరం వెళ్లేసరికి మా దిశ అర్థమై పైనున్న రెండు బ్యాచీలు వాటి మధ్యనున్న ఖాళీని నింపేస్తూ దారిని మూసేశాయి. మా అడ్వాన్సు మెల్లగా సాగుతోంది. ఎంత చెప్పినా బ్రేకింగు ఫోర్స్ స్పీడుగా కదలడం లేదు. చిన్న కట్టె విరిగినా శత్రువు ఇక్కడే వున్నాడన్నట్లు అనుమానిస్తూ స్లోగా కదలడంతో శత్రువుకు మేం చేరే సరికి దారి మూసేసే అవకాశం లభిస్తున్నది. చివరికి తెల్లారింది. పైనున్న శత్రువు దగ్గరికి వెళ్లి కొద్ది దూరంలో ఆగిపోయాం. అక్కడే 21 ఉదయం పది గంటలయింది. తెల్లారగానే 11 మంది అమరులైన చోట మరోసారి శత్రువు విపరీతంగా కాల్పులు, షెల్లింగు చేశాడు. గాయపడి ఉన్నవాళ్లు దగ్గరికొచ్చాక కాల్పులు చేస్తారనే భయంతో శత్రువు కాల్పులు, షెల్లింగు చేస్తున్నాడనీ, కాసేపట్లో అమరుల శవాలు శత్రువు స్వాధీనం చేసుకోబోతున్నాడని అర్థమవుతున్నది. మేం మధ్య వరకు వచ్చి ఎటు వెళ్లామనేది శత్రువుకు అర్థం కాలేదు. మేం 33 మంది వున్నాం.

మా దారిని మూసి వుంచిన రెండు ప్లాటూన్లు మాకు ఇరువైపుల 50 గజాల దూరం నుండే కిందికి దిగాయి. బలగాలు వాపస్ పోవడానికి సిద్ధమవుతున్నాయని అర్థమవుతున్నది. మా ముప్పై మూడు మందిలో అందరికంటే చివరన కింది వైపు నేనున్నాను. నా రెండవ గార్డు కూడా గుంపులో ఎక్కడో ముందే వున్నాడు. మిగిలిన వాళ్లంతా కొంత పైననే వున్నారు. సత్యం మరో కామ్రేడ్ మధ్యలో వున్నారు. కిందికి దిగిన శత్రువు సరిగ్గా నా ముందుకు వచ్చి నాకు 20 గజాల దూరంలో ముగ్గురు SOG జవాన్లు ఆగారు. అయితే వాళ్లు మమ్మల్ని చూడడం లేదు. వాళ్ల ఒడియా సంభాషణంతా నేను స్పష్టంగా వింటున్నాను. 11:30 వరకు చూసి రిటన్ రావాల్సిందిగా వాళ్లకు ఆదేశాలు అందినట్లు వాళ్ల మాటల ద్వారా అర్థమవుతున్నది. మధ్యలో వున్న కామ్రేడ్సు శత్రువు చూస్తాడనే టెన్షన్ తో లేచి పరిగెత్తితే మా ఉనికి అర్థమై మళ్లీ కాల్పులు మొదలై, ఆపరేషన్ ఇంకా పొడిగించబడుతుందని నాకు అర్థమవుతున్నది. నేను నా వైపు చూసిన ప్రతీ కామ్రేడుకు చేతి సైగల ద్వారా శత్రువు వెళ్లిపోనున్నాడనీ, కదలకుండా కూర్చోండని సైగ చేస్తూనే వున్నాను. కాసేపు అలా కూర్చున్నారో లేదో పైవాళ్లు, మధ్య వాళ్లు టెన్షన్ భరించలేక శత్రువు చూస్తాడనే గాబరాకు లోనై పైకి పరిగెత్తడం మొదలెట్టారు. ఆ చప్పుల్లు వినడంతోనే నా ముందున్న శత్రువు అలర్టై కాల్పులు ప్రారంభించాడు. అప్పటికే మా వాళ్లంతా దూరంగా వెళ్లారు గనుక ఎవరికీ ఏం కాలేదు. నేనున్న స్థలం ప్రమాదకరమైంది. అక్కడి నుండి ఏటవాలు స్థలంలో ఎలాంటి కవర్లు లేకుండా సుమారు 70,80 గజాలు పైకి పరిగెత్తాలి. ఆలోగా శత్రువు కాలిస్తే నేల రాలడం ఖాయం. కాబట్టి నేను ఎలాంటి టెన్షన్ లేకుండా అదే కవర్లోనే నిబ్బరంగా వుండి నా కవరు ముందు నుండి నా సహచరులను వెంటాడేందుకు అడ్వాన్స్ అయ్యే శత్రువును ఒక్కొక్కన్ని మట్టుబెట్టేందుకు నిశ్చయించుకున్నాను. గురి పెట్టి చూస్తూ కూర్చున్నాను. అంతలో శత్రువు గుసగుసగా మాట్లాడుకుంటూ అడ్వాన్సు అవుతున్నాడు. ఒకడు నా కవర్ ముందుకు వచ్చి ఆ బండ వెనక ఎవరైనా వున్నారా? అని క్లియర్ చేసుకునేందుకు నాకు పది గజాల దూరం నుండి నాకు గురి పెట్టాడు. నేను అలా వస్తాడనీ ఊహించే తయారుగా వున్న గనుక మొదటి తూటా నేనే పేల్చాను. వాడు తత్తరపడి పక్కనున్న కవర్లోకి దొర్లి నాపై ఒక రౌండు కాల్చాడు. నేను మళ్లీ వాడిపై మూడు రౌండ్లు కాల్చడంతో వాడు తీవ్రంగా గాయపడి వాడి తుపాకి మూగబోయింది. మిగిలిన ఇద్దరు శత్రువులకు నేను ఆ బండ చాటున వుండి కాల్పులు చేస్తున్నాననీ అర్థమై వాళ్లు నా బండపై నుండి కాలుస్తున్నారు. అయితే కాసేపట్లో వాళ్లిద్దరు నాకు ఇరువైపులా కొంత దూరం నుండి బండకు ఇవతలి వైపు కవర్ టు కవర్ వచ్చి కాల్పులు చేస్తే నేను చావడం ఖాయం. కాబట్టి ఆ అవకాశం వాడికి ఇవ్వకుండా వాళ్లిద్దర్ని చంపడంలోనే నా రక్షణ ఇమిడి వుందని అనుకుని వెంటనే బండ వెనుక స్టాండింగు పొజిషన్లో నిలబడి ఆ ఇద్దర్ని అణిచి పెట్టడానికి రెండు మూడు రౌండ్లు పటాపట్ కాల్చగానే వాడు గందరగోళానికి గురయ్యాడు. అంతలోనే నేను నిటారుగా నిలబడి గురి చూసి మళ్లీ ఒకడిపై మూడు రౌండ్లు కాల్చాను. వాడు తీవ్రంగా గాయపడి వెనక్కి కవర్లలోకి జారుకుంటున్నాడు. నేను అలా చేస్తాననీ ఊహించని శత్రువుల్లో మరొకడు పరుగు లంకించుకున్నాడు. మళ్లీ నిలబడి మరోసారి గాయపడ్డ వాడిపై నేను మరో మూడు రౌండ్లు కాల్చే సరికి నా మ్యాగజైను ఖాళీ అయింది. అక్కడ ఆగింది ముగ్గురు SOG జవాన్లే మిగిలిన వాళ్లు మరో వంద గజాల దూరంలో ఆగారు. పరిగెత్తిన వాడు వాళ్ల దగ్గరికి వెళ్లాడు. నేను రిట్రీట్ కావడానికి ఇదే మంచి సమయం అనుకుని నేను బెండ్ రన్లో పైభాగం వరకు పరిగెత్తాను.

అప్పటి వరకు రెండు రోజులుగా జరుగుతున్న భీకర యుద్ధంలో 13 మంది అమరులు కాగా మిగిలిన 33 మంది కామ్రేడ్సు ఒకే బ్యాచ్ గా వున్నాం. నేను ఒంటరి అయిన సమయం (21 తారీకు మధ్యాహ్నం) నుండి మిగిలిన కామ్రేడ్స్ కూడా మూడు , నాలుగు ముక్కలుగా విడిపోయారు. వారిలో కళ (ఎసిఎమ్ గుడ్డు గార్డు) కూడా ఒంటరి అయింది. మధ్యాహ్నం 12 గంటలకు కళను అదే స్థలంలో బండల మాటున దాగి ఉన్న చోటు నుండి పట్టుకుని చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు. సాయంత్రం మూడు గంటలకు ఒంటరైన సత్యం, జైనీల్ని మరికొంత దూరంలో పట్టుకుని హింసించి కాల్చి చంపారు. సత్యం వద్ద అప్పటికే తన ఎకే లోని తూటాలన్నీ అయిపోయినట్లు నాకు రిపోర్టు చేసి వున్నాడు. సత్యం, జైనీలతో కలిపి 21 సాయంత్రం వార్తల్లో 16 శవాలు స్వాధీనం చేసుకున్నట్లుగా ప్రకటించారు.

20 తారీకు మధ్యాహ్నం జనీల, నిర్మల, 20 రాత్రి బ్రేకింగ్ సమయంలో చలపతి సహా 11 మంది, 21 మధ్యాహ్నం కళ, 21 సాయంత్రం కామ్రేడ్ సత్యం (ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు/ రాష్ట్ర మిలిటరీ కమిషన్ సభ్యుడు) తన గార్డు జైనీ ఇలా మొత్తంగా 16 మంది కామ్రేడ్సు అమరులు కాగా మిగిలిన వాళ్లు తమ తమ పద్దతుల్లో సురక్షితంగా రిట్రీట్ అయ్యారు. శత్రువు ఆపరేషన్ మాత్రం 22 సాయంత్రం వరకూ కొనసాగింది.

ఒంటరైన నాకు టెర్రెయిన్ పై పట్టు లేదు. మిగతా వాళ్లు ఎటు వెళ్లారో అర్థం కాలేదు. ఏం చేయాలా? అని ఆలోచిస్తుండగా నాకొక అద్భుతమైన సొరంగం కనిపించింది. అది ఎలుగుబంటి స్థావరం. దానిపై బాంబింగ్ చేసినా ఏమాత్రం చెక్కుచెదరనంత బలంగా వుంది. నేను దగ్గరికి వెళ్లి చూశాను. లోపలంతా చీకటిగా వుంది. ఒకే మనిషి పట్టేంత అండా సెల్ కంటే కూడా ఇరుకుగా వుంది. లోపల దూరేందుకు ఇరుకైన దారి వుంది. నేను ఆలస్యం చేయకుండా మిగిలిన పోరాటం ఒంటరిగా చేసేందుకు నిశ్చయించుకుని నా ఎమర్జెన్సీ సైనిక బ్యాగ్, నా ప్రియనేస్తం కలాష్నికోవ్ సహా అందులో దూరాను. దూరిన ద్వారం వైపు కలాష్నికోవ్ ను గురి పెట్టి కూర్చున్నాను. ఒక వేళ శత్రువు వెంటాడుతూ వచ్చి ఆ ద్వారం వద్ద తలపెట్టి చూస్తే తప్ప నేను కనిపించను. ఆ ద్వారం వద్దకు వచ్చిన శత్రువు తలను నా కలాష్నికోవ్ తో ఎగరగొట్టగలను. అలా ఆలోచిస్తూ ముందు జరగబోయే యుద్ధానికి సిద్ధమై వేచి చూస్తున్నాను.

అయితే బండ దగ్గర శత్రువుతో జరిగిన పోరాటంలోనే నా తూటాలన్నీ అయిపోయాయి. అప్పటికే రోజున్నరగా జరుగుతున్న యుద్ధంలో ఆరు చోట్ల నేను కూడా ఫైరింగ్ చేశాను. ఆచితూచి కాల్చినప్పటికీ ఈ ముగ్గురు శత్రువులతో జరిగిన చివరి పోరాటంలో ఆఖరికి నా కలాష్నికోవ్ మూగబోయింది. ఏమయింది దీనికి అని మనసులోనే తిట్టుకుంటూ కార్క్ చేసి చెక్ చేస్తే మ్యాగజైన్ ఖాళీగా వుంది. పౌచ్ లోంచి మరో మ్యాగజైన్ తీసి చూస్తే అదీ ఖాళీగానే ఉంది. చివరికి ఒకే ఒక్క తూటా మాత్రమే మిగిలింది. ఈ ఒక్క తూటాతో ఒక్క శత్రువునయినా చంపి చావాలని నిర్ణయించు కున్నాను. వెంటనే ఆ తూటాను చాంబర్లోకి కార్క్ చేశాను. అది మరో శత్రువు ప్రాణాల్ని తీసేందుకు సిద్దమై చాంబర్లో కూర్చుని నా ఆదేశం కోసం ఎదిరి చూస్తున్నది.

మధ్యాహ్నం 12 గంటల సమయంలో రెండవ వాగు జలపాతం మొదట్లో దాటే పాయింటు దగ్గర మరోసారీ శత్రువు విచ్చలవిడి కాల్పులు చేశాడు. నాకంటే ముందు రిట్రీట్ అయిన కామ్రేడ్స్ వాగు దాటేందుకు ప్రయత్నిస్తుండగా అక్కడ మాటుగాచిన శత్రువు కాలుస్తున్నాడనీ అర్థమవుతున్నది. ఈ యుద్ధంలో మరికొందరు అమరులై వుంటారు అనుకున్నాను. మిగిలిన వాళ్లు మళ్లీ వెనక్కి తిరిగి మొదటి వాగు పై బాగాన దాటేందుకు రిట్రీటవుతారని ఊహించాను. సరిగ్గా మూడు గంటల సమయంలో ఆ పాయింట్ దగ్గర కూడా విపరీతంగా శత్రువు కాల్పులు జరిపాడు. అక్కడ మరికొంత మంది అమరులై వుంటారనీ మనుసుకు తోస్తున్నది.

21 తారీకు రాత్రంతా ఎక్కడి బలగాలు అక్కడే మోహరించి వుండి ఒక బ్యాచ్ తర్వాత మరో బ్యాచ్ రాత్రంతా విచ్చలవిడిగా కాల్పులు, షెల్లింగు చేస్తూనే వున్నారు. 22 తారీకు ఉదయం కూడా ఒకటీ, రెండు బ్యాచీలు కాల్పులు జరిపాయి. 22 సాయంత్రానికి గానీ శత్రు బలగాలు ఆపరేషన్ విరమించుకుని విత్ డ్రా అయ్యాయి.

నేను ఒంటరిగా రెండు రాత్రులు, రెండు పగళ్లు గడిపాను. పగలంతా ఎలుగుబంటి స్థావరంలో, రాత్రంతా ఎలుగుబంటి వాకిట్లో పరుపు బండపై పడుకున్నాను. నాతో ఎలాంటి తినుబండారాలు లేవు. నీళ్లూ లేవు. కేవలం ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ తో కూడిన సైనిక జోల మాత్రమే వుంది. నా వాటా రడీమేడ్ ఫుడ్, నీళ్ల డబ్బాలన్నీ గార్డుల దగ్గరే వుండేవి. ఒక గార్డు అమరుడు కాగా మరో గార్డు మిగతా గుంపుతో కలిశాడు నా నుండి దూరమయ్యాడు. 19 రాత్రి తిన్న అన్నమే. నీళ్లు తాగకున్నా 21 టి మధ్యాహ్నం ఒంటరి అయి ఎలుగుబంటి స్థావరం చేరాక ఒక సారి మూత్రం పోశాను. కనీసం 200 మిల్లీ లీటర్లు అవుతుందేమో! మూత్రం పోస్తున్నప్పుడు అనాలోచితంగా పోశేసాను. అయిపోగానే అరే మూత్రం జిల్లీలో పట్టుకుని వుంటే తాగేందుకు పనికి వచ్చేది కదా అనే ఆలోచన రాగానే నన్ను నేను తిట్టుకున్నాను. ఈ ఆలోచన కొంచెం ముందు వచ్చుంటే బాగుండు కదా అనుకుని ఈ సారి మూత్రం వస్తే పట్టి వుంచడానికి దొడ్డికి నీళ్లు తీసుకుపోయేందుకు ఉపయోగించే ఝిల్లీని సిద్దం చేసి పెట్టుకున్నాను. నీళ్లే తాగనపుడు మళ్లీ మూత్రం వస్తుందా? ఏమో! అనుమానమే. అయినా ఓ ఆశ.

ఒంటరిగా వున్న ఆ సమయంలో వరంగల్ జిల్లా మోరం పెల్లి వెంకన్న గుర్తొచ్చాడు. శత్రువుతో 8 గంటలు ఒంటి చేత్తో వీరోచితంగా పోరాడిన సాహసిక ఘట్టం గుర్తొచ్చింది. ఆ కామ్రేడ్ తో గడిపిన జ్ఞాపకాలు మనుసులో మెదిలాయి. సింగరేణి అమరుడు సమ్మిరెడ్డి జ్ఞాపకాలు, ఆయన పోరాడిన వీరోచిత ఘట్టం, గడ్ చిరోలిలో కామ్రేడ్ రణిత ఒంటరిగా జొన్న చేన్లో చుట్టుముట్టబడి గంటల తరబడి తన .303 ఆయుధంతో సి60 కమాండోలతో పోరాడిన ఘట్టం, రష్యా విప్లవ చరిత్రలోని అజేయ సైనికుడి సాహసం ఇవన్నీ మనసులో రీళ్లలాగా ఒకటి తర్వాత మరొకటి మెదిలాయి.

బాగా ఆకలిగా వుంది. నేను పచ్చని అల్లి పొదల కింద వున్నాను. విచిత్రమైన ఆలోచన తట్టింది. శాకాహార జంతువులు ఆకులు తిని బతుకుతున్నప్పుడు మనమెందుకు బతకలేం?! వెంటనే లేత అల్లి పొదల ఆకులు తెంపుకుని మెత్తగా నమిలి తిన్నాను. అద్భుతమైన రుచిగా అనిపించింది.

మూత్రం వచ్చేలాంటి ఫీలింగు కలగడంతో ఝిల్లీ తీసుకుని అందులో మూత్రం పోశాను. కష్టంగా ఓ 50 ml అవుతుంది. రెండు గుటకలు తాగాను. ఉప్పగా, ఒక రకమైన వాసనగా వుంది. అప్పుడు గాంధేయవాది రాజీవ్ దీక్షిత్ ఉపన్యాసాలు గుర్తొచ్చాయి. దేశ ప్రధానీ మురార్జీ దేశాయి తన మూత్రం తనే తాగే వాడనే విషయం గుర్తొచ్చింది. మన పార్టీలో కూడా ఇలాంటి స్థితిలో మూత్రం తాగిన ఘటనలు స్మరణకు వచ్చాయి. ఆ సమయంలో అమృతం లాంటి మూత్రం తాగుతూ, లేత ఆకులు తింటూ మరో రెండు రోజులు గడపవచ్చనే భరోసా కలిగింది.

ఎలుగుబంటి వాకిట్లో బండపై కూర్చుని ఈ ఘటనా చక్రాన్నంతా రికార్డు చేద్దామని సైనిక జోలలోని నా oppo mobile బయటికి తీసి WPS లో ఓ పేజీ ఓపెన్ చేసి టైపు చేయడం మొదలెట్టాను. నా చుట్టూ శత్రుబలగాల చక్రబందం అలాగే వుంది. దాని మధ్యలో నా పనిలో నేను. కనీసం ఇంత ఘోరం ఎలా జరిగిందో? మిగిలిన పార్టీకి, బయటి సమాజానికి, విప్లవ శిబిరానికి తెలియజేయాలనే ఆరాటంతో రాయడం మొదలు పెట్టాను. నిన్నటి వార్తల్లో 16 శవాలు స్వాధీనమయినట్లు ప్రకటించాడు. ఆ అమరులందరి లిస్టు తయారు చేశాను. 21 సాయంత్రం AK తో పాటు అమరులైన ఇద్దరు ఎవరై వుంటారు? అని ఊహిస్తున్నాను. బ్రేకింగ్ సమయంలో అమరులైన కామ్రేడ్సుకు చెందిన సెమీ, ఆటో ఆయుధాలన్నీ మిగిలిన సహచరులు తెచ్చారు. AK తుపాకులు కల్గి వున్న నలుగురు కామ్రేడ్సు గుర్తొచ్చారు. అందులో ఎవరో ఒకరు అయి వుంటారు అనుకున్నాను. అయితే ఎవరనేది స్పష్టంగా మాత్రం నిర్ధారించుకోలేక పోయాను. మిగతా సహచరులు కలిశాకే సత్యం, జైనీ అనే విషయం నిర్ధారణయింది.

నేను టైపు చేస్తుండగా నా ముందున్న కొమ్మ మీదికి గంతులేస్తూ, శబ్దం చేస్తూ ఓ బెట్టుడుత వచ్చింది. చాలా అందంగా వుంది. అది నా వైపు గుడ్లు మిటకరించి చూస్తూ తన ముందరి కాళ్లు రెండింటితో తన మూతిని రుద్దుకుంది. అది చిన్న పండ్లేవో తింటున్నది. అవి నాకు అందనంత పైనున్నాయి. బెట్టుడుతను చంపి కాల్చుకుని తింటే అనే ఆలోచన వచ్చింది. కానీ దానిని చంపే సాధనం నా వద్ద ఏం లేదు. నాకు వేట చేయడం కూడా రాదు. అది మగ పొందుకోసం శబ్దాలు చేస్తూ మరో ఉడుతను ఆహ్వానిస్తున్నది. పోనీలే అందమైన చిన్న జంతువు. ప్రకృతికే అందానిస్తుంది. దాన్ని చంపొద్దనుకున్నాను. కాసేపటికి అది దూరంగా వెళ్లింది. నేను మళ్లీ టైపింగులో మునిగి పోయాను.


21 మధ్యాహ్నం నేను టైపు చేస్తుండగా నాకు వంద గజాల దూరంలో శత్రువు వస్సున్న అలికిడి వినబడడంతో నేను మొబైల్ బంద్ చేసి వెంటనే నా ఎమర్జెన్సి సైనిక జోల, కలాష్నికోవ్ తో వెంటనే ఎలుగు బంటి స్థావరంలోకి వెళ్లి ద్వారం వైపు గురి పెట్టి ఓ గంట సేపు వేచి చూశాను. మాటలు శబ్దాలు దూరమయ్యాక మళ్లీ బైటికి వచ్చి పరుపు బండపై కూర్చుని రాయడం కొనసాగించాను. రాత్రీ, పగలూ రెండు డ్రోన్లు ఒకటి తెల్ల రంగుది, మరొకటి లైట్ రెడ్ కలర్ ది మాపైన 24 గంటలూ చక్కర్లు కొడుతూనే ఉన్నాయి. తక్కువ శబ్దంతో గద్ద కంటే చిన్న సైజులో వుండి మిరప తోటల్లో పురుగు మందు కొట్టే పంపు చేసే శబ్దం లాంటి శబ్దంతో తిరుగుతుండేవి. ఒకసారి నేను రాతలో మునిగి వుండగా హఠాత్తుగా నా తలపైకి ఎర్ర డ్రోన్ వచ్చింది. నేను వెంటనే లేచి ఏయ్! నా ఫోటో గానీ తీసావా ఏంటి? అంటూ దాని వైపు టాటా చెపుతూ చేయి ఊపి వెంటనే అల్లి పొదల కిందికి జారుకున్నాను.

22 సాయంత్రం 5 గంటలకు ఓ సారి నా సమీపంలోంచి శత్రు బలగమొకటి కో కో అంటూ, మ్యావ్, మ్యావ్ అంటూ సిగ్నల్స్ ఇస్తూ వెళ్లింది. అది వెళ్లి పోయిందా? నాకు వంద గజాల దూరంలో మకాం చేసిందా? అర్థం కాలేదు.

20 తారీకు రాత్రీ కళ్లల్లోనే తెల్లారింది. 21, 22 రెండు రాత్రులు ఎలుగుబంటి వాకిట్లో నిద్రించాను. రాత్రి విపరీతమైన చలి. ఒంటిమీది డ్రెస్సు, ఓ రుమాలు తప్ప మరో గుడ్డ ముక్క కూడా లేదు. రుమాలు చెవులకు కట్టుకుని ముడుచుకుని బండరాళ్ల మధ్య పడుకునే వాన్ని. చలికి దవడలు టకటక కొట్టుకునేవి. శరీరం వజవజ వనికేది. అలా అయినప్పుడల్లా ఓ పది నిమిషాలు నిలబడి వేడి పుట్టేలా కొన్ని ఎక్సర్ సైజులు చేసి శరీరం వేడి అయ్యాక మరికొంత సేపు నిద్ర పోయేవాన్ని. వణుకు మొదలైనప్పుడల్లా అదే పద్ధతి రిపీట్ చేసేవాన్ని. ఆ ఒంటరిగా ఉన్న రెండు రాత్రులు ఎన్నో ఆలోచనలు, ఎన్నో పథకాలు మనుసులో రూపొందాయి. ఇక్కడి నుండి బయట పడడం ఎలా? మిగిలిన సహచరులను రీ గ్రూపు చేయడం ఎలా? ఎవరూ కలువక పోతే ఒంటరిగా పోరాటం కొనసాగించడం ఎలా? ఇలా ఎన్నెన్నో ఆలోచనలు. పథకాలు మనుసులో రూపొందసాగాయి. నాకు ఇదేమీ కొత్త కాదు. నా 40 ఏళ్ల అనుభవంలో పార్టీతో సంబంధాలు తెగిపోవడం ఒంటరవడం, ఒంటరిగానే ప్రజల్లో జీవిస్తూ తిరిగి పార్టీ సంబంధాలు పునరుద్ధరించుకున్న అనుభవం ఉన్నదే. మరోసారి ఆ పరిస్థితి ఆసన్నమయిందనుకున్నాను. మానసికంగా దానికి సిద్దమయ్యాను.

23 ఉదయం మూడు రోజులుగా తిండి ఏమి లేకున్నా విచిత్రంగా దొడ్డికి వచ్చేలాగా అనిపించింది. మధ్య మధ్య మూత్రం మాత్రం తాగుతూనే వున్నాను. ఆకులు తిన్నందుకేమో కొంత దొడ్డికి వచ్చింది. దొడ్డికి పూర్తి చేసి ఆకులతో శుభ్రం చేసుకుని లేచి వస్తుండగా హఠాత్తుగా మరో కామ్రేడ్ దగ్గరలోని బండ చాటునుండి నా వైపే వస్తూ కనిపించాడు. శత్రువేమోనని వెంటనే నా కలాష్నికోవ్ ను గురిపెట్టాను. ఇద్దరం ఒకరినొకరం చూసుకున్నాం. ఇద్దరి ముఖంలో చిరునవ్వు. ఒకర్నొకరం పలకరించుకున్నాం. ఇద్దరం ఎలా ఒంటరయింది, రెండు రాత్రులు ఎలా గడిపింది చెప్పుకున్నాం. మిగతా సహచరుల జాడ ఏం తెలియలేదు. మేం ఇద్దరం తర్వాతి పథకం రూపొందించుకుని ఆ చక్రబంధం లోంచి బయటపడ్డాం. మరో రోజు తర్వాత మిగిలిన సహచరులను చేరుకున్నాం. 21 ఉదయం SOG జవాన్లతో నేను ఒంటరిగా పోరాడిన సమయంలోనే నేను చనిపోయి ఉంటాననీ, తప్పుకునే అవకాశం లేదనీ మిగిలిన కామ్రేడ్సంతా అనుకున్నారు. నేను సంకేత స్థలంలో కలిసే సరికి అందరిలో ఆశ్చర్యం, సంతోషం వెల్లి విరిశాయి. అందరూ ఆనందంతో నన్ను కౌగిలించుకున్నారు.

నోట్: ఈ రిపోర్టంతా శత్రు బలగాల చక్రభందం లోనే 21,22 తేదీల్లో రాయబడింది. కొన్ని చేర్పులు మాత్రమే తర్వాత చేర్చినవి.



- జంపన్న
డెమోక్రటిక్ సోషలిస్ట్

# అపోలో ఫార్మసీ 1000వ శాఖ ప్రారంభం

**విశ్వంభర, మేడ్చల్:** అపోలో ఫార్మసీ తెలంగాణ రాష్ట్రములో 1000 తన వెయ్యి శాఖను మియాపూర్ - బాచుపల్లి ప్రధాన రహదారి పై ప్రారంభించిన అపోలో హాస్పిటల్స్ సీ.యస్.ఆర్ వైస్ చైర్ పర్సన్ ఉపాసన కామినేని కొణదెల ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసిన ఉపాసన కొణదెల,, అపోలో జజూా జయకుమార్,స్టోర్స్ ఇన్ ఛార్జ్ రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ తెలంగాణలోని 33 జిల్లాల్లో అపోలో ఫార్మసీ తన కార్యకలాపాలను విస్తరించి, రిటైల్, డిజిటల్, సప్లై చైన్ విభాగాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 10,000 మందికి పైగా ఉపాధి కల్పిస్తోంది. ఈ నెట్వర్క్ ద్వారా 50,000 పైగా నాణ్యమైన మందులు, ఇతర వెల్నెస్ ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఇరవై ఐదు లక్షల మంది 24/7 వినియోగదారులు ఉన్నారు. రిటైల్, డిజిటల్, సప్లై చైన్ విభాగాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 10,000 మందికి పైగా ఉపాధి కల్పిస్తోంది. ఈ నెట్వర్క్ ద్వారా 50,000 పైగా నాణ్యమైన మందులు, ఇతర వెల్నెస్ ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఈ సందర్భంగా ఉపాసన కొణిదెల సూట్లాడుతూ అత్యధిక స్టోర్లు 24 గంటల పాటు పని చేస్తాయన్నారు. అన్ని జిల్లాల్లోనూ మందుల హోమ్ డెలివరీ సదుపాయం కలదన్నారు. పట్టణ ప్రాంతాలతో పాటు సెమీ-అర్బన్ ప్రాంతాల్లో కూడా అత్యవసర వైద్య సేవలను మెరుగుపరచడమే లక్ష్యంగా విస్తరణ చేపట్టామన్నారు. ప్రాంతీయ నెట్వర్క్, సమగ్ర సరఫరా వ్యవస్థతో అపోలో ప్రతిరోజూ 1.65 లక్షలకు పైగా మందుల ఆర్డర్లను అందిస్తోందని చెప్పారు. రాబోయే మూడేళ్లలో తెలంగాణలో మరో 200 పైగా కొత్త ఫార్మసీ స్టోర్లను ప్రారంభించనున్నామని తెలిపారు. ఈ విజయం నాణ్యమైన ఆరోగ్య సేవలను అందరికీ చేరువ చేయాలన్న మా నిబద్ధతను మరింత బలోపేతం చేస్తుందన్నారు. కుటుంబాలు, కమ్యూనిటీలు తమ సొంతంగా భావించే ఒక నమ్మకమైన ఫార్మసీ వ్యవస్థను నిర్మించడమే మా లక్ష్యమన్నారు. అపోలో కిమ్నీ ఛానల్ ప్లాట్ఫారమ్ 'అపోలో 24/7' ద్వారా ప్రజలు తమ ఇంటి వద్ద సమగ్ర వైద్య సేవలను పొందవచ్చన్నారు. ఇందులో అపోలో వైద్యులతో టెలీ-కన్సల్టేషన్లు (వీడియో కాల్ ద్వారా సలహాలు), డయాగ్నస్టిక్ సేవలు, ప్రత్యేక ఇన్సూరెన్స్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



## ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**విశ్వంభర, ముషీరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఔట్సోర్సింగ్ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాదు ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద భారీ నిరసన నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. మౌన దీక్ష, మోకాళ్లపై కూర్చొని నిరసన, సాష్టాంగ నమస్కారాలు, అర్ధనగ్న ప్రదర్శనలు వంటి వినూత్న రూపాల్లో ఆందోళన చేపట్టారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ, సంవత్సరాలుగా సేవలందిస్తున్నప్పటికీ క్రమబద్ధీకరణ, సమాన వేతనం, పదోన్నతులు, పింఛన్ వంటి హక్కులు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రత్యేక కార్పొరేషన్ అవసరమని స్పష్టం చేశారు. ఒక ఏజెన్సీ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పులి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. ఏజెన్సీల కారణంగా ఉద్యోగులకు ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి ప్రయోజనాలు సక్రమంగా అందడం లేదని అన్నారు. ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్, నాయకులు శ్రీనివాస్, సంతోష్ కుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పెద్ద శంకరంపేట మండల పరిధిలోని మల్కాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నాడు స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో డిఇఓగ రాజు ఎంఈఓ గా చిరంజీవి ప్రధానోపాధ్యాయులుగా లోకేష్, ఉపాధ్యాయులుగా శివలీల, ఫాతిమా, శైలజ, రిత్విక, వైష్ణవి, శివలక్ష్మి, శివ సాయి, విజయ్ కుమార్, హనుమంతు, మధు కిరణ్, పిఈటి గా నందు వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుష్మ, ఉపాధ్యాయులు ఆనంద్, కాన్సీరామ్, సచిన్ కుమార్, స్రవంతిలు పర్యవేక్షించారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



**విశ్వంభర, హాలియా:** పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ మాలే అరుణా సత్యనారాయణ రెడ్డి తిథి భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమని హెచ్ఎం శైలజ అన్నారు. శనివారం అనుముల మండలం పులిమామిడి పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాలే అరుణ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వివిధ హోదాలో చక్కగా పాత్రలు పోషించడం సంతోషదాయకమన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు పాఠశాల విద్యార్థులకు ఈరోజు చికెన్ తో భోజనం ఏర్పాటు చేశామని నిరుపేద విద్యార్థుల కోసం ప్రభుత్వ సూచన మేరకు దాతలు ముందుకు రావాలన్నారు. పాఠశాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. హెచ్ఎం గా సునంద, కలెక్టర్గా అనుశ్రీ, ఎమ్మెల్యేగా చంటి విద్యార్థులు పోషించగా కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహ చారి, రవీంద్రాచారి, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్, సంధ్య, ఉమారెడ్డి, వినోద తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల దాడిలో నాలుగు లేగ దూడలు మృతి



**విశ్వంభర, షాబాద్:** షాబాద్ మండలంలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. రోజు మాదిరిగానే కొత్త కురువ నరసింహులు రైతు తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న ఆవు లేగ పిల్లలను కట్టేసి ఇంటికి వెళ్లాడు. అయితే రైతు వెళ్లిన తరువాత వీధి కుక్కలు గుంపుగా వచ్చి నాలుగు లేగ పిల్లలపై దాడి చేసి కరచి చంపేశాయి. ఈ ఘటనతో రైతు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఎంతో శ్రమించి పెంచుతున్న పశువులు ఇలా మృతి చెందడం వల్ల ఆర్థికంగా భారీ నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామంలో వీధి కుక్కల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గ్రామంలో వీధి కుక్కల నియంత్రణకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు మరియు గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ

**విశ్వంభర, షాద్ నగర్:** షాద్‌నగర్ ప్రజలు పదేళ్లుగా ఎదురుచూస్తున్న స్వంత ఇంటి కల సాకారమవుతూ, డబుల్ బెడ్‌రూమ్ గృహాల పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్ ప్రత్యేక కృషి, పట్టుదలతో ఈ పథకం అర్హులైన కుటుంబాలకు చేరింది. ప్రజల అవసరాలను అర్థం చేసుకుని సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేస్తున్న నాయకుడిగా ఆయన పేరు మరింత ప్రతిష్టను సంతరించుకుంది. 18వ వార్డు కౌన్సిలర్ జమాల్‌పూర్ సంతోషి చందులాల్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు అందజేయగా, ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్ ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని స్పష్టం చేశారు. స్వంత ఇల్లు ప్రతి కుటుంబానికి గౌరవం, భద్రత, భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారుల వరకు చేరాలనే సంకల్పంతో పని చేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారుల్లో సలీమ బేగం ఆనందంతో మాట్లాడుతూ, ఎన్నేళ్ల నిరీక్షణ తర్వాత మా స్వంత ఇంటి కల నెరవేరింది. ఇది మా కుటుంబానికి మరపురాని రోజు అని భావోద్వేగంతో తెలిపారు. ఎమ్మెల్యే శంకరన్నకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు.



## బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తా

ఎంపి మల్లు రవి



**విశ్వంభర, బాగ్ లింగంపల్లి :** నాగర్ కర్నూల్ కుమ్మెర బాధితులకు అన్ని విధాలుగా న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎంపి మల్లు రవి హామీ ఇచ్చారు. బాధితులకు నేను అధ్యక్షునిగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ఈడబ్ల్యుఎస్ వెల్ఫేర్ సొసైటి నుంచి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని తక్షణమే అందజేస్తున్నట్టు స్పష్టం చేశారు. శనివారం హైదరాబాదు బాగ్ లింగంపల్లి డాక్టర్ విశారదన్ మహారాజ్ కార్యాలయంలో బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ... నిన్న బాధితులు ఊరికి వెళ్లి అక్కడ డిఎస్పితోపాటు గ్రామంలోని ప్రజలతో మాట్లాడడం జరిగిందన్నారు. ఇట్టి విషయాన్ని కలెక్టర్ ఎస్పి దృష్టికి కూడా తీసుకుపోయామని కలెక్టర్ వారికి ఒక ఇల్లును కట్టించడంతోపాటు టెంపరరీ ఉద్యోగం ఇవ్వడానికి ఆర్డర్ కూడా సిద్దంగా పెట్టానని అన్నారు. నిందుతుల పైన చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తానని అన్నారు. బాధితుల కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఇది అవమానకరమైన విషయమని పాప మృతి బాధను కలిగిస్తుందని ఎసిపి, డిజిపితో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. బాదితులకు రక్షణ కల్పించడంత పాటు ఉద్యోగం వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ... దళితులు పక్షాన నిలబడాల్సిన ఎంపి మల్లు రవి దాడి చేసిన నిందుతుల సభలో పాల్గొనడం బాధకరమని ఇది ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలలో కలవరపడేలా చేసిందన్నారు. నిందుతుల సభలో పాల్గొనడం అత్యంత బాధకరమని అన్నారు. పోలీసులు కేసు కట్టడంలో పూర్తి నిర్లక్ష్యం చేశారని అన్నారు. మర్డర్ కేసు, అట్రాసిటీ కేసు పెట్టాలని ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. దళితుల పక్షాన ఎంపిగా ఎన్నికైనా మల్లు రవి. బాబు జాగ్జీవన్ రామ్ పాత్రను పోషించాలని కోరారు. ఇది ఆత్మ గౌరవ సమస్య అని సీఎం పై ఒత్తిడి తీసుకొచ్చి అన్ని సెక్షన్లు అమలు అయ్యేలా కృషి చేయాలని మల్లు రవిని కోరారు. ఈ కార్యక్రమంలో తోట్ల రాఘవేంద్ర ముదిరాజ్, పిఓడబ్ల్యు జాతీయ కన్వీనర్ సంధ్య, శ్రీనివాస్ బహుదూర్, రమేష్ బహుదూర్లతోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

## కుర్చీతో పేచీ.. ఉప సర్పంచ్‌పై సర్పంచ్ ఫిర్యాదు



**విశ్వంభర, నిజామాబాద్:** గ్రామంలో పనులు చేయకపోతే సర్పంచ్?లను గ్రామస్థులు నిలదీయడమో, విధులకు ఆటంకం కలిగించడమో చూస్తుంటాం.. అయితే ఇక్కడ ఆ సర్పంచ్?కు ఉప సర్పంత్?తోనే పేచీ వచ్చిపడింది. గ్రామంలో పనులు చేయకపోతే సర్పంచ్?లను గ్రామస్థులు నిలదీయడమో, విధులకు ఆటంకం కలిగించడమో చూస్తుంటాం.. అయితే ఇక్కడ ఆ సర్పంచ్?కు ఉప సర్పంత్?తోనే పేచీ వచ్చిపడింది. తరచుగా తన విధులకు ఉప సర్పంచ్ ఆటంకం కలిగిస్తుండటం, అది కూడా కుర్చీ విషయంలో పేచీ రావడంతో ఆ సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకంగా కలెక్టర్?తో పాటు ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఘటన గాంధారి మండలం గండివేట్ గ్రామంలో చోటుచేసుకుంది. సర్పంచ్ అనూష తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో సర్పంచ్?గా అనూష గెలుపొందగా ఉప సర్పంచ్?గా కాశీరాం ఎన్నికయ్యారు. గత కొన్ని రోజులుగా సర్పంచ్ అనూష ఉప సర్పంచ్ కాశీరాం మధ్య కుర్చీ విషయంలో గొడవ జరుగుతోంది. గ్రామపంచాయతీ భవనం చిన్నగా ఉండడంతో సర్పంచ్ కుర్చీతో పాటు వార్డు సభ్యులకు, ఉపసర్పంచ్?లకు కుర్చీలు వేశారు. ఉపసర్పంచ్?కు ప్రత్యేక కుర్చీ లేకపోవడంతో కాశీరాం స్వయంగా ఓ కుర్చీ తెచ్చుకొని గ్రామపంచాయతీ భవనంలో వేసుకున్నాడు. అయితే ఉపసర్పంచ్ కుర్చీ వేసుకోవడంతో సర్పంచ్ అనూషకు లోపలకు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. దాంతో ప్రతిరోజు ఉపసర్పంచ్ కాశీరాం తెచ్చుకున్న కుర్చీలో కూర్చోవడంతో సర్పంచ్ అనూష గ్రామపంచాయతీ భవనం లోపలికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా ఉపసర్పంచ్ కుర్చీలో కూర్చుంటూ సర్పంచ్ అనూష విధులకు ఆటంకం కలిగిస్తున్నాడని వారు ఆరోపిస్తున్నారు. అలాగే ఫోన్?లో ఇతరులను దుర్భాషలాడుతూ.. సర్పంచ్?ను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని చెప్పారు. దీంతో విసిగిపోయిన సర్పంచ్ అనూష సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్?కు వినతిపత్రం అందజేశారు. అలాగే వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. తనను ఇబ్బందులకు గురిచేస్తున్న ఉపసర్పంచ్ కాశీరాంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం : 16 మందికి గాయాలు





**విశ్వంభర, పటాన్‌చెరు :** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారం వద్ద ముంబై జాతీయ రహదారిపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ప్రయాణికులను ఎక్కించుకుంటున్న క్రమంలో మూడు బస్సులు, ఒక కారు ఒకదానికొకటి ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు తీవ్రంగా గాయపడగా, మరో పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం రుద్రారం బస్టాప్ వద్ద ప్రయాణికులను



ఎక్కించుకోవడానికి ఆర్టీసీ బస్సులు నిలిచి ఉన్నాయి. ఇదే సమయంలో వెనుక నుంచి వచ్చిన కర్ణాటక డిపోకు చెందిన బస్సు, సంగారెడ్డి డిపో బస్సును, మరో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును బలంగా ఢీకొట్టింది. వేగంగా వస్తున్న ఒక కారు కూడా ఈ బస్సులను వెనుక నుండి ఢీకొట్టడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. ఈ వరుస ఢీకొనడంతో వాహనాలన్నీ పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు అప్రమత్తమయ్యారు. 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారికి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరగడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పటాన్‌చెరు పోలీసులు రంగంలోకి దిగి క్రేన్ల సహాయంతో ధ్వంసమైన వాహనాలను పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



**విశ్వంభర, బాగ్ లింగంపల్లి :** ఎస్బీఐలో పనిచేస్తున్న క్యాజువల్, టెంపరరీ, ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, అప్పటివరకు కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలని ఎస్బీఐ క్యాజువల్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సదస్సు డిమాండ్ చేసింది. శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నగేష్ అధ్యక్షతన జరిగిన సదస్సును సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రారంభించారు. ఎస్బీఐ వంటి ప్రభుత్వరంగ బ్యాంకులో ఔట్సోర్సింగ్ పేరుతో తక్కువ వేతనాలు చెల్లించడం అన్యాయమని, అర్హతలు ఉన్నవారిని పర్మినెంట్ చేయాలని ఆయన అన్నారు. జీవోకు అదనంగా స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. మధు మాట్లాడుతూ 2022 నుంచి కనీస వేతన జీవోలను సవరించకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పిఎఫ్, ఈఎస్ఐ, బోనస్ సీలింగ్‌లను ఎత్తివేయాలని కోరారు. కాంట్రాక్టర్లు కనీస వేతనాలు పూర్తిగా చెల్లించడంలేదని ఆరోపించారు. సదస్సులో బి. వెంకటరామయ్య, రవికాంత్, సతీష్, కూరపాటి రమేష్, ధనుంజయ్, మనం కిషోర్, క్రాంతి, అహ్మద్ పాషా, వీరన్న, అశోక్, లెనిన్, మల్లేష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం అధ్యక్షునిగా నాగభూషణం

**విశ్వంభర,పెద్ద శంకరంపేట:** పెద్ద శంకరంపేట మండల పరిధిలోనిపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఎన్నికలు శనివారం జరిగాయి గుజరాన్ పల్లి గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షునిగా మాంద్రు నాగభూషణం ఉపాధ్యక్షులుగా నిరుడి విట్టల్ ప్రధాన కార్యదర్శిగా రాకంచెర్ల మల్లేశం సభ్యులుగా సాదు లక్ష్మణ్ పందికొండ గోపాల్ పందికొండ అంజయ్య రాకంచెర్ల విట్టల్ మాంద్రు గణేష్ మజ్జూరి విట్టల్ చంద్రమోహన్ సాయిలు రమేష్ శంకరయ్య తుకారాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



**విశ్వాంభర,పెద్ద శంకరంపేట.** ప్రతి ఒక్కరు చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని పెద్ద శంకరంపేట తాసిల్దార్ ప్రభుదాస్ ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి లు అన్నారు. మండల పరిధిలోని ఆరేపల్లి లో శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామంలో అందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకట్రావు. ఆర్ ఐ రమేష్ పోలీసు సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పౌర హక్కుల దినోత్సవం



**విశ్వంభర, సిద్దిపేట:** ప్రజలందరూ రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, సమాజంలో అస్పృశ్యత నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని టూ టౌన్ సీఐ ఉపేందర్ సూచించారు. అర్బన్ మండలం మందపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ గ్రామంలో కుల వివక్షకు తావు లేకుండా, అందరూ సోదరభావంతో మెలగాలని సూచించారు. చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండటం వల్ల నేరాలను అదుపు చేయొచ్చన్నారు. కార్యక్రమంలో జీపీఓ కరుణాకర్, పంచాయతీ కార్యదర్శి భవానీ, ఉప సర్పంచ్ బర్రె కిష్టయ్య, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ తనిఖీ



**విశ్వంభర, షాద్ నగర్ :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు పోలీస్ స్టేషన్‌ను ఫ్యూచర్ సిటీ సిపి సుధీర్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ. పోలీస్ స్టేషన్ ప్రాంగణం,రికార్డ్ రూమ్,స్టేషన్ రైటర్ రూమ్, రిసెప్షన్ సెంటర్ వంటి విభాగాలను పరిశీలించి,వాటిని చక్కగా నిర్వహించుకోవాలని సూచించారు. నేరాల రేటు,రోడ్డు ప్రమాదాలు,చోరీ కేసులు, నమోదైన కేసుల పురోగతిపై ఆయన ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డిసిపి సిహెచ్ శిరీష,ఏసీపీ ఎస్ లక్ష్మి నారాయణ,సీఐ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## కవితకు క్లీన్ చిట్ అభిమానుల్లో ఉత్సాహం





**విశ్వంభర, హైదరాబాద్ :** ఢిల్లీ లిక్కర్ కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో ఆమె అభిమానులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. హైదరాబాదు హరిబౌలి డివిజ న్‌కు చెందిన తెలంగాణ జాగృతి నాయకులు, కార్యకర్తలు కవిత కుమారుడు ఆదిత్యను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. "నిజం గెలిచింది... న్యాయం నిలిచింది" అంటూ ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా కవిత నాయకత్వంలో జాగృతి బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జాగృతి కార్యకర్తలు రాకేష్ గైక్వాడ్, రాజ్ కుమార్, నవీన్ కుమార్, హర్ష, ఓంకార్, శ్రీకరాజు, బబ్లూ, నితిన్, భాను, సతీష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు. కోర్టు తీర్పుతో జాగృతి వర్గాల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి.ం

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ



**విశ్వంభర, నార్పల:** నార్పల మండలం బొందలవాడ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు ఈ సందర్భంగా ఆలం నరసానాయుడు మాట్లాడుతూ ఒకటో తారీఖున ఆదివారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఒకరోజు ముందు 28వ తేదీన పెన్షన్లు పంపిణీ కార్యక్రమం చేపట్టిందని ఈ రోజు ఉదయం 6 గంటల నుండి వృద్ధులకు వికలాంగులకు వితంతులకు ఇంటింటికి పింఛన్ కార్యక్రమం చేపట్టడం జరిగింది ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం ముందుశీటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో మండల కన్వీనర్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ తలారి కుళ్లాయప్ప, మాజీ మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, క్లస్టర్ ఇంచార్జ లక్ష్మి నారాయణ, యూనిట్ ఇంచార్జ నాగభూషణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు సోముశేఖర్, బూత్ కన్వీనర్లు గంగనాయుడు, ఓబిలేసు, హనుమంత్ రెడ్డి, గోవర్ధన్,మధు, రామాంజనేయులు, పంచాయితీ సెక్రటరీ శ్రీనివాసులు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత అవసరం

**విశ్వంభర, బాగ్ లింగంపల్లి :** వికలాంగుల హక్కులను హరించే విధానాలను నిలిపివేయాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పారదర్శకత పాటించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సెమినార్‌కు కె. వెంకట్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ అమలులో పలు లోపాలు ఉన్నాయని, అవసరమైన పత్రాలు లేకపోవడం వంటి కారణాలతో పేదలు, వికలాంగుల ఓట్లు తొలగించే ప్రమాదం ఉందన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించాలని సూచించారు. కేంద్ర బడ్జెట్‌లో సంక్షేమానికి తగిన నిధులు కేటాయించలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. అడివయ్య మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం లక్షలాది వికలాంగులు ఓటర్లుగా నమోదు కాలేదన్నారు. డిజిటలైజేషన్‌పై ఆధారపడే విధానం వికలాంగులకు ఇబ్బందులు కలిగిస్తోందని పేర్కొన్నారు. వికలాంగుల పెన్షన్‌ను రూ. 6,000లకు పెంచాలని, రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆర్. వెంకటేష్, జె. రాజు, యశోద, ఉపేందర్, బి. స్వామి, పి. శశికల, పి. చందు, సత్యనారాయణ, యం. నర్సింహా, కవిత, ప్రకాష్, చంద్రమోహన్, యాదయ్య, మల్లేష్, భుజంగా రెడ్డి, నగేష్, బంగారయ్య, మేరీ తదితరులు పాల్గొన్నారు.



## రైల్వే కూలీలతో జగ్గారెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్ :** టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి డిల్లీ నుండి శనివారం హైదరాబాద్ తిరిగి వచ్చారు. సికింద్రబాద్ స్టేషన్ లో దిగిన సందర్భంలో జగ్గారెడ్డిని చూసిన రైల్వే కూలీలు అభిమానంతో జగ్గారెడ్డితో గ్రూప్ ఫోటో దిగారు. ఈ సందర్భంగా రైల్వే కూలీలతో జగ్గారెడ్డి సరదాగా ముచ్చటించారు వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

## నూతన విగ్రహ ప్రతిష్టాపన



**విశ్వంభర, నిజామాబాద్ :** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం రామడుగు గ్రామంలో శ్రీ ఆంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు. నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టాపన. నిత్య కుంకుమార్చన. హోమాలు ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజులు నిర్వహించే ఆలయ ప్రత్యేక పూజలు నిర్వహించి. అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ రాజారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఎండోమెంట్ అధికారుల సహాయ సహకారంతో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆధ్వర్యంలో. త్వరగా నిధులు మంజూరు చేయించి అవి ఆలయాన్ని నిర్మించుకోవడం సంతోషకరంగా ఉందని ఈ మూడు రోజుల్లో ప్రత్యేక పూజలకు ముఖ్యఅతిథిగా నిజాంబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి వస్తున్నట్లు ఆయన అన్నారు. మండల ప్రజలు నాయకులు ప్రజాప్రతినిధులు. మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు. ఎన్నో ఏళ్లుగా గుడి నిర్మించాలని కలను ఈరోజు సహకారం చేసుకున్నామని ఈవించడానికి గ్రామస్తులు సహకరించాను అని ఆయన అన్నారు. చైర్మన్ రాజారెడ్డి. వైస్ చైర్మన్ రాజారెడ్డి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గంగారెడ్డి, శీను పోచయ్య. నగేష్. జై గౌడ్ దాసు గంగారం. కమిటీ సభ్యులు ఆలయ కమిటీ సభ్యులు. శ్రీనివాస్ పంతులు . సంతోష్ శాస్త్రి. తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు భరోసా కల్పించాలి



**విశ్వంభర, సిద్దిపేట:** భూ రికార్డులపై రైతులకు, యాజమానులకు భరోసా కల్పించేలా సర్వేయర్లు పని చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న 110 మంది సర్వేయర్లకు కలెక్టరేట్ లో శనివారం లైసెన్స్ ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ పేద ప్రజల కష్టాలను తొలగించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టం ప్రవేశపెట్టిందన్నారు. రెండో విడతలో సర్వేయర్ అభ్యర్థులకు శిక్షణ అందించి పరీక్షల ఆధారంగా ఉత్తీర్ణత సాధించి జిల్లాలో అర్హత సంపాదించిన 110మంది అభ్యర్థులకు లైసెన్సులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. లైసెన్స్ సర్వేయర్లను మండలాల వారీగా అందుబాటులోని భూమి ఆధారంగా అలాట్మెంట్ చేస్తామన్నారు. భూములున్న రైతులకు భరోసా కల్పించే భూ భారతి చట్టం అమలు కోసం సర్వేయర్లకు ఆధునిక సాంకేతిక వినియోగించేందుకు సామగ్రి ప్రభుత్వం పంపిణీ చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దేవాలయ 35వ వార్షికోత్సవం



**విశ్వంభర, అంబర్ పట :** హైదరాబాదు బాగ్ అంబర్పేట బతుకమ్మ కుంటలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ 35వ వార్షికోత్సవ వేడుకలను చెంచు సంక్షేమ సంఘం నిర్వాహకులు శనివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. సంఘం అధ్యక్షుడు నల్లపోతుల బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి హనుమంతు అతిథులను ఆహ్వానించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ నిర్మాణానికి ఆయన అందించిన సేవలను చెంచు సంక్షేమ సంఘం నాయకులు ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు తిరుపతి కురుమయ్య, చందు, శ్రీరాములు ముదిరాజ్ తో పాటు స్థానిక పాల్గొనడం జరిగింది.

# ఘనంగా సైన్స్ డే



**విశ్వంభర , మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ డే సంబరాలు ఘనంగా జరిగాయి . కళాశాలలో రసాయన శాస్త్ర, భౌతిక శాస్త్ర మరియు ×ూాజ విభాగాల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. లక్ష్మణ్ నాయక్ , ఈ కార్యక్రమ సమన్వయ కర్త అధ్యాపకుడు బి. శ్రీనివాసు లు మాట్లాడుతూ మహిళలు శాస్త్ర విజ్ఞాన , పరిపాలన మరియు రక్షణ రంగాలలో పురోగతి సాధించాలని తద్వారా వికసిత్ భారత్ లక్ష్యాలను శీఘ్ర గతిన సాధించవచ్చు అని , విద్యార్థులలో బాల్యం నుండే సైన్స్ పట్ల ఆసక్తి ని పెంపొందించు కోవాలని, పరిశోధనలు చేసి దేశప్రగతికి పాటు పడాలని సూచించారు . మరియు భారతీయ పరిశోధన రంగంలో జ.ఎ రామన్ చేసి న కృషి ని కొనియాడారు , సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన నబఱఓ మరియు ాcience expo లో పాల్గొని గెలుపొందిన విద్యార్థుల వారికి బహుమతులు కళాశాల ప్రిన్సిపాల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. సీ హెచ్ శ్రీనివాసులు ,ఐ క్యు ఏ సి కో ఆర్డినేటర్ జె.అనిల్ కుమార్,అధ్యాపకులు డాక్టర్ మసూద్ అహ్మద్,డాక్టర్ బి వినోద్ కుమార్, డాక్టర్ బి శ్రీనివాస్, డాక్టర్ వి సాంబశివరావు ,డాక్టర్ డి రాజశేఖర్, డాక్టర్ బి హతీరామ్,డాక్టర్ ఖాసీంషా, యం సుమన్, యం వీరు,జె .రవితేజ, ఓ ఉదయ్ కుమార్,ఎం నరేష్, జి యాకయ్య , డి ఎస్ రామన్న, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు .

## సైన్స్ ద్వారానే అభివృద్ధి




**విశ్వంభర, మియాపూర్:** సైన్స్ ద్వారానే అభివృద్ధి చెందుతుందని ది మాస్టర్ మైండ్ మియాపూర్ బ్రాంచ్ ప్రిన్సిపల్ భారతి లక్ష్మి అన్నారు. సైన్స్ డే ని పురస్కరించుకొని విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులను తయారుచేసి స్కూల్ ఆవరణలో ప్రదర్శనకు పెట్టారు. ఈ సందర్భంగా కాలనీ వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొని వీక్షించారు ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త రామ్ ప్రభు మాట్లాడుతూ విద్యార్థులు సైన్సును తమ జీవితంలో ఒక భాగంగా అలవర్చుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులు అనునిత్యం కొత్త విషయాన్ని నేర్చుకుంటూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు తయారుచేసిన వివిధ సైన్సు విభాగాలకు సంబంధించిన ప్రాజెక్టులను చూసి ఆయన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది విద్యార్థులు.

## విద్యాశాఖ అధికారి ఆకస్మిక తనిఖీ



**విశ్వంభర, ఆలియా :** ఈరోజు హాలియాలోని కేజీబీవీ పాఠశాల మరియు బిసి ఎస్సి విద్యార్థుల హాస్టల్స్ లను జిల్లా విద్యాశాఖ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేసినారు అందులో భాగంగా విద్యార్థుల యొక్క సామర్థ్యాలను పరిశీలించడం జరిగింది. అదేవిధంగా కేజీబీవీ మరియు హాస్టల్లో వసతులకు సంబంధించిన రిపేర్లు వివరములను సేకరించడం జరిగింది ప్రస్తుతము ఉన్న వసతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేయడం జరిగింది జిల్లా విద్యాశాఖ అధికారి వెంట మండల రెవెన్యూ అధికారి రఘు గారు మరియు మండల విద్యాధికారి శ్రీనివాస్ గారు కేజీబీవీ ఎస్ఓ హైమావతి గారు మరియు హాస్టల్లో వార్డెన్స్ పాల్గొనడం జరిగింది.

## ఘనంగా నేషనల్ సైన్స్ డే

**విశ్వంభర, కూకట్ పల్లి:** కూకట్పల్లి నియోజకవర్గం గోకుల్ ప్లాట్స్ యందు, గోల్డెన్ ఫ్యూచర్ స్కూల్ ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన నేషనల్ సైన్స్ డే సందర్భంగా విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ తయారుచేసిన బొమ్మ పరికరాలను పరిశీలించి వారికి బహుమతులు అంద జేసిన కూకట్పల్లి కాంగ్రెస్ యూత్ ఐకాన్ గొట్టి ముక్కుల వెంకటేశ్వరరావు వారి మిత్రబృందం. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం పాల్గొన్నారు.



## ప్రధానోపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలి

**విశ్వంభర, చింతపల్లి :** చింతపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పిహెచ్ఎస్)లో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయురాలిపై అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు కె.జగ్రామ్ శనివారం జిల్లా విద్యాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. తనను మానసికంగా వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పాఠశాల సిబ్బంది ముందు సైతం వివిధ సందర్భాల్లో ఉపాధ్యాయుడు జగ్రామ్ పై విషం చిమ్మినట్టు మాట్లాడేదని ఆవేదన వ్యక్తం చేశారు. మిగతా ఉపాధ్యాయులు కంటే మీరే రౌడీలా ప్రవర్తిస్తున్నారంటూ పలుమార్లు సూటి పోటి మాటలతో వేధించేదని ఉపాధ్యాయుడు చెప్పుకొచ్చాడు. నిత్యం తన మిదనే నిందలు వేస్తూ ఇబ్బందులకు గురిచేసినట్లు తెలిపారు. ఎప్పుడన్నా అత్యవసర సమయంలో సెలవు కోసం దరఖాస్తు పెట్టుకున్న సెలవు ఇచ్చేది కాదని చెప్పుకొచ్చారు. అయితే ఉపాధ్యాయుడు జగ్రామ్ చిరకాల మిత్రుడైన సంజీవ కుమార్ పదవి విరమణ కార్యక్రమానికి వెళ్ళడానికి సెలవు ఇవ్వాలని దరఖాస్తు చేసుకోగా మిగతా ఉపాధ్యాయుల కన్నా



సెలవు మంజూరు చేస్తాగాని మీకు మాత్రం ఇవ్వనని వివిధ అభ్యంతరకరమైన పదజాలం వాడి ఇబ్బందులు పెట్టేవారని తెలిపారు. తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ప్రధానోపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారులకు ఉపాధ్యాయుడు కె. జగ్రామ్ ఫిర్యాదు చేసారు.

## జాతీయ సైన్స్ దినోత్సవం

**విశ్వంభర, ఆత్మకూరు:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం శనివారం రోజున మండల కేంద్రంలోని సరస్వతీ విద్యాలయం పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల పరిశోధనలను ప్రదర్శించారు. ఈ పరిశోధనలను ప్రాథమిక పాఠశాల ఆత్మకూరు (ఎం)మరియు బ్రిలియంట్ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తిలకించడం జరిగింది. ఈ ప్రదర్శనలను చూసి ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ప్రముఖ పారిశ్రామిక వేత్త తౌర్ర విష్ణు, ప్రిన్సిపాల్ పంజాల నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని తమకు ఉన్నటువంటి అనుమానాలను నివృత్తి చేసుకుంటూ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకుంటే భవిష్యత్తులో గొప్ప సైంటిస్టులు అవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కే. ఐలయ్య,పేరెంట్స్ కమిటీ ప్రెసిడెంట్ బూడిద శేఖర్, ఉపాధ్యాయులు విష్ణు,యాసిన్, సుధాకర్, లలిత, సంతోష,సంధ్య, మహేశ్వరి, మాధవి,ఉపేంద్ర,గంగ, కృష్ణవేణి,లక్ష్మి ,రేణుక ,లావణ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# డ్రైవర్లకు కంటిచూపే కీలకం

**ఎస్పీ శబరీష్**

**విశ్వంభర, కేసముద్రం :** వాహనాలను నడిపే ప్రతి డ్రైవర్‌కు స్పష్టమైన కంటిచూపు అత్యంత అవసరమని, కంటిచూపు లోపాలు రోడ్డు ప్రమాదాలకు ఒక ప్రధాన కారణమని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ తెలిపారు. శనివారం కేసముద్రం మండల కేంద్రంలోని హరిహర గార్డెన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా పోలీస్ శాఖ చేపట్టిన “అరైవ్ అలైవ్” కార్యక్రమంలో భాగంగా అగర్వాల్ హాస్పిటల్ సౌజన్యంతో లారీ, ఆటో, డీసీఎం, గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డా. శబరీష్ కంటి పరీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, డ్రైవర్లు తమ కంటి చూపును తరచుగా పరీక్షించించుకోవడం ద్వారా కంటి సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. వాహనాలను నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని,



అధిక వేగం, నిర్లక్ష్యపు మరియు ర్యాష్ డ్రైవింగ్‌ను పూర్తిగా నివారించాలని హెచ్చరించారు. అలాగే వాహనాలలో అధిక లోడ్‌తో ప్రయాణించడం ప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు. ప్రత్యేకంగా లారీ డ్రైవర్లు మరియు ఎక్కువ దూరం వాహనాలు నడిపే డ్రైవర్లు నిద్రమత్తు వచ్చినప్పుడు వెంటనే వాహనాన్ని సురక్షిత ప్రదేశంలో ఆపి కొంతసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత మాత్రమే ప్రయాణాన్ని కొనసాగించాలని సూచించారు. అలసటతో లేదా నిద్రమత్తులో వాహనం నడపడం తీవ్రమైన ప్రమాదాలకు కారణమవుతుందని హెచ్చరించారు. ప్రతి డ్రైవర్ బాధ్యతా యుతంగా వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించ వచ్చని తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ జర్నలిస్టులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ అడ్మిన్ గంద్రతి మోహన్,కేసముద్రం సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు క్రాంతి కిరణ్, రమేష్ బాబు, కరుణాకర్, నరేష్ మరియు పోలీస్ సిబ్బంది, డా. అగర్వాల్స్ వైద్య సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.



# దరువు జాతరకు తరలిరావాలి

**విశ్వంభర, సిద్దిపేట:** మార్చి పదో తేదీన హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో నిర్వహించే దరువు జాతర కార్యక్రమానికి కళాకారులు తరలిరావాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి కుంచం శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో దరువు జాతర ప్రోగ్రాం పోస్టర్ ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ దరువు అంజన్న, దరువు ఎల్లన్న ఆదేశాలతో జిల్లా కళాకారుల ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేశామని తెలిపారు. జాతరకు రాష్ట్ర, జిల్లా నలుమూలల నుంచి కళాకారులు తరలిరావాలని సూచించారు. పోస్టర్ ఆవిష్కరణలో ఎర్రవెల్లి శ్రీనివాస్, జిల్లా కళాకారులు రాజు, భిక్షపతి, బొప్పా రాజు, గజ్జల సూర్య, వంశీ, బత్తుల శేఖర్, అనుష, సాహితి తదితరులు పాల్గొన్నారు.





# పౌర హక్కుల దినోత్సవం

**విశ్వంభర, నాగారం:** భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నాగారం మండలం డిప్యూటీ తాసిల్దార్ షాహిని బేగం అని అన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం నాగారం మండలం ఫణిగిరి గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవం లో పాల్గొని పౌర హక్కులపై అవగాహన కల్పించారు. బడుగు బలహీన వర్గాల హక్కులకు భంగం కలిగించకూడదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్ర సావిత్రి యాదగిరీ, జమీందారు మందుల వెంకన్న , జిపిఓ నాగభూషణం పంచాయతీ కార్యదర్శి సురేష్ ,అంగన్వాడి టీచర్, గ్రామపంచాయతీ , వార్డ్ మెంబర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వం అంటే మాటలు కాదు



**విశ్వంభర, డిండి:** మండలంలోని ఎర్రగుంట పల్లి, వావిల్ కోల్, రహమంతాపూర్,కందుకూరు, సింగరాజు పల్లి, తవక్లాపూర్ గ్రామాలలో నూతనంగా నిర్మించనున్న గ్రామ మహిళా సమాఖ్య కార్యాలయ భావన నిర్మాణ పనులకు సంబంధిత అధికారులు, స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కందుకూరు స్కూల్ కాంపౌండ్ వాల్ శంకుస్థాపన చేసిన అనంతరం సీసీ రోడ్డును ప్రారంభించారు. సింగరాజు పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ ను ప్రారంభించి, గ్రామస్తులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.శక్రు తండాలో 5.00 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది.తవక్లాపూర్ గ్రామం నుండి వీరబోయిన వై జంక్షన్ వరకు 223.00 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బీటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మహిళా సంఘాల బలోపేతానికి ఈఓ భవనం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.ఉపాధి హామీ పథకం ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ కింద మంజూరైన 10 లక్షల రూపాయల నిధులతో గ్రామ సమాఖ్య ఈ ఓ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్ణీత కాలపరిమితిలో నాణ్యతతో ఈ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.గ్రామంలోని మహిళా సంఘాలు మరియు స్థానిక అవసరాల కోసం కేటాయించిన నిధులతో నిర్మించనున్న భవనాలకు ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మండల ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి కృషి: సర్పంచ్ రజిత



**విశ్వంభర, దోమ:** మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సహకారంతో 20 లక్షల రూపాయలతో డ్వాక్రా మహిళా భవన నిర్మాణానికి సర్పంచ్ రజిత భాస్కర్ గౌడ్ గ్రామస్తులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రజిత భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ.. అయినా పూర్ గ్రామంలో మహిళలకు శక్తి భవనము లేనందున మహిళలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి మంజూరు చేయించి డ్వాక్రా మహిళ భవనం పనులకు భూమి పూజ చేయడం జరిగిందన్నారు. గ్రామ ప్రజల సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని గ్రామ ప్రజలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మానస, వార్డు సభ్యులు వెంకట్ రాములు, మోహన్, ఖదీర్, కాంగ్రెస్ నాయకులు సీనియర్ నాయకులు బాబయ్య, గ్రామస్తులు నల్ల సాయిలు, ఆంజనేయులు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# పన్నులు పెంచడమే లక్ష్యం



**విశ్వంభర, సిద్దిపేట:** ప్రజలను దంచడం, పన్నులు పెంచడం, ఢిల్లీకి పంచడమన్న చందంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన నడుస్తోందని బీఆర్ఎస్ నాయకులు పాల సాయిరాం, కోల రమేష్ గౌడ్, ఇర్షాద్ హుస్సేన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమం కోసం కాకుండా గాంధీ కుటుంబ సంక్షేమ కోసం పని చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అమలుకు సాధ్యం కానీ హామీలిచ్చి రాష్ట్ర ప్రజల సొమ్ము అంతా ఢిల్లీకి జారవేస్తున్నారని మండిపడ్డారు. అది సరిపోక పోగా రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 10 ద్వారా అన్ని రకాల వాహనాలపై పన్నులు పెంచి ప్రజలపై మరింత పన్నుల భారం వేస్తోందన్నారు. వెహికిల్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో ప్రజల పక్షంగా పోరాటం చేస్తామని తెలిపారు. అలాగే షాపుల్లో లేని యూరియా యాపుల్లో ఎలా ఉంటుందని, రైతులను ఇబ్బందులకు గురి చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ యాప్ లను తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చేంతవరకు బీఆర్ఎస్ ఊరుకోదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గ్యార శ్రీనివాస్, సర్పంచ్ రమేశ్, చాంద్ పాషా, చింటూ, ఇమ్రాన్, సాయిచరణ్ పలువురు పాల్గొన్నారు.

# ఘనంగా నేషనల్ సైన్స్ డే సంబరాలు



**విశ్వంభర, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి స్కూల్లో నేషనల్ సైన్స్ డే సంబరాలు ఘనంగా జరగాయి . ఈ సందర్భంగా సైన్స్ డే సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి స్కూల్ ప్రిన్సిపాల్ పురం భూపాల్ రెడ్డి మాట్లాడుతూ సుమారుగా 200 పైగా సైన్స్ ఎగ్జిబిట్స్ ని ప్రదర్శన చేసి విద్యార్థులకు చక్కగా వివరిస్తూ సివి రామన్ రామన్ ఎఫెక్ట్ కనుగొని ప్రపంచానికి తెలియజేశారని గుర్తు చేసారు . అంతేకాకుండా సివి రామన్ కి నోబెల్ బహుమతి కూడా పొందారని అన్నారు . సివి రామన్ ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు మీరు కూడా చక్కగా చదువుకొని ఉన్నతమైన గొప్ప శాస్త్రవేత్తలుగా కావాలని మన భారతదేశానికి కూడా పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని నేను మనసారా కోరుకుంటున్నాను అని విద్యార్థులను ప్రిన్సిపాల్ భూపాల్ రెడ్డి కోరారు . గొప్ప శాస్త్రవేత్త కావాలంటే చిన్నప్పటి నుంచే సైన్స్ పట్ల అభిరుచి పెంచుకోవాలి అప్పుడే మీరు అనుకున్న లక్ష్యాన్ని చేరుకొని శాస్త్రవేత్తలు కావడానికి అవకాశం ఉంటుంది కావున విద్యార్థులు మీరు ప్రదర్శించిన ఈ ఎగ్జిబిట్స్ చాలా బాగున్నాయి మిగతా విద్యార్థులకు కూడా ఎంతో ఉపయోగపడుతూ వారిలో కూడా ఆసక్తి కలిగేలా ఉన్నాయి అని , సైన్సు ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినంది స్తున్నాను వారు అన్నారు . ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ పురం భూపాల్ రెడ్డి , డైరెక్టర్ ఆవుల శ్రీనివాస్ , వైస్ ప్రిన్సిపాల్ పురం ప్రీతి రెడ్డి , సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, వెంకన్న, ఏస్తర్, సచిన్ పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థిని , విద్యార్థులు, పాల్గొన్నారు .

# ఎంపీ ఈటెలకు ఆహ్వాన పత్రిక



**విశ్వంభర, రామన్నపేట:** ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో గెలిచిన కార్పొరేటర్లు, చైర్మన్, వైస్ చైర్మన్, మేయర్ లకు మార్చి 15న హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామన్నపేట మండల వాసి కప్పల(పరిటాల)రవి తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమానికి హాజరుకావాలని బిజెపి మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో పంజాల శ్రవణ్ గౌడ్, బోయపల్లి లింగస్వామి గౌడ్, కొంపల్లి శ్రీనివాస్ గౌడ్, పంతంగి వెంకన్న గౌడ్, పంజాల లోకేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా చండీ హోమం



**విశ్వంభర, పరిగి:** పట్టణంలోని బాలాజీ నగర్ లో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కొనసాగుతున్న 39వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శ్రీ చండీ హోమం ఘనంగా నిర్వహించారు.ఈ హోమం కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి సతీమణి ఉమా రెడ్డి పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు.వేద పండితుల మంత్రోచ్చారణ ల మధ్య జరిగిన చండీ హోమం భక్తి పరవశంలో సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కృపతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, మున్సిపల్ చైర్మన్ రజిత వెంకటేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ మూడవత్ హనుమంతు, కౌన్సిలర్ బాదం అఖిల, డిసిసి ఉపాధ్యక్షులు లాలకృష్ణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు ఎర్రగడ్డ పల్లి గోపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శశికళ ఆనంద్, కాంగ్రెస్ నాయకులు అభిరామ్ పంతులు, గనేమోని శ్రీనివాస్, పాలాది శ్రీనివాస్ గుప్తా, బాదం శ్రీనివాస్ గుప్తా, రాధాకృష్ణారెడ్డి, యాదయ్య, రామకృష్ణ, చిన్న నరసింహులు, మల్లేష్, మాణిక్యం, చంద్రయ్య, జగన్, రామకృష్ణారెడ్డి, మహిపాల్, శ్రీనివాస్ చారి, రామకృష్ణ, యాదయ్య,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సన్మానం

**విశ్వంభర, వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం అరూరు, గ్రామ వైద్య ఆరోగ్య శాఖలో 28సంవత్సరాలు గావిశేష సేవలు.అందించి న పదవి విరమణ.చేయుచున్న కేశవదాసు శోభారాణి ఎం, పి, హెచ్, ఏ,( ఎఫ్) పదవి విరమణ కార్యక్ర మానికి విచ్చేసిన పెద్దలు రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, సి, ఎన్ రెడ్డి, గ్రామ వార్డు మెంబర్ ఆవులబిక్ష పతి, బోగరందాస్. మైనార్టీ. సెల్. నాయకుడు. ఎండి, ఫజల్. బోలుగుల భాగ్య తదితరులు పాల్గొని ఘనంగా సన్మానించారు.



# ప్రధాని చిత్ర పటానికి పాలాభిషేకం

**విశ్వంభర, ఆత్మకూరు:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం శనివారం రోజున మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆత్మకూరు(ఎం)మండల శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించినందుగాను భారత ప్రధాని నరేంద్ర మోడీకి పాలాభిషేకం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు గజరాజు కాశీనాద్, ప్రధాన కార్యదర్శి నాతి బిక్షపతి గౌడ్,కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి బండారు సత్యనారాయణ,ఆత్మకూరు గ్రామ ఉప సర్పంచ్ మజ్జిగ నరేష్, బీజేవైఎం మండల ప్రెసిడెంట్ పైల ప్రశాంత్,ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు మేడి సాగర్, ఆత్మకూరు భూత్ అధ్యక్షులు లోడి వెంకన్నగౌడ్,పరకాల రాంబాబుగౌడ్,బబ్బూరి వీరస్వామిగౌడ్,కోరే లక్ష్మణ్, బబ్బూరి శివలింగం గౌడ్,బోడ స్వామి,బండారు సాయి, ఎలిమినేటి రమేష్,తదితరులు పాల్గొన్నారు.



# త్రిపుర గవర్నర్ ని కలిసిన బిజెపి నాయకులు



**విశ్వంభర, ఆత్మకూరు:** త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదాద్రి శ్రీ లక్ష్మి నర్సింహా స్వామిని శనివారం రోజు దర్శించుకోవడానికి వచ్చిన సందర్భంగా వారిని మర్యాద పూర్వకంగా యాదగిరి గుట్టలోని రాష్ట్రపతి భవన్ లో కలవడం జరిగింది.వారి వెంట బీజేపీ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు బొట్టు అబ్బయ్య,జిల్లా ప్రధానకార్యదర్శి కాదురి అచ్చయ్య, ఆత్మకూరు(ఎం)ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్,బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి దయ్యాల కుమారస్వామి,దేవినేని వినోద్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలు


ఎస్పీ నరసింహా

**విశ్వంభర, సూర్యాపేట:** శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా మార్చి 1 వ తేది నుండి నెల రోజుల వరకు 30 పోలీస్ ఆక్ట్" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ శ్రీ నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండ పై కార్యక్రమాలు నిర్వహిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, అసత్యాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం చర్యలు తప్పవు అని తెలిపారు. బాణాసంచా, ఐజీ లు ఉపయోగించవద్దు అన్నారు.

# ప్రమాద భీమా కేసులను పరిష్కరించాలి

## జిల్లా జడ్జి మహ్మద్ అబ్దుల్ రఫీ



**విశ్వంభర, మహబూబాబాద్ :** మార్చి 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ లో రోడ్డు ప్రమాద బీమా కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించాలని మహబూబాబాద్ జిల్లా జడ్జి మహమ్మద్ అబ్దుల్ రఫీ పిలుపునిచ్చారు. జాతీయ లోక్ అదాలత్ సన్నాహక చర్యల్లో భాగంగా న్యాయమూర్తి శనివారం బీమా కంపెనీ న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులకు భీమా అనేది సంక్షేమ చట్టంలో భాగమని, కావున బీమా కంపెనీలు లోక్ అదాలత్ బాదితులకు సత్వర పరిష్కారం అందించటం లో సహకరించాలన్నారు. బాధితుల తరపు న్యాయవాదులు రాజీకి ముందుకు వచ్చినట్లయితే తాము పరిశీలిస్తామని భీమా కంపెనీ న్యాయవాదులు న్యాయమూర్తి దృష్టికి తీసుకొని వచ్చారు. దీంతో బాధితులకు సత్వర పరిహారం అందించే విధంగా బాధితుల తరపు న్యాయవాదులు లోక్ అదాలత్ ను వినియోగించుకోవాలని, న్యాయమూర్తి కోరారు. లోక్ అదాలత్ రాజీ వల్ల భీమా కంపెనీలకు వడ్డీ తగ్గింపుతో పాటు కక్షిదారులకు సత్వర పరిహారం అందుతుందని ఉభయ పక్షాలకు ప్రయోజనం చేకూర్చే జాతీయ లోక్ అదాలత్ ను, వినియోగించుకోవాలని న్యాయమూర్తి సూచించారు.

# ఘనంగా సైన్స్ ఫెయిర్



**విశ్వంభర,కేసముద్రం:** కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్సిబిషన్ వేడుకల్లో ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన కేసముద్రం మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శ్రీమతి డాక్టర్ అల్లం రమ-నాగేశ్వర్ రావు పిల్లల ఏర్పాటు చేసిన వివిధ ప్రయోగాలను వీక్షించి అభినందించారు. ఈ సందర్భంగా అల్లం రమ నాగేశ్వర్ రావు, మాట్లాడుతూ:- విద్యార్థిని విదార్థులు కష్టపడి చదవాలని, భవిష్యత్తులో ఉన్నతా శికారులకు చేరుకోవాలని అన్నారు, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించి సమాజంలో పేరు ప్రఖ్యాతలు తీసుకరావలి అని అన్నారు. మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గా ఎన్నికైన సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగులపాటి ఉమాకర్,అల్లం గణేష్ యాదవ్,భుక్య అరుణ్,పాల ముకేష్, కోదండ పని,కాట్రేవుల హరి కృష్ణ,రాజా శేఖర్,ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు ,తదితరులు ఉన్నారు.

# ఎస్ ఆర్ ఆర్ కాలేజీలో ఘనంగా సైన్స్ డే




**విశ్వంభర, హనుమకొండ :** సైన్స్ అనేది మన దైనందిన జీవితంలో అత్యంత కీలకమైన అంశం ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ జి. సీతారాం అన్నారు. శనివారం జనగామ ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ కాలేజీ లో మేరా యువభారత్ వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, సూపర్డెంట్ బానోత్ దేవిలాల్ ఆదేశాల మేరకు జనగామ పట్టణంలోని ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ కాలేజీలో కళాశాల నందు,నేషనల్ సైన్స్ డే, పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగింది. విద్యార్థులకు అధిక సంఖ్యలో పాల్గొని వారి ప్రతిభ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి. సీతారాం మాట్లాడుతూఈ ప్రపంచాన్ని శాస్తిస్తూ. నడిపించే శక్తిగా సైన్స్ కీలక పాత్ర పోషిస్తుంది వారు అన్నారు. నేషనల్ సై న్స్ డే ని పురస్కరించుకుని విద్యార్థులు పలు రకాల సైన్స్ ఎగ్జిబిట్స్ స్వయంగా తయారుచేసి, ప్రదర్శించారు. సోలార్ పవర్ ఇరిగేషన్, భూకంప అలారం, ఎయిర్ పొల్యూషన్, విద్యార్థి ని విద్యార్థులలో వైజ్ఞానిక ప్రదర్శన ద్వారా శాస్త్రీయ దక్పథం పెం పొందుతుందని, ముఖ్యంగా ప్రతి విద్యార్థి సజనాత్మకంగా ఆలో చించే తత్వాన్ని ప్రోత్సహించడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. నోబె ల్ బహుమతి గ్రహీత సీవీ రామన్ పరిశోధనల నుంచి ప్రేరణ పొంది, మరిన్ని కొత్త కొత్త పరిశోధనలు, ఆవిష్కరణలకు నాంది కావాలన్నారు. మొదటి బహుమతి ఎం సౌమ్య, రెండవ బహుమతి సింగారపు రమ్య, తృతీయ బహుమతి భాగ్యశ్రీ,అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పరమేశ్వర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ మండ రాజేష్ గౌడ్, ఫిజిక్స్ డిపార్ట్మెంట్ హెడ్ ఆయుబ్ ఖాన్, పావని, ముంతాజ్, కళాశాల విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ ఆనంద్ ని కలిసిన ఎమ్మెల్యే పరిటాల సునీత



**విశ్వంభర, రాప్తాడు:** అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కలిశారు. మార్చి 4న ముఖ్యమంత్రి చంద్రబాబుతో అనంతపురం జిల్లా నేతల సమావేశం ఉన్న నేపథ్యంలో ఆమె కలెక్టర్ తో ప్రత్యేకంగా కలిశారు. రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు, రాప్తాడు, అనంతపురం రూరల్ మండలాల్లోని సమస్యల గురించి కలెక్టర్ కు వివరించారు. జిల్లాల వారిగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఎస్పీలతో కలిసి సమీక్ష నిర్వహిస్తున్న సందర్భంగా మూడు మండలాల సమస్యల గురించి చర్చించారు. అనంతపురం రూరల్ మండల కాలనీల పరిధిలో ప్రవహించే నడిమివంకకు రక్షణ గోడ నిర్మాణానికి రూ.40 కోట్లు, జల జీవన్ మిషన్ నిధులతో పీఏబిఆర్ నుంచి నిర్మిస్తున్న పైప్ లైన్ కు సంబంధించిన పెండింగ్ బిల్స్ క్లియరెన్స్ అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి పలు చెరువులకు నీరందించే అంశం గురించి కూడా చర్చించారు. ఆత్మకూరు మండలంలోని హంద్రీ నీవా ప్రధాన కాలువ నుంచి అదే మండలంలోని పీఏబీఆర్ కుడి కాలువకు లింక్ కెనాల్ ఏర్పాటు చేసే అంశం గురించి సునీత, శ్రీరామ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ కాల్వల అనుసంధానం ద్వారా రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలలోని 50 చెరువులకు సాగు నీరు అందించే అవకాశం ఉందన్నారు. పండమేరు వాగు పై బ్రిడ్జి, రేమాండ్స్ సంస్థ ఏర్పాటును వేగవంతం చేయడం, పలు రోడ్ల నిర్మాణాలు, పండమేరు, పంపనురు ఆలయాల వద్ద టూరిజం పార్కుల ఏర్పాటు గురించి చర్చించారు. వీటిన్నింటిపై ఇప్పటికే ముఖ్యమంత్రికి, సంబంధిత శాఖల మంత్రులకు వినతి పత్రాలు అందజేశామన్నారు. సీఎంతో భేటి అయిన సమయంలో మీ ద్వారా నివేదిక ఇవ్వాలని కోరారు. అలాగే ఇన్ ఛార్జి మంత్రి టీజీ భరత్ తో ఈ అంశాల గురించి మేము మాట్లాడామని తమరు కూడా చర్చించాలని కోరారు. అన్ని అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి.. నిధులు వచ్చేలా చూస్తామని కలెక్టర్ అన్నారు. మరోవైపు ఆత్మకూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ నుంచి స్మశానానికి వెళ్లే దారి పరిష్కారం, రోడ్డు నిర్మాణం గురించి ప్రత్యేకంగా వినతి పత్రం అందజేశారు. ఎవరైనా చనిపోతే.. మృతదేహాన్ని తీసుకెళ్లాలంటే.. వర్షపు నీటిలో వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. అక్కడ సి.సి రోడ్డు, డ్రైన్ ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని కలెక్టర్ కు వివరించారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ ఓ.ఆనంద్ ఎమ్మెల్యే సునీతకు హామీ ఇచ్చారు.

# వయసు విద్యకు అడ్డు కాదు




**విశ్వంభర, హనుమకొండ:** వరంగల్ జిల్లా ఏవివి కళాశాలలో తెలుగు ఉపాధ్యాయురాలు వెల్లంకి రమాదేవి ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. టీచర్ వృత్తి అనేది విద్యార్థులతో మమేకమై విద్యాబుద్ధులు నేర్పే ఒక అద్భుతమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి . అట్టి వృత్తిని నేడు పదవి విరమణ పొందుతున్న ఏవివి పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలు రామాదేవి అన్నారు. ఏవివి పాఠశాలలో ఏర్పాటుచేసిన వీడ్కోలు సమావేశంలో వారు మీడియాతో మాట్లాడుతూ... ఉద్యోగ సాధనకు పరిస్థితులకు సంబంధం లేకుండా ఉద్యోగం సాధించవచ్చని తనకు వివాహం జరిగిన పది సంవత్సరాలకు తన భర్త సహకారంతో ఉద్యోగ సాధనకు కృషి చేయగా ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయురాలుగా ఉద్యోగం సాధించానని అన్నారు. చదువుకు వయసు అడ్డు కాదని ఏ వయసులోనైనా చదువుకోవచ్చని అన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే విద్య జీవితాన్నిస్తుందని తెలిపారు. చదువు కోవాలని అటువంటి జిజ్ఞాస ఉండాలి గనుక మనకు ఏ వయసులో చదువు తున్నాము ఎప్పుడు చదువుతున్నాము అనేటువంటిది అయితే ఉండదు అని నేను అనుకుంటున్నాను. అని అన్నారు. ఏవివి పాఠశాలలో సంతృప్తిగా ఉద్యోగం చేశానని ,ఉద్యోగ విరమణ చేసినాక ఇప్పుడు కొంచెం కష్టమే కానీ ఇంకా ఏదో విద్యార్థులకు సేవ చేసే కార్యక్రమాలలో తప్పకుండా పాల్గొంటు న్నానని అని అన్నారు. కార్యక్రమంలో భూపతి మారుతి, భార్గవి ,ప్రశాంత్ ,ఎంఈఓ వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు భూజేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# స్టడీ మెటీరియల్ పంపిణీ




**విశ్వంభర, చింతపల్లి :** మండలంలోని ఘడియ గౌరారం గ్రామంలో జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో పిఆర్ఆర్ ఫౌండేషన్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండు రంగారావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి గమ్యం చేరాలని విద్యార్థి భవిష్యత్తు ఎదుగుదలకు పదవ తరగతి తొలిమెట్టు అని విద్యార్థి అనుకున్న లక్ష్యం చేరాలంటే ఏకాగ్రతతో చదవాలని లుక్ కల్చర్ కు దూరంగా ఉంటూ బుక్ కల్చర్ అలవాటు చేసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రుల గౌరవాన్ని గురువుల శ్రమను గుర్తుపెట్టుకుని భవిష్యత్తు వైపు పయనించాలని విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చేది చదువు ఒకటేనని సమయాన్ని వృధా చేయకుండా పట్టుదలతో ప్రయత్నిస్తే సాధ్యం కానిది లేదని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులలో మార్పు విష సంస్కృతి మాదకద్రవ్యాలను పారదోలాలనే ఉద్దేశంతో మంచి జ్ఞానాన్ని అందించాలని లక్ష్యంతో పిఆర్ఆర్ ఫౌండేషన్ గత ఐదు సంవత్సరాల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెటీరియల్ అందించడం జరుగుతుందన్నారు. ఈ మెటీరియల్ ను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధిస్తే భవిష్యత్తులో పిఆర్ఆర్ ఫౌండేషన్ మరిన్ని సేవా కార్యక్రమాలకు శ్రీకారం చూడ్తోందని ఈ మెటీరియల్ రాష్ట్ర స్థాయి విషయ నిపుణులచే రూపొందించబడిందని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్ నల్గొండ జిల్లా కలెక్టర్ జిల్లా, ఎస్పీ, యాదాద్రి కలెక్టర్ లాంటి వారి చేతుల మీదుగా ఆవిష్కరించిన మెటీరియల్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి దోహదపడుతుందని ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు అన్నారు. ఎంత సంపద ఉన్న తరగని ఇతరులు దొంగిలించలేని ఆస్తి విద్య ఒకటేనని కాబట్టి దాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలని విద్యార్థులు ఇచ్చే మంచి ఫలితాలు పిఆర్ఆర్ ఫౌండేషన్ నిర్వహించే భవిష్యత్ కార్యక్రమాలకు ప్రోత్సాహంగా ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులలో మార్పు కోసం పి ఆర్ ఆర్ ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తుందని ఆయన అన్నారు. పిఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ చెల్లం పాండురంగారావు పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశం చేతుల మీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు కృష్ణయ్య, భాగ్యలక్ష్మి, హేమ, వాణి, కుమారి, శ్రీలత, కృష్ణయ్య, శశికళ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మవిశ్వాసంతో చదివితే విజయం మీ సొంతం

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**విశ్వంభర, సంగారెడ్డి :** జిల్లా రామచంద్రాపురం ఆత్మవిశ్వాసంతో చదివితే విజయం మన సొంతం అవుతుందని.. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికబద్ధంగా చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి నియోజకవర్గ పరిధిలోని 10వ తరగతి విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో తన సొంత నిధులతో పదోతరగతి విద్యార్థుల కోసం తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ ప్రేరణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులతో మోటివేషనల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి జీవితంలో పదవ తరగతి పరీక్షలు అత్యంత కీలకమని.. ఇలాంటి సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు.. ప్రణాళిక బద్ధంగా చదివేందుకు ఈ తరగతులు ఎంతగానో ఉపకరిస్తున్నాయని తెలిపారు. చదువు అంటే కేవలం ర్యాంకులు ఒక్కటే కాదని.. ప్రతి విద్యార్థి చదువుతోపాటు నైతిక విలువలు, మానసిక సామర్థ్యం, శారీరక ధారుఢ్యం పెంపొందించుకోవాలని కోరారు. విద్యార్థులను ప్రోత్సహించడం కోసం ప్రతి సంవత్సరం మండల స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సొంత నిధులతో నగదు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నామని తెలిపారు. విభిన్న సంస్కృతులకు నిలయమైన పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని పేద మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య భారం కాకూడదన్న సమున్నత లక్ష్యంతో.. పటాన్చెరులో కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వ విద్యాసంస్థలు నెలకొల్పడం జరిగిందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో మండల విద్యాధికారులు రాములు, సుధాకర్, మండల విద్యాధికారి పీపీ రాథోడ్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు మధు, సీనియర్ నాయకులు రామచంద్రా రెడ్డి, నర్రా బిక్షపతి. ఐలేష్ యాదవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ టైలర్స్ డే



**విశ్వంభర,ఇనుగుర్తి:** ప్రపంచ టైలర్స్ డే పురస్కరించుకొని మండల కేంద్రం ఇనుగుర్తి లో ఇనుగుర్తి,చిన్నముప్పారం వివిధ గ్రామాల టైలర్స్ శనివారం ఘనంగా నిర్వహించారు. దర్జీ సంఘం మండల అధ్యక్షుడు రామగిరి యాదగిరి జెండా ఆవిష్కరించారు. మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి దర్జీలు వస్త్రాలను అందమైన డ్రస్సులుగా స్టిచ్చింగ్ చేసి అన్ని వయసుల ప్రజల అందం మరింత ఇనుమడింప చేస్తున్నాం ˘న్నారు. దర్జీల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని పలువురు మండలాధ్యక్షుడుకి సూచించారు. కార్యక్రమంలో రామగిరి సమ్మయ్య, సూర్యనారాయణ, కేదారి,సంగ శ్రీరంగం,కుమార్, మరాఠి చంద్రయ్య, రాజు, చందర్,చంద్రమౌళి,నర్సయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్లకు కంటి వైద్య శిబిరం




**విశ్వంభర,సూర్యాపేట:** రోడ్డు ప్రమాదాల నివారణ, గమ్యం చేరడం ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర పోలీసు డిజిపి గారు ప్రారంభించిన 'ఆరవ్ అలైవ్' మహా ఉద్యమం కార్యక్రమం 2వ విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలో రవి పంక్షన్ హాల్ నందు ఏర్పాటుచేసిన వివిధ రకాల వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల వైద్య శిబిరాన్ని శనివారం రోజున జిల్లా ఎస్పి నరసింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ముందు జాగ్రత్తలు పాటించడంతోనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చును అన్నారు, ప్రపంచవ్యాప్తంగా సగటున రోజుకి 3500 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారని భారత దేశంలో సమత్సర కాలంలో సుమారుగా 1.5 లక్షల మంది రోడ్డు ప్రమాదాల బారిన పడి చనిపోతున్నారని, తెలంగాణ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 7500 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారని తెలిపారు. ఈ శిబిరం ద్వారా 500 వందలకు పైగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామని, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిఎస్పీ ప్రసన్న కుమార్, మాజీ శాసనసభ్యులు లయన్స్ క్లబ్ అధ్యక్షులు దోసపాటి గోపాల్, లయన్స్ క్లబ్ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, పట్టణ సీఐ వెంకటయ్య, జ× లు రాజశేఖర్, నరసింహారావు, నాగేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, డివిజన్ పరిది ఎస్ఐ లు, మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ లు సంపత్, సతీష్ కుమార్, కంటి డాక్టర్లు రంజిత్ కుమార్, బంగారు స్వాతి, గ్లోబల్ హాస్పటల్ యాజమాన్యం క్రాంతి, భిక్షపతి పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు డ్రైవర్లు పాల్గొన్నారు.




# ఆకట్టుకున్న స్కూల్ సైన్స్ ఫెయిర్

**విశ్వంభర, హైదరాబాద్:** ప్రెస్టీజియస్ స్కూల్ తన క్యాంపస్‌లో ఆకట్టుకునే సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. విద్యార్థుల వినూత్న, సృజనాత్మక ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులు బిజినెస్ కౌన్సిల్‌లో మహిళా చైర్‌పర్సన్, తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ వ్యవస్థాపకురాలు బెల్లం మాధవి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత సామాజిక కార్యకర్త, వ్యవస్థాపకురాలు, ది యంగేటర్స్ వాయిస్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మనోజ్ సవేరా ఖన్నా, ప్రొఫెషనల్ వాల్ మ్యూరల్ ఆర్టిస్ట్, యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కంటెంట్ క్రియేటర్ ఉదయ్ సోమ ల చేతుల మీదుగా ప్రారంభించారు. వారు విద్యార్థుల ప్రయత్నాలను అభినందించారు. శాస్త్రీయ ఆలోచన ఆవిష్కరణలను అభివృద్ధి చేయడానికి వారిని ప్రోత్సహించారు.ప్రదర్శన ముఖ్యాంశాలలో పనిచేసే రోబోటిక్ మోడల్, ట్రాఫిక్ సెన్సార్ సిగ్నల్ సిస్టమ్ ఉన్నాయి. ఇది సందర్శకుల నుండి ప్రత్యేక దృష్టిని ఆకర్షించింది. పునరుత్పాదక శక్తి, పర్యావరణ పరిరక్షణ ఆరోగ్య అవగాహనపై విద్యార్థులు కూడా ప్రాజెక్టులను ప్రదర్శించారు. వారు తమ నమూనాలను నమ్మకంగా వివరించారు. బలమైన శాస్త్రీయ అవగాహనను ప్రదర్శించారు. పాఠశాల నిర్వహణ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అంకితభావం కృషి చేసిన విద్యార్థులను ఉపాధ్యాయులను జౌనస్ పానీ, మరి ఠాకూర్ సంధ్యా రాణి లు అభినందించారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత, ప్రదర్శన నైపుణ్యాలను ప్రశంసించారు. శాస్త్రీయ అభ్యాసాన్ని ప్రోత్సహించడంలో యువ ఆవిష్కర్తలను పెంపొందించడంలో పాఠశాల నిరంతర నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుందనీ పేర్కొన్నారు.

# యువత క్రీడల పై ఆసక్తి చూపాలి



**విశ్వంభర, ఘట్కేసర్ :** మేడ్చల్ జిల్లా పోచారం సర్కిల్ ప్రతాప్ సింగారం లో క్రికెట్ గ్రౌండ్ ని శనివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి స్థానిక మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుదీర్ రెడ్డి తో కలిసి ప్రారంభిచారు అయిన మాట్లా డుతూ క్రీడాలపట్ల అసక్తి చూపాలని నేటి యువత క్రికెట్ పట్ల చూపుతున్న ఆదరణ అనుగుణంగా క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు చేయ డం సంతోష దగ్గ విషయం అని అన్నారు ఈ కార్యక్ర మం లో మేడ్చల్ జిల్లా మాజీ జడ్పీటీసీ మలిపెద్ది శరత్ చంద్ర రెడ్డి క్రీడకారులు తదతరులు పాల్గొన్నారు.

# అలరించిన సాంస్కృతికోత్సవాలు

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో వార్షిక సాంకేతిక-సాంస్కృతికోత్సవాలు (ప్రమాణ-2026) శనివారం నిర్వహించిన ఈడీఎం-డీజే నైట్ తో విజయవంతంగా ముగిశాయి. ఈ రెండు రోజుల వేడుకకు విద్యార్థులు, ఇతరుల నుంచి అద్భుతమైన స్పందన కనిపించింది. గీతం హైదరాబాదు ప్రాంగణాన్ని సాంకేతిక, సృజనాత్మక, సాంస్కృతిక వ్యక్తీకరణ యొక్క శక్తివంతమైన సంగమంగా మార్చింది. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రసిద్ధ చలనచిత్ర దర్శకుడు బోయపాటి శ్రీను ప్రమాణ-2026ను లాంఛనంగా ప్రారంభించి, విద్యార్థులను ఉన్నతాశయాల వైపు ప్రేరేపించేలా స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు. ప్రసిద్ధ భారతీయ సినిమా దర్శకుడు, స్క్రీన్ రైటర్ హరీష్ శంకర్ కూడా విద్యార్థులను తమ కలలను ఆసక్తి, ధైర్యంతో అనుసరించాలని ప్రేరేపిస్తూ ఉత్సాహభరిత, ప్రేరణాత్మక ప్రసంగం చేశారు.



# వైద్య శిబిరం విజయవంతం




**విశ్వంభర, హనుమకొండ:** వరంగల్ జిల్లా లోని కాకతీయ మెడికల్ కాలేజ్, వరంగల్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో గుంటూరు పల్లి గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతం అయినట్లు గ్రామ సర్పంచ్ శ్రీరామ్ చౌదరి అరుణ దంపతులు మీడియాకు శనివారం తెలిపారు. అనంతరం మూడు గ్రామాల కుటుంబ దత్తత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.కెఎంసి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణి మార్గదర్శకత్వంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ శ్రీధర్ ప్రొఫెసర్ డాక్టర్ మురళి నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంబీబీఎస్ 2025 బ్యాచ్ విద్యార్థులు కుటుంబ దత్తత కార్యక్రమంలో భాగంగా తిమ్మాపూర్, గుంటూరుపల్లి,ఆరేపల్లి గ్రామాలను దత్తత తీసుకుని గుంటూరుపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరుపల్లి సర్పంచ్ శ్రీరామ్ చౌదరి అరుణ దంపతులు,ఆరేపల్లి సర్పంచ్ స్రవంతి రాజు దంపతులు,తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ మానస మహేందర్ దంపతులు,బావుపేట సర్పంచ్ రవీందర్ గౌడ్,ఇంద్రసేనా రెడ్డి,ఎల్కతుర్తి మార్కెట్ చైర్మన్ సంతాజీ హాజరై రిబ్బన్ కట్ చేసి ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా కెఎంసి ప్రొఫెసర్ డాక్టర్ అనూష మీడియాతో మాట్లాడుతూ ఈ రోజు నిర్వహించిన వైద్య శిబిరానికి గుంటూరుపల్లి, ఆరేపల్లి,తిమ్మాపూర్ గ్రామాల నుండి సుమారు 1000 మంది ప్రజలు హాజరై ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారన్నారు.ఈ వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్,ప్రసూతి గైనకాలజీ,పిల్లల వైద్యం, ఈఎన్‌టి,కంటి వైద్యం విభాగాల వైద్యులు ఓపీడీ సేవలను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్లు నరేష్, అనుష, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ మీనూ,పీజీ విద్యార్థులు,హౌస్ సర్జన్లు, ఎంఎస్‌డబ్ల్యూ సరస్వతి, ఆశా వర్కర్ మన్నెం భవానీ, కార్యకర్తలు, యువకులు చురుకుగా పాల్గొన్నారు.



# విద్యార్థినులకు ఆరోగ్యం పై అవగాహన

**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట పట్టణంలో రాజీవ్ నగర్ సమీపంలో ప్రభుత్వ ఎస్సీడీడీ బాలికల డిగ్రీ హాస్టల్, బీసీ, బీసీసీ ప్రభుత్వ బాలికల హాస్టళ్లలో డీఎంహెచ్వో డాక్టర్ వెంకటరమణ సూచనల మేరకు విస్తృత ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యురాలు డాక్టర్ జి.వాసవి నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.పరీక్షల సమయంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించడం, మానసిక ఆరోగ్యం, పౌష్టికాహార ప్రాధాన్యతపై డాక్టర్ వాసవి అవగాహన కల్పించారు. ముఖ్యంగా రక్తహీనత నివారణ, దానివల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత, డ్రగ్ అబ్యూస్ ప్రమాదాలపై క్షుణ్ణంగా వివరించారు. చేతులు కడుక్కునే సరైన విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉపేంద్ర, ఏఎన్‌ఎంలు అవంతి, శిరోమణి, ఆశా కార్యకర్తలు కళమ్మ, భాగ్యమ్మ, సీత పాల్గొన్నారు.

# చైర్ పర్సన్ కి ఘన సన్మానం



**విశ్వంభర, చేవెళ్ల:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం చేవెళ్ల మున్సిపాలిటీ నూతన చైర్పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోపాల్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చేవెళ్ల మాజీ సర్పంచ్, ప్రస్తుత కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి కూడా పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతలు చేపట్టిన సమతా వెంకట్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉండి చేవెళ్ల అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో అందరి సహకారంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, అత్తిలి రఘు తదితరులు పాల్గొని చైర్పర్సన్‌కు అభినందనలు తెలియజేశారు.

# మీడియా క్లబ్ నూతన కమిటీకి ఘన సత్కారం

**విశ్వంభర, ఉప్పల్:** ఉప్పల్ మీడియా క్లబ్ నూతన కమిటీ సభ్యులను తెలంగాణ జాగృతి మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు రామిడి వెంకట్ రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరం ఫౌండర్, చైర్‌పర్సన్ డాక్టర్ వ్యాసభట్ శ్రీవాణి చౌదరి పాల్గొన్నారు. రామిడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్టు, నూతన అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్ నాయకత్వంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఐక్యంగా ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కమిటీ సమన్వయంతో పనిచేసి మీడియా ప్రతిష్ఠను పెంచాలని సూచించారు. క్లబ్ చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి సమితి నాయకులు రాకేష్ గైకౌడ్, ఆర్. సాకూర్, హర్ష ఆస్థాన, ఆంజనేయులు, జె .సైదులు మరియు ఉప్పల్ మీడియా క్లబ్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రొ.డి కరుణాసాగర్ కు అవార్డు ప్రధానం




**విశ్వంభర, బషీర్ బాగ్:** విజ్ఞానమే నా మతం, జీవితాంతం దానినే ఆరాధిస్తానని చెప్పిన విజ్ఞాన ఘని సర్ సివి రామన్ అని, జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ మాజీ రిజిస్టర్ మరియు భౌతిక శాస్త్ర సీనియర్ ప్రొఫెసర్ వై సి వేణుధర్ అన్నారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో శనివారం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ సైఫాబాద్ ఆడిటోరియంలో భారతరత్న, నోబుల్ బహుమతి గ్రహీత సర్ సివి రామన్ భౌతిక శాస్త్రంలో సాధించిన కృషిని సివి రామన్ ఎఫెక్ట్ను ప్రపంచమంతా గుర్తుపెట్టుకుంటారని అన్నారు. భారత గడ్డపై చదువుకొని తలమానికమైన పరిశోధనలు జరిపి సైన్స్ లో దేశ శక్తి, సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పిన మేధావి సివి రామన్ అని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అప్పారావు అన్నారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ సైన్స్ అనేది మన దైనందిన జీవితంలో అత్యంత కీలకమైన అంశమని,ఈ ప్రపంచాన్ని శాసిస్తూ నడిపించే శక్తిగా సైన్స్ కీలక పాత్ర పోషిస్తుంది అన్నారు. తరువాత డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ ఈ సందర్భంగా ప్రొఫెసర్ డి కరుణాసాగర్ కు సర్ సివి రామన్ ఎక్సలెన్స్ అవార్డు 2026 ను శాలువా, పూలమాల,ప్రశంసా పత్రం, జ్ఞాపికతో ఘనంగా సన్మానించి అవార్డు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, మునిపంపుల గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రోజు విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి విద్యాశాఖ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, ఎమ్మార్వో, డిఈఓ, ఎంఈఓ లుగా ఒకరోజు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తమ పాత్రలలో పాలనా దక్షతలను చాటి అబ్బురపరిచారు. విద్యాశాఖ మంత్రి గాదె హర్షవర్ధన్, ఎంపీగా కమ్మంపాటి రామ్ నితిన్, కలెక్టరుగా వేముల పల్లవి, ఎమ్మెల్సీగా వై.రాంచరణ్ రాజు, ఎమ్మెల్యేగా గాదె హర్షవర్ధన్, ఆర్డీఓ గా బి.ప్రమోద్ కుమార్, ఎమ్మార్వోగా రాజేశ్, హెడ్ మాస్టరుగా సీతు, ఏఏపీసీ చైర్మెన్ గా గాదె నిహారిక, ఆర్జెడి గా బి.సమరసింహా రెడ్డి, డీఈఓగా ఆవుల సిరి, ఎంఈఓగా ఎస్.శ్రీవాణి, సర్పంచ్ గా జే.లోకేశ్, జెడ్పీటీసీగా బి.నిష్వంత్, ఎంపీటీసీగా కే.శ్రీకాంత్, ఉప-సర్పంచ్ గా ఈ.లోకేశ్ లు చక్కగా తమ పాత్రలను పోషించారు. హెడ్ మాస్టర్ భానుమతి తమ పాఠశాల సమస్యలను ప్రజా ప్రతినిధులతో చర్చించారు. అనంతరం జనగణమనతో ముగించారు. మధ్యాహ్నం ఒకరోజు ఉపాధ్యాయులకు రెగ్యులర్ టీచర్లు వడ్డించగా సహపంక్తి భోజనం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో విద్యార్థులు తమ అనుభవాలను, టీచర్లు విద్యార్థుల విద్యాభివృద్ధికై, తమకై వారు చేసే కృషిని అందరితో పంచుకున్నారు. అమంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొడ్డి స్వామి మాట్లాడుతూ, ఈ దేశం భవిష్యత్తు నిర్మించడంలో నేటి విద్యార్థులు రేపటి పౌరులుగా జన్మ భూమికి మంచి పేరు తీసుకురావాలని, నేడు పోషించిన పాత్రలను నిజ జీవితంలో నెరవేర్చుకొనుటకు కృషి చేయాలని హితబోధ చేశారు. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులనందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏఏపీసీ చైర్మన్ బత్తిని వెంకటమ్మ, ఉపాధ్యాయులు తిరుమల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, వసంత, మనోహర్, మంజుల, త్రివేణి ప్రసాద్, రేవతి, మంజుల, సరోజ, పాల్వంచ హరికిషన్, శ్రీశైలం, సునిత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# యుపిఎస్ లో ఘనంగా స్వయం పాలన



**విశ్వంభర, నెల్లికుదురు:** మండలం శ్రీరామగిరి ఎం.పీ.యు.పి.ఎస్ లో శనివారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠశాల పాలనతో పాటు,తమ తోటి విద్యార్థులకు బోధనా సామాగ్రిని ఉపయోగించి పాఠాలు బోధించారు.విద్యార్థులు శ్రద్ధగా విని సందేహాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెచ్.ఎం బొమ్మరాజు సాయిలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్వయంపాలన టీచర్లు బోధనలో తమకు ఎదురైన అనుభవాలను వివరించారు. హెచ్ ఎం సాయిలు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఎంచుకుని వాటి సాకారానికి పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. హెచ్‌ఎం గా ఆంగోతుకు సాత్విక, ఎంఈవోగా ఆరేపల్లి చరణ్ తేజ్ తో పాటు కొందరు స్టూడెంట్స్ ఉపాధ్యాయుల పాత్ర పోషించారు. బెస్ట్ టీచర్స్ కు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమం లో పిఆర్టియు మండల అధ్యక్షులు కొత్త నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు ఆలూరి విలియమ్స్, భాగ్యమ్మ,శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్,జక్కుల మాధురి తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేటలో కేంద్ర బృందం పర్యటన



**విశ్వంభర,సూర్యాపేట:** జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలన నిమిత్తం కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ నుండి వచ్చిన కేంద్ర బృందం సభ్యులు తేదీ.26-2-2028 నుండి 28-2-2026 వరకు పర్యటించినది. తేదీ.26-2-2026 న తుంగతుర్తి మండలం తుంగతుర్తి గొట్టిపర్తి గ్రామపంచాయతీల ఉపాధి హామీ పనులను, రికార్డులను పరిశీలించారు, తేదీ. 27-2-2026 న నూతనకల్ మండలం దర్శించర్ల, సోమ్లా తండా గ్రామ పంచాయతీలను సందర్శించి ఉపాధి హామీ పనులను రికార్డులను పరిశీలించారు. అనంతరం తేదీ 28-2-2026 న శనివారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సందర్శన వివరాలను కేంద్ర కమిటీ సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కేంద్ర బృందం సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దిల్ కుష్ మీనా, సంజయ్ పాండే, జాగృతి రాయ్ పాల్గొన్నారు.

# కక్కిరేణి పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, కక్కిరేణి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం రోజు స్వపరిపాల దినోత్సవ కార్యక్రమాన్ని విద్యార్థులచే వినూత్నంగా ఏర్పాటు చేయడంతో గ్రామ ప్రజల మన్నలను పొందడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఉపేందర్ జి తెలిపారు. విద్యాశాఖ మంత్రిగా అంకిరెడ్డి జశ్విక, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా కన్నెబోయిన లిఖిత, కలెక్టరుగా చిల్లా యోగిత, ఎమ్మెల్యేగా చిల్లా రాకేష్, జిల్లా విద్యాధికారి నడిగోటి తనుస్వి, ఎంఈఓగా రియన్, యంఆర్ఓ గా శుష్మ, యంపిడిఓ గా మైథిలి, పాఠశాల హెచ్ఎం గా బుర్ర అక్షిత వ్యవహరించారు. గ్రామంలో అధికారులు ర్యాలీగా వెళ్లి అక్కడక్కడ గ్రామ సమస్యలు తెలుసుకొని గ్రామ పంచాయతీ ఇందిరమ్మ ఇండ్ల పరిశీలనలో ఎమ్మెల్యే పాల్గొన్న అనంతరం పాఠశాలలో పలు తరగతులు సందర్శించారు. వీరు చేసిన కృషికి పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఉపేందర్ జి, ఉపాధ్యాయులు జి.గణేష్, పి.గోపాల్ రెడ్డి, కృష్ణ, స్వర్ణలత, ప్రశాంతి, ఎస్ఎంసి చైర్మన్ చిల్లా హేమలత మురళీకృష్ణ, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ పిట్ట రాంరెడ్డి, వేముల సైదులు, చిల్ల భవాని, మధు, కావ్య వెంకట్, కమలాకర్, ప్రమీల, సంధ్య, ధనమ్మ, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాలలో సైన్స్ దినోత్సవం



**విశ్వంభర, చింతపల్లి :** చింతపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ కాసారపు శ్వేతా శ్రీనివాస్ ఈ కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పాఠశాలలో విద్యార్థులు తయారుచేసిన ప్రయోగాలను ఆమె పరిశీలించారు. విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత, మరియు కొత్త ఆవిష్కరణలను చేసే విధంగా కృషి చేయాలని చెప్పారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అమ్తుల్ జమాల్ ఆస్రా మాట్లాడుతూ సైన్స్‌తోనే దేశం అభివృద్ధి జరుగుతుందని, కరోనా వంటి కష్ట కాలంలోనూ మన శాస్త్రవేత్తలు వ్యాక్సిన్ తయారు చేసి ఎన్నో దేశాల ప్రజలను కాపాడారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు తయారుచేసిన అనేక రకాల వర్కింగ్ మోడల్ లను, ప్రాజెక్టులను ప్రదర్శించారు. సైన్స్ ఫేర్‌లో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రయోగాలకు గ్రామంలో వివిధ పాఠశాలల విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తిలకించి పిల్లలను అభినందించారు.

# కలర్స్ హెల్త్ కేర్ ను ప్రారంభించిన హీరోయిన్ కేథరీన్ థెరీసా



**విశ్వంభర, బషీర్ బాగ్ :** హిమయత్‌నగర్ తిరుమల ఎస్టేట్‌లో ప్రముఖ హెల్త్, వెల్‌నెస్ సంస్థ 'కలర్స్ హెల్త్ కేర్' తన నూతన బ్రాంచ్ 'కలర్స్ హెల్త్ కేర్ 2.0'ను ఘనంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి సౌతిండియన్ గ్లామరస్ హీరోయిన్ కేథరీన్ థెరీసా ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఆవిష్కరించారు. ఆధునిక సాంకేతికతతో రూపుదిద్దుకున్న సౌకర్యాలను పరిశీలించిన కేథరీన్ థెరీసా, సంస్థ అందిస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల ప్రతి ఒక్కరూ లైఫ్‌స్టైల్, ఫిట్‌నెస్, ఆరోగ్యంపై ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారు. ప్రజలకు అందం, ఆరోగ్యం కలగాలంటే ఇలాంటి ఆధునిక కేంద్రాలు అవసరం. 'కలర్స్ హెల్త్ కేర్ 2.0' ద్వారా నాణ్యమైన సేవలను అత్యాధునిక టెక్నాలజీతో అందించడం అభినందనీయం అన్నారు. ప్రతి ఒక్కరూ ఫిట్‌గా ఉండేందుకు సరైన ట్రీట్మెంట్ తీసుకోవాలి" అని పేర్కొన్నారు. కలర్స్ హెల్త్‌కేర్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట శివాజీ కూన మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా సేవలను అప్‌డేట్ చేస్తూ 2.0గా రూపాంతరం చెందింది. యూఎస్-ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన టెక్నాలజీతో అధిక బరువు, హెయిర్, స్కిన్ సమస్యలకు అంతర్జాతీయ ప్రమాణాల చికిత్సలను అందిస్తున్నాం ఆరోగ్యంగా, అందంగా ఉండాలన్న ప్రతి ఒక్కరి ఆశకు కలర్స్ హెల్త్ కేర్ ఎల్లప్పుడూ తోడ్పడుతుందని అన్నారు.

## భద్రాచలం ఆలయానికి మూడు కంప్యూటర్ల విరాళం

**విశ్వంభర, భద్రాచలం:** ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తుల సేవా కార్యక్రమాలు నిరంతరం విస్తరిస్తూనే ఉన్నాయి. ఆలయ పరిపాలన వ్యవస్థను మరింత ఆధునికీకరించే దిశగా హైదరాబాద్ వాస్తవ్యురాలు డా. కవిత గారు ముందుకొచ్చి స్వామివారికి రూ.1,59,300 విలువ గల మూడు అత్యాధునిక కంప్యూటర్లను విరాళంగా సమర్పించారు. ఈ కంప్యూటర్లను దేవస్థానం కార్యాలయ నిర్వహణ, భక్తుల సేవల విస్తరణ, డేటా నిర్వహణ, అకౌంటింగ్ వ్యవహారాలు మరియు ఆన్‌లైన్ సేవల మెరుగుదలకు వినియోగించనున్నట్లు అధికారులు వెల్లడించారు. డిజిటల్ వ్యవస్థల బలోపేతానికి ఈ విరాళం ఎంతో దోహదపడుతుందని దేవస్థానం వర్గాలు పేర్కొన్నాయి. విరాళంగా అందిన కంప్యూటర్లను దేవస్థానం ఈఓ శ్రీ కె. దామోదర్ రావు గారు క్యాంపు కార్యాలయంలో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "భక్తుల సహకారం వల్లే దేవస్థానం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా భక్తులకు మరింత పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించాలన్న లక్ష్యానికి ఈ విరాళం బలాన్ని ఇస్తుంది" అని పేర్కొన్నారు. డా. కవిత గారి సేవాభావాన్ని అభినందిస్తూ, దేవస్థానం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భక్తుల నుండి ఇలాంటి సహకారం మరింతగా అందితే ఆలయ సేవలు రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# సనాతనంలో... అధునాతనం!



**పాతికేళ్ళ క్రితం ఒక పత్రికకు చెందిన ఆదివారం సంచిక. అందులో సంపాదకుడు రాసిన ఒక వ్యాసం. దేవాలయ వ్యవస్థలో ఒక అమూల్యమైన అంశానికి సంబంధించి జరిగిన పోరాటం, విజయాన్ని వెలుగులోకి తెచ్చింది. అ వ్యాసంలో ప్రస్తావించిన దేవాలయం ఇప్పటికీ ప్రత్యేకతను కొనసాగిస్తూనే ఉన్నది. ఆ ప్రత్యేకత కోసం పోరాడిన వ్యక్తి, ఆ సంప్రదాయాన్ని వుణికి పుచ్చుకున్న అతని వారసులు ఆ ప్రాశస్త్యాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ఆ దేవాలయం హైదరాబాదుకు శివారులో ఉన్న శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి(బాలాజీ)ఆలయం. ఆ ప్రాశస్తం కోసం పోరాడి విజయం సాధించిన యోధుడు, ఆలయానికి నాటి ప్రధాన పూజారి సౌందర్ రాజన్. శుక్రవారం ఆయన పరమపదించారు. ఆయన చేసిన నాటి పోరాటం ఎల్లప్పటికీ ఆదర్శప్రాయమే. దానిని మరొక్కసారి గుర్తు చేసుకోవడం ఒక గొప్ప అవకాశంగానే భావించాలి.**

హైదరాబాద్ మహానగరానికి పడమర వైపున ఉన్న అత్యంత పురాతనమైన చిలుకూరు శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయం ఉన్నది. తమిళనాడు నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన సౌందర్ రాజన్ అప్పట్లో ఆ దేవాలయ నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. నగరానికి సమీపంలోనే ఉన్నందున భక్తుల రాక కూడా క్రమంగా పెరిగింది. తదనంతర కాలంలో వీసాల దేవుడుగా కూడా ఇక్కడి శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి పేరుగాంచారు. విదేశాలకు వీసా కావాలంటే విశ్వాసంతో నమ్మకంతో ఇక్కడకు వచ్చి దేవుడిని వేడుకుని దేవాలయం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తే కోరిక నెరవేరుతుందని భక్తులకు నమ్మకం పెరిగింది. సౌందర్ రాజన్ ఈ దేవాలయానికి ప్రధాన అర్చకుడుగా ఉన్న సమయంలోనే ఈ దేవాలయాన్ని... దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోనికి తేవాలని అప్పటి ప్రభుత్వాలు నిర్ణయించాయి. దేవాలయం ప్రభుత్వం చేతుల్లోకి వెళ్లకుండా సౌందర్ రాజన్ సుదీర్ఘ పోరాటం చేశారు. దేవాలయం ప్రభుత్వం నిర్వహణలోకి వెళితే... ఏం జరుగుతుందో? తెలిసిందే. దేవాలయ ఆస్తులు, ఆదాయము పరిగణలోకి తీసుకొని వాటిని ప్రభుత్వ నిర్వహణ పరిధిలోకి తేవడం జరుగుతుంది. భక్తుల సంఖ్య భారీగానే ఉన్నందున నిబంధనల ప్రకారం చిలుకూరు దేవాలయం... ప్రభుత్వ నిర్వాహణలోకి వెళుతుంది. దానిని అడ్డుకునేందుకు రాజన్ సుదీర్ఘ పోరాటాలు చేసి చివరికి కోర్టుల వరకు వెళ్లారు. ప్రభుత్వ నిబంధనలను అధిగమించడం సాధ్యం కాదు. అందుకోసం సౌందర్య రాజన్ చేసిన ఆ పని ఇప్పటికీ దేవాలయ వ్యవస్థలో చెరగని ముద్రతో కొనసాగుతున్నది. హుండీలో ఉన్న ఆదాయాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. దేవాలయ అవసరాల కోసం దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి నిధులు విడుదల చేస్తుంది. దాదాపు రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఇదే సాంప్రదాయం కొనసాగుతున్నది. కానీ, చిలుకూరు దేవాలయాన్ని ప్రభుత్వ పరిధిలోకి తీసుకు వెళ్లడం ఎంత మాత్రం అంగీకరించని సౌందర్ రాజన్ దేవాలయంలో హుండీ లేకుండా చేసి, హుండి ఆదాయమే లేకుండా చేశారు. తద్వారా ఈ దేవాలయం ప్రభుత్వ/దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోకి వెళ్లకుండా కాపాడగలిగారు. నాటి నుంచి ఈ దేవాలయంలో ఎక్కడ కూడా హుండీ కనిపించదు. అనంతర కాలంలో దేవాలయానికి స్వయం ప్రతిపత్తి తీసుకొచ్చేందుకు ఆయన విశేషంగా కృషి చేశారు. ప్రస్తుతం దేవాలయ నిర్వహణ... స్వయం ప్రతిపత్తి కలిగిన కమిటీ ద్వారానే జరుగుతున్నది. భక్తులు తాము సమర్పించే ముడుపులు/కానుకలను ఈ కమిటీకి అప్పగిస్తారు. కమిటీ వారే దేవాలయ అభివృద్ధి, ఇతర బాగోగులు చూస్తుంటారు. ఇటువంటి వ్యవస్థ కలిగిన ఏకైక దేవాలయం చిలుకూరు శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయం మాత్రమే అనడంలో ఎటువంటి సందేహం లేదు. రోజూ వేలాది మంది భక్తులు ఈ దేవస్థానానికి విచ్చేస్తుంటారు. ఈ దేవాలయం హుండీ సంప్రదాయం లేకుండానే కొనసాగుతున్నది. సౌందర్ రాజన్ వృద్ధాప్య సమస్యలతో ఉన్న సమయంలో ఆయన కుమారులలో ఒకరైన రంగరాజన్ ఈ దేవాలయం ప్రధాన అర్చక బాధ్యతలు చేపట్టారు. దేవాలయ నిర్వహణలో తన తండ్రి నెలకల్పిన సాంప్రదాయ వారసత్వాన్ని ఆయన నేటికీ కొనసాగిస్తున్నారు. మరో విచిత్రం ఏమిటంటే ఇక్కడ ప్రముఖుల(విఐపి) దర్శనాలు అంటూ ప్రత్యేకంగా ఉండవు. ప్రతి ఒక్కరూ సాధారణ భక్తుల లాగానే దైవ దర్శనం చేసుకోవాలి. దర్శనం కోసం ప్రత్యేక టిక్కెట్లు కూడా విక్రయించరు. ఈ సాంప్రదాయం చిలుకూరు దేవస్థానం ప్రత్యేకం.



**సనాతన ధర్మంలో...**

చిలుకూరు దేవస్థానం అనేక విషయాల్లో ప్రత్యేకతను చాటుకుంటున్నది. సనాతన ధర్మాన్ని అధునాతనంగా అమలు చేయడంలో... ఇక్కడ ప్రధాన పూజారులు సఫలీకృతమయ్యారు. అవుతూనే ఉన్నారు. సనాతన ధర్మంలో వర్ణాశ్రమ ధర్మం ఉన్నప్పటికీ వివక్ష లేదని, వారు నిర్వహించే విధులు, పనుల ఆధారంగానే ఈ ధర్మం ఉంటుందని మరొక్కసారి చాటిచెప్పారు. అందులో భాగంగానే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని దళితుడైన శ్రీ శ్రీ శ్రీ అంబాత్రయ దేవాలయ నిర్మాత, పూజారి ఆదిత్య పరాశ్రీ స్వామి వారిని తన భుజాలపై మోసి రంగరాజన్ చరిత్ర సూచించారు. సనాతన ధర్మాన్ని... అధునాతనంగా చాటి చెప్పారు. భగవంతుని వద్ద అందరూ సమానమేనన్న భావనను స్వయంగా ఆచరించి చూపారు. తద్వారా సనాతన ధర్మం యొక్క గొప్పతనాన్ని తన చర్యల ద్వారా సమాజానికి తెలియజేయడంలో ప్రస్తుత చిలుకూరు దేవాలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ సఫలీకృతమయ్యారు.

**ఈ దేవాలయం ఆదర్శమే...**

చిలుకూరు దేవాలయాన్ని రెండు తెలుగు రాష్ట్రాల వారు ఆదర్శంగా తీసుకోవాలి. తిరుపతి, శ్రీశైలం, విజయవాడ, యాదగిరిగుట్ట, కాళేశ్వరం... ఇలా దేవాలయం ఏదైతేనేం... దర్శనం మాత్రం మూల్యంతో కూడుకున్నది. ఈ దేవాలయాల అన్నింటిలోనూ ధర్మ దర్శనంతో పాటు వీఐపీ దర్శనాలు, డబ్బులు చెల్లించి టిక్కెట్లు కొనుగోలు చేసి సత్వరం దర్శనం చేసుకునే వెసులుబాటు కల్పించారు. అంతే తప్ప, విఐపి దర్శనాలు లేని, టిక్కెట్లు అమ్మకాలు జరగని దేవాలయాన్ని తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా చూడలేము. అలాగని నిర్వహణ సంతృప్తి కరంగా ఉందని కూడా చెప్పలేం. తిరుపతి లడ్డు ప్రసాదం కల్తి ఉదంతం, సింహాచలం దేవస్థానంలో భక్తులపై గోడ కూలడం కేవలం ఉదాహరణలు మాత్రమే. ప్రముఖ వ్యక్తులు వస్తే సాధారణ భక్తులను గంటల తరబడి క్యూలైన్ లలో నిలబెట్టడం సాధారణమైపోయింది. ప్రభుత్వాలు మారుతున్నా... ఈ వైఫల్యాలకు మాత్రం చరమగీతం పాడడం లేదు. సనాతన ధర్మం, హైందవ సాంప్రదాయంపై... గంటల తరబడి ఉపన్యాసాలు ఇచ్చి, గద్దనెక్కుతున్న వారు సైతం... చిలుకూరు దేవాలయాన్ని నేటికీ కూడా ఆదర్శంగా తీసుకోలేకపోవడం విచారకరం.

సనాతన ధర్మం సక్రమంగా అమలయ్యేలా స్వయంగా ఆ దేవుడే ఉపక్రమిస్తే తప్ప... ఈ దేశంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో దేవాలయ వ్యవస్థలో మార్పులు రావు అన్నది నిజం!

***(శ్రీ శ్రీ శ్రీ చిలుకూరు బాలాజీ దేవస్థానం పూర్వ ప్రధాన అర్చకుడు సౌందర్ గారికి నివాళులు అర్పిస్తూ...)***



- బాశెట్టి శ్రావణ్ కుమార్
సీనియర్ జర్నలిస్ట్
7207201154

# కర్రకు స్నేహాలు! స్నేహితులేమిటి?



దానికి అలాంటివి ఉండవు. అలాంటివి దాని సహజ స్వభావానికి విరుద్ధం. పెత్తన(ఆధిపత్యం)మే దాని నైజం. సరిగ్గా అలాంటి అన్ని లక్షణాలు అన్నీ పుష్కలంగా కలిగి ఉన్న దేశం అమెరికా. ఆ దేశ ప్రస్తుత అధ్యక్షుల వారు ప్రపంచంపై చేస్తున్నది కర్ర పెత్తనమే. ఆ దేశం ఎనిమిది దశాబ్దాలుగా అనుసరించిన విదేశీ నీతి అదే. ఇప్పుడు ఆ దేశ అధ్యక్షుల వారు పెత్తనాన్ని పతాక స్థాయికి తీసుకు వెళ్లారు. దానిలో భాగమే ఇరాన్ పై ఇప్పుడు మొదలు పెట్టిన యుద్ధం. ఇలాంటి దేశానికి వారికి తాను, తన ప్రయోజనాలు తప్ప, అందరూ తరువాతి వారు, శత్రువులే అవుతారు. అలాంటి దేశ ప్రభుత్వానికి ఆ ప్రభుత్వ సారథికి తాను స్నేహితుడిని, అత్యంత ఆప్తుడిని, ఆత్మీయుడిని అనుకోవడం, చెప్పుకోవడం అమాయకత్వం, పిచ్చి తనం, భ్రమ మాత్రమే అవుతాయి.

నేనే ఫస్ట్ ,నేనే గ్రేట్ అనే ఆధిపత్య స్వభావం (సుపీరియారిటీ కాంప్లెక్స్) కలిగిన వాడికి ఇతరులందరూ ఎలాంటి సందేహం లేకుండా పనికిమాలిన వారు, అర్భకులు, అనామకులు, అప్రధానులే అవుతారు. అలాంటి తత్వం ఉన్న వాడికి, తాను,తన ప్రయోజనాలు మాత్రమే ప్రధానమవుతాయని తెలుసుకోలేకపోవడం వెర్రి తనం అన్నా కావాలి, లేకుండా ఇతరులను భ్రమల్లో ముంచి వేసి మోసగించే ఒక వ్యూహం అయినా అయి ఉండాలి. అమెరికాలో అమలులో ఉన్నది ప్రజాస్వామిక రాజ్య వ్యవస్థనే. మనది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, ఆ దేశానిది అధ్యక్ష తరహా డెమాక్రసీ. తమ దేశంలో పాలన ఎలా ఉన్నా ఇతరులు, ఇతర దేశాల పట్ల అమెరికా వైఖరి పూర్తిగా అప్రజాస్వామికమైనది ఉంటున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే అమెరికా ఒక గద్ద/రాబందు లాంటిది.

అలాంటి దేశం ఇప్పుడు ఒక మూర్ఖ నియంత గుప్పిట్లో చిక్కుకుంది. ఆ మూర్ఖుడికి ఇతరులను వేధించడం మాత్రమే ఒక పనిగా మారిపోయింది. తన ప్రజల పట్ల అమెరికా ఎంత ఉదారంగా ఉంటుందో ఇతర దేశాల పట్ల అంత క్రూరంగా ఉంటుంది అనే సంగతిని 80 యేళ్ల ప్రపంచ చరిత్ర చెబుతున్నది. దాని విదేశీ నీతి అదే. అది దాని స్వభావం. అలాంటి దేశానికి అధ్యక్షుడైన ప్రస్తుత దొరవారి సంగతి కూడా ప్రపంచానికి తెలియనిది, కొత్తది ఏమీ కాదు. గతంలో ఓ మారు ఆయన అదే గద్దెపై ఓ నాలుగేళ్ల పాటు కూర్చున్నవారే. అప్పుడు ఆయన ధోరణి, పాలనను ప్రపంచం అంతా చూసింది కూడా. ఇప్పుడు ఆయనే మళ్ళీ అధ్యక్షుడిగా యేడాది కాలానికి పైగా కొనసాగుతున్నారు. అపారమైన ఆయుధ సంపత్తి అది ప్రపంచాన్ని ప్రపంచంపై దుర్మార్గమైన కర్ర పెత్తనం చేస్తూ ముందుకు నడుస్తున్నాడాయన. ఎన్నికై గద్దెలో కూర్చోక ముందే అనేక దేశాలను బెదిరించాడాయన. గత యేడాది జనవరి 20 వ తేదీన ఆ కుర్చీలో కూర్చున్నారాయన. వెంటనే కర్ర పెత్తనం మొదలు పెట్టేశారు. తన ఎజెండాను, తన దేశపు సహజ వైఖరిని, నీతిని అమలు చేయడానికి అనేక ఫైళ్లపై ఎడా పెడా సంతకాలు పెట్టి పడేశారు. దానిలో భాగమే ఇతర దేశాలపై మొదలు పెట్టిన టారీఫ్/పన్నుల యుద్ధం. ఇండియా, మెక్సికో, కెనడా, చైనాలు అమెరికాకు చేస్తున్న ఎగుమతులపై భారీ సుంకాల భారం మోపుతూ ఆదేశాలను జారీ చేశారు. మన ఏలిక గారి ఆత్మీయ స్నేహితుడు కదా అందుకే మన జోలికి రాలేదు అనే భ్రమల్లో చాన్నాళ్లూ దేశ ప్రజానీకం భ్రమల్లో ఉండేది. ఆ భ్రమలను పటా పంచలు చేసి పారేస్తూ రష్యా క్రూడ్ ఆయిల్ వంక చూపుతూ అర్థం లేని సుంకాల భారం మోపాడు. అయితే... రష్యా క్రూడ్ ఆయిల్ దిగుమతుల ను నిలిపివేసే షరతులకు అంగీకరించడంతో కొంత తగ్గాడు. దీనికి ప్రతిగా మన దేశం ఆ దేశ దిగుమతులపై పన్ను మొత్తాన్ని ఎత్తి పారేసింది. అంతే కాదు ఆ దేశ పత్తి దిగుమతులపై అమలులో ఉన్న 11 శాతం దిగుమతి పన్నును ఎత్తి పడేసింది. గత డిసెంబర్ చివరి వరకు అది కొనసాగింది. సదరు నిర్ణయం మన దేశ పత్తి రైతులను అన్యాయం చేసింది. ప్రతీకార సుంకాల పేరిట విధించిన సుంకాలు చెల్లుబాటు కావని ఆ దేశ సుప్రీంకోర్టు ప్రకటించడంతో అధ్యక్షుల వారు రగిలిపోతున్నారు. ప్రస్తుతానికి అమెరికాను మూర్ఖపు ఆధిపత్యాన్ని ఎదిరించే శక్తి ప్రపంచంలోని ఏ దేశానికీ ఉన్నట్లుగా కనిపించడం లేదు. ఎం. ఏ. జీ. ఏ(మేక్ అమెరికా గ్రేట్ ఎగెయిన్) నినాదంతో గద్దె నెక్కిన అమెరికా దొర వారికి తాను, తన బిలియనీర్ స్నేహితులు, తన దేశం మినహా ఇతరులు అందరూ, అన్ని దేశాలు అప్రధానమైనవే అవుతాయి కదా. వారి, వాటి అవసరాలు, సమస్యలతో ఆ దేశానికి గానీ ఆయనకు గానీ ,ఆ కుర్చీకి గానీ అవసరం లేదు. సానుభూతి కూడా లేదు. అలాంటివి పట్టించుకునే సంస్కారం కూడా ఆ ఆయనకు ఉన్న దాఖలాలు లేవు.


ఆ దేశానికి కూడా అలాంటి నీతి ఉన్న దాఖలాలు గతంలో కూడా ఎప్పుడూ కనిపించలేదు. అలాంటి దేశానికి అధ్యక్షుడైన ఈ దొరవారు ఇండియాను టారీఫ్ కింగ్ గా గతంలోనే పలు మార్లు నిందించిన సంగతిని భ్రమల్లో ఉన్న మన భారతీయ సోదరులు గుర్తు చేసుకోవడం అవసరం. పెహెల్గాం ఉగ్రదాడి తరువాత పాకిస్తాన్ పై జరిపిన సిందూర్ ఆపరేషన్ పై ఆయన చేసిన వ్యాఖ్యలను మొత్తం ప్రపంచం విని నోళ్లు వెళ్ల బెట్టింది. ఇండియా పాక్ ల మధ్య యుద్ధాన్ని తానే నిలిపి వేసి నట్లు సుమారు వంద మార్లు ప్రకటించారు. దానికి ఇండియా ఇప్పటివరకు సరైన జవాబే ఇవ్వలేదు. గాజాను వల్లకాడుగా మార్చడానికి ఇజ్రాయిల్ కు పూర్తిగా సహకారం అందించి ఇప్పుడు ఇరాన్ పై యుద్ధం మొదలు పెట్టాడు. రానున్న మూడేళ్లలో ఆయన గారు ఇంకా ఏమేమి చేస్తారో ఎన్ని దేశాలను నాశనం చేస్తారో .... చాలా మంది అనుకుంటున్నట్లుగా అమెరికా ఆర్థిక వ్యవస్థ అంత బలమైనది గొప్పది ఏమీ కాదు. సుమారుగా 31 ట్రిలియన్ డాలర్లు కలిగిన దేశం అది. దాని అప్పు అంతకంటే ఎక్కువే. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ఇతర దేశాల నుంచి ఇంకా అనేక రూపాల్లో అమెరికా ఇప్పటి వరకు చేసిన అప్పు 37 ట్రిలియన్ డాలర్లు. ఈ లెక్కన అమెరికా ఆర్థిక వ్యవస్థ లోపల అన్నీ పురుగులు ఉండి వెలుపలికి అందంగా, ఆకర్షణీయంగా కనిపించే ఒక మేడి పండు లాంటిది మాత్రమే అవుతుంది కదా.



- గందె గోవర్ధన్,
ఫోన్ : 9347056621

# ప్రజాస్వామ్యం అంచున... కార్పొరేట్ కోరల్లో మీడియా!

ప్రజాస్వామ్యానికి నాలుగు స్తంభాలుంటాయని మనం చిన్నప్పటి నుంచీ వింటూనే ఉన్నాం. శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ ఇవి మూడూ రాజ్యాంగబద్ధమైన పరిధుల మధ్య బిగుసుకుపోయి ఉంటాయి. కానీ, నాలుగో స్తంభం మీడియా అలా కాదు. అది స్వేచ్ఛా విహంగం. పౌర సమాజపు కన్ను, వివేకపు గొంతుక, అన్యాయాన్ని నిలదీసే కాపలాదారు. కానీ నేడు ఆ గొంతుకలో స్వచ్ఛత తగ్గిందా? ఆ కాపలాదారు తన యజమానిని మార్చుకున్నాడా? అవును, నేటి కఠిన వాస్తవం ఏమిటంటే ఆ అజేయమైన నాలుగో స్తంభం ఇప్పుడు బడా కార్పొరేట్ సంస్థల గుప్పిట్లోకి వెళ్ళిపోతోంది. ఇది ప్రజాస్వామ్యానికి సంకేతించే పెను ప్రమాదమా, లేక ఆర్థిక పరిణామ క్రమంలో అనివార్యమైన మార్పా? ఈ ప్రశ్న నేటి తరం మేధావులను, పాత్రికేయులను, మరీ ముఖ్యంగా సామాన్య పౌరులను నిలదీస్తోంది.సరళంగా చెప్పాలంటే, ఒకప్పుడు ఆదర్శాలే పెట్టుబడిగా, స్వల్ప లాభాలే పరమావధిగా సాగిన వార్తా సంస్థలు నేడు భారీ పారిశ్రామిక వేత్తల చేతుల్లోకి వెళ్ళడమే కార్పొరేటీకరణ. ఒకప్పుడు పత్రికా సంపాదకుడి కలం నుంచి జాలువారే అక్షరం ఇప్పుడు స్టాక్ మార్కెట్‌లో లిస్టయిన బహుళ జాతీయ కంపెనీల లాభనష్టాల లెక్కల మీద ఆధారపడుతోంది. ఇప్పుడు వార్తను నిర్ణయించేది ఎడిటర్ కాదు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు. వారు చూసేది వార్తలోని సత్యం కాదు, ఆ వార్త తెచ్చే రేటింగ్, ప్రకటనలు మరియు షేర్ వాల్యూ .భారతదేశంలో ఈ పరిణామం 1990ల ఆర్థిక సంస్కరణల తర్వాత శరవేగంగా పుంజుకుంది. రిలయన్స్, అదానీ వంటి దిగ్గజాలు మీడియా రంగంలో పాగా వేయడంతో మీడియా మోనోపలీ (ఏక ఛత్రాధిపత్యం) మొదలైంది. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, ఇది ఇంకాస్త ముదిరి రాజకీయమీడియా అపవిత్ర కలయికగా మారింది. ఒక ఛానెల్ చూస్తుంటే అది ఏ పార్టీ భజన చేస్తుందో సామాన్యుడికి కూడా అర్థమైపోయేంతగా పతనమైంది మన మీడియా. స్వాతంత్ర్య పోరాట కాలంలో మీడియా ఒక ఆయుధం. గాంధీ, తిలక్, అంబేద్కర్ వంటి మహనీయులు పత్రికలను ప్రజలను చైతన్యపరచడానికి వాడారు. అప్పట్లో పత్రిక నడపడం అంటే ఒక త్యాగం. కానీ 1991 తర్వాత అంతా మారిపోయింది. గ్లోబలైజేషన్ పుణ్యమా అని మీడియా ఒక గ్లామరస్ పరిశ్రమగా రూపాంతరం చెందింది. భారీ పెట్టుబడులు అవసరమయ్యాయి, ఆ పెట్టుబడుల వెంటే కార్పొరేట్ అజెండాలు వచ్చి చేరాయి. సామాజిక బాధ్యత వెనక్కి వెళ్ళి, వ్యాపార సామ్రాజ్య విస్తరణే ముందుకొచ్చింది.ఒక కార్పొరేట్ సంస్థ తన అనుబంధ కంపెనీ చేసే అక్రమాలను తన మీడియా ఛానెల్‌లో ఎందుకు చూపిస్తుంది? చూపించదు సదా కదా, దాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తుంది. ఇది ప్రజలకు అందాల్సిన సత్యాన్ని గొంతు నొక్కడమే. మీడియా మనుగడ సాగేది ప్రకటనల మీద. ఒక పెద్ద కంపెనీపై ప్రతికూల వార్త రాస్తే ఆ కంపెనీ ప్రకటనలు ఆపేస్తుంది. ఈ భయం మీడియాను మౌనంగా ఉంచుతోంది. దీన్నే విజ్ఞాపన రద్దు అనే అస్త్రంతో కార్పొరేట్లు మీడియాను శాసిస్తున్నారు. పారిశ్రామికవేత్తలు తమ వ్యాపార ప్రయోజనాల కోసం అధికార పార్టీతో సఖ్యతగా ఉంటారు. తద్వారా వారి మీడియా సంస్థలు అధికార పక్షానికి కొమ్ముకాస్తూ, ప్రతిపక్షాన్ని విలన్లుగా చిత్రీకరిస్తాయి. ఇది పౌరుల ఆలోచనా దృక్పథాన్ని తప్పుదోవ పట్టిస్తుంది. నేటి మీడియాకు కావాల్సింది TRP. రైతుల ఆత్మహత్యలు, విద్యా వ్యవస్థలోని లోపాలు బోరింగ్ అంశాలుగా మారిపోయాయి. సినిమా గాసిప్స్, అర్థం లేని చర్చలు ఇన్ఫోటైన్‌మెంట్ పేరుతో ప్రజల మెదడులోకి ఎక్కించబడుతున్నాయి. నిజమైన సమస్యలు వెనక్కి నెట్టబడుతున్నాయి. ప్రజాస్వామ్యంలో భిన్న అభిప్రాయాలు ఉండాలి. కానీ మీడియా అంతా రెండు మూడు పెద్ద సంస్థల చేతుల్లో ఉంటే, అవి చెప్పిందే వేదం అవుతుంది. భిన్న స్వరాలు వినిపించవు, కేవలం యజమాని గొంతు మాత్రమే ప్రతిధ్వనిస్తుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో మీడియా పరిస్థితి మరింత జటిలం. ఇక్కడ 30కి పైగా వార్తా ఛానెళ్లు ఉన్నాయి. సంఖ్య చూస్తే ముచ్చట వేస్తుంది కానీ, లోతుగా చూస్తే విచారం కలుగుతుంది. ఇక్కడ వార్త అంటే ఒక పార్టీని సమర్థించడం లేదా మరో పార్టీని విమర్శించడం అన్నట్టుగా తయారైంది. నిజమైన ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం కనుమరుగవుతోంది. ఒక అవినీతి తిమింగలాన్ని పట్టుకోవాలంటే ఆ రిపోర్టర్‌కు తన యజమాని అనుమతి కావాలి, కానీ ఆ యజమానే సదరు తిమింగలంతో కలిసి వ్యాపారం చేస్తుంటే ఇక న్యాయం ఎక్కడ జరుగుతుంది? ఈ కార్పొరేటీకరణ వల్ల తీవ్రంగా నష్టపోతున్నది జర్నలిస్టులే. ఆదర్శాలతో ఈ వృత్తిలోకి వచ్చే యువతకు కార్పొరేట్ ఆఫీసుల్లో ఎదురయ్యే అనుభవాలు చేదుగా ఉంటున్నాయి. పై నుంచి ఆర్డర్స్ వచ్చాయి, ఈ వార్త వద్దు అనే మాట వారి సృజనాత్మకతను, నిజాయితీని చంపేస్తోంది. ఉద్యోగ భద్రత లేకపోవడం, కాంట్రాక్టు పద్ధతులు వారిని యజమానుల బానిసలుగా మారుస్తున్నాయి. సత్యం చెప్పే ధైర్యం కన్నా, నెల జీతం కాపాడుకోవడమే ప్రాధాన్యతగా మారుతోంది.కార్పొరేట్ మీడియాకు విరుగుడుగా డిజిటల్ విప్లవం కొంత ఊరటనిస్తోంది. ది వైర్ , న్యూస్‌లాండ్రీ ,వంటి స్వతంత్ర వేదికలు యూట్యూబ్, వెబ్‌సైట్ల ద్వారా ప్రజలకు చేరుతున్నాయి. తెలుగులో కూడా కొందరు స్వతంత్ర జర్నలిస్టులు సొంతంగా యూట్యూబ్ ఛానెళ్లు నడుపుతూ నిజాలు చెప్తున్నారు. అయితే వీటికి కూడా ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. కార్పొరేట్ ప్రకటనలు లేక, ప్రజల నుంచి విరాళాలు అందక ఇవి మూతపడే పరిస్థితి వస్తోంది. మరోవైపు సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ మహమ్మారి విజృంభిస్తోంది. ఏది నిజమో, ఏది అబద్ధమో తేల్చుకోలేక సామాన్యుడు సతమతమవుతున్నాడు.ప్రపంచ మీడియా స్వేచ్ఛా సూచీలో భారత్ 159వ స్థానానికి పడిపోవడం ఆందోళనకరం. నార్వే, స్వీడన్ వంటి దేశాల్లో మీడియాను పౌర సమాజం కాపాడుకుంటుంది. అక్కడ ప్రభుత్వ లేదా కార్పొరేట్ ప్రభావం తక్కువ. ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఒకే వ్యక్తికి పరిమితికి మించి మీడియా సంస్థలు ఉండకూడదనే చట్టాలు ఉన్నాయి. మనం కూడా అలాంటి సంస్కరణల దిశగా అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైంది. మీడియా కార్పొరేటీకరణ అనేది ఒక క్యాన్సర్ లాంటిది. ఇది ఒకేసారి ప్రాణం తీయదు కానీ, వ్యవస్థను లోపల నుంచి గుల్ల చేస్తుంది. దీనికి అడ్డుకట్ట వేయాలంటే ఒకే సంస్థకు అన్ని రకాల మీడియా వేదికలపై (TV, Print, Digital) నియంత్రణ ఉండకుండా క్రాస్ మీడియా ఓనర్‌షిప్ చట్టాలు తేవాలి. పాఠశాల స్థాయి నుంచే వార్తలను విశ్లేషించడం నేర్పాలి. చూసే ప్రతిదీ నిజం కాదని, దాని వెనుక ఉన్న ప్రయోజనాలను గుర్తించే తెలివి ప్రజలకు రావాలి. ప్రజలే నేరుగా మీడియాకు చందాలు కట్టాలి. వార్త ఉచితం కాదు అనే స్పృహ రావాలి. మనం వార్త కోసం డబ్బు చెల్లిస్తేనే, మీడియా మనకు జవాబుదారీగా ఉంటుంది. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు వేయడం కాదు, ప్రశ్నించే తత్వాన్ని కలిగి ఉండటం. ఆ ప్రశ్నలను సానబెట్టేదే మీడియా. మీడియా కార్పొరేట్ కోరల్లో చిక్కుకుంటే, సామాన్యుడి గొంతు మూగబోతుంది. సత్యం సమాధి అవుతుంది. అందుకే, మీడియాను కాపాడుకోవడం అంటే మన ప్రజాస్వామ్యాన్ని, మన భవిష్యత్తును కాపాడుకోవడమే. జ్ఞానమే శక్తి అన్నప్పుడు, ఆ జ్ఞానాన్ని అందించే మార్గాలు స్వచ్ఛంగా ఉండాలి. అప్పుడే భారత ప్రజాస్వామ్యం వెలుగులీనుతుంది.



- డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# మోడీ దేశ ప్రయోజనాలను పణంగా పెట్టారు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** భారత ప్రధాని నరేంద్ర మోడీపై హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ మరియు ఇజ్రాయెల్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్న ప్రస్తుత తరుణంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లడంపై అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పర్యటన దేశ ప్రయోజనాలను పణంగా పెట్టడమేనని, దశాబ్దాలుగా భారత్ అనుసరిస్తున్న తటస్థ విదేశీ విధానానికి ఇది విరుద్ధమని ఆయన మండిపడ్డారు.



**పశ్చిమాసియా విధానంలో మార్పు:**

భారత్ గత ఎనిమిది దశాబ్దాలుగా పశ్చిమాసియా వ్యవహారాల్లో సమతుల్యమైన మరియు తటస్థ వైఖరిని అవలంబిస్తోందని ఒవైసీ గుర్తు చేశారు. ఇంతటి ఉద్రిక్త పరిస్థితుల్లో ప్రధాని ఇజ్రాయెల్‌ను సందర్శించడం ద్వారా ఆ సమతుల్యతను దెబ్బతీశారని ఆయన ఆరోపించారు.

**10 మిలియన్ల భారతీయుల భద్రత:**

గల్ఫ్ దేశాల్లో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారని, ఈ పర్యటన వల్ల ఆ ప్రాంతంలో భారత్ పట్ల తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉందని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది అక్కడ ఉన్న భారతీయుల భద్రతను ప్రశ్నార్థకం చేస్తుందని ఆయన అన్నారు.

**దౌత్యపరమైన వైఫల్యం:**

ప్రధాని మోదీ పర్యటన ముగిసిన వెంటనే ఇరాన్‌పై దాడులు జరగడంపై ఒవైసీ స్పందిస్తూ.. "ప్రధాని విమానం గాల్లో ఉన్నప్పుడే ఈ దాడులు జరిగి ఉంటే బాధ్యత ఎవరు వహించేవారు?" అని ప్రశ్నించారు. ఈ పర్యటనను ఇజ్రాయెల్ తన రాజకీయ మరియు వ్యూహాత్మక ప్రయోజనాల కోసం వాడుకుందని ఆయన విమర్శించారు.

**ముందస్తు సమాచారంపై ప్రశ్న:**

ఇరాన్‌పై దాడుల గురించి ఇజ్రాయెల్ ప్రధాని బెన్యామిన్ నెతన్యాహు భారత్‌కు ముందస్తు సమాచారం ఇచ్చారా? లేదా అన్నది స్పష్టం చేయాలని ఒవైసీ డిమాండ్ చేశారు. ఒకవేళ తెలిసినా పర్యటనకు వెళ్లడం అనాలోచితమని, తెలియకుండా వెళ్లి ఉంటే ఇజ్రాయెల్ భారత్‌ను మోసం చేసినట్లేనని వ్యాఖ్యానించారు. కాగా, ప్రధాని మోడీ ఇజ్రాయెల్ పర్యటన ముగిసిన కొద్దిసేపటికే అమెరికాఇజ్రాయెల్ దళాలు ఇరాన్‌పై దాడులు ప్రారంభించాయి. ప్రధాని మోడీ పర్యటన కవరేజ్ కోసం వెళ్లిన భారత మీడియా ప్రతినిధులు ఇజ్రాయెల్‌లోనే చిక్కుకున్నట్లు ఒవైసీ విమర్శించారు.. కేంద్ర ప్రభుత్వానికి ముందస్తు అంచనా లోపించిందని ఆరోపించారు.. ఈ పరిణామాల నేపథ్యంలో ఒవైసీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెను దుమారం రేపుతున్నాయి. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ.. ఒవైసీ కేవలం వార్తల్లో నిలవడానికే ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కౌంటర్ ఇచ్చారు.

# క్యాన్సర్ పై తెలంగాణ, ఆంధ్ర యుద్ధం

- రెండు రాష్ట్రాల్లో ప్రారంభమైన హెచ్‌పీవీ ఇంజెక్షన్స్
- సర్వైకల్ క్యాన్సర్ ముప్పును ప్రాథమిక దశలోనే అడ్డుకునే వ్యాక్సిన్
- 14 ఏళ్ల వయసున్న బాలికలను లక్ష్యంగా చేసుకుని టీకాలు
- యూ-విన్ పోర్టల్ వ్యాక్సిన్ బాలికల వివరాలు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** దేశవ్యాప్తంగా మహిళల ఆరోగ్య రక్షణలో కీలక మైలురాయిగా నిలిచే హ్యూమన్ పాపిల్లోమా వైరస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా ప్రారంభమైంది. భవిష్యత్తులో సర్వైకల్ క్యాన్సర్ ముప్పును ప్రాథమిక దశలోనే అడ్డుకోవాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. కేవలం 14 ఏళ్ల వయసున్న బాలికలను లక్ష్యంగా చేసుకుని, వారికి ప్రాణాంతక వ్యాధుల నుండి శాశ్వత రక్షణ కల్పించడమే ఈ ఉచిత టీకా పంపిణీ ముఖ్య ఉద్దేశం.ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా చీపురుపల్లిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆడబిడ్డల ఆరోగ్యంపై పెట్టుబడి పెట్టడం అంటే ఆ కుటుంబం యొక్క భవిష్యత్తును భద్రపరచడమేనని పేర్కొన్నారు. టీకా వేయించుకునేందుకు వచ్చిన బాలికలతో, వారి తల్లిదండ్రులతో ముచ్చటించిన సీఎం.. ఒక్కసారి ఈ వ్యాక్సిన్ తీసుకుంటే జీవితాంతం గర్భాశయ క్యాన్సర్ నుండి రక్షణ లభిస్తుందని భరోసా కల్పించారు.

కింగ్ కోఠి జిల్లా ఆసుపత్రిలో మంత్రి దామోదర్ ..

అలాగే తెలంగాణలో సైతం ఈ కార్యక్రమం వేగంగా మొదలైంది. హైదరాబాద్‌లోని కింగ్ కోఠి జిల్లా ఆసుపత్రిలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ టీకా పంపిణీని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అర్హులైన బాలికలందరికీ ఈ సౌకర్యాన్ని చేరువ చేస్తామని ఆయన ప్రకటించారు. మహిళల్లో పెరుగుతున్న క్యాన్సర్ కేసులను అరికట్టడానికి ముందస్తు నివారణే సరైన మార్గమని, ఇందులో భాగంగానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన వివరించారు. ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం కోసం ప్రభుత్వం యూవిన్ పోర్టల్‌ను వినియోగిస్తోంది. టీకా తీసుకున్న ప్రతి బాలిక వివరాలను అధికారులు ఈ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు. కేవలం 14 ఏళ్ల వయసు ఉన్న బాలికలకు మాత్రమే ప్రస్తుతం 0.5 ml డోస్‌ను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది. దీనివల్ల ప్రతి లబ్ధిదారుని ట్రాకింగ్ సులభతరం కావడమే కాకుండా, భవిష్యత్తులో బూస్టర్ డోసుల అవసరం ఉంటే సమాచారాన్ని సేకరించడం వీలవుతుంది. అయితే రేపటి నుండి అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఈ టీకా అందుబాటులోకి రానుంది. అర్హులైన బాలికల తల్లిదండ్రులు ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా తమ పిల్లలకు ఈ టీకా వేయించాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అత్యధిక ధర ఉండే ఈ వ్యాక్సిన్‌ను ప్రభుత్వం సామాన్యులందరికీ ఉచితంగా అందించడం విశేషం. చివరగా, గర్భాశయ క్యాన్సర్ అనేది నివారించదగిన వ్యాధి అని, సరైన సమయంలో తీసుకునే వ్యాక్సిన్ ఎంతో మంది మహిళల ప్రాణాలను కాపాడుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. పాఠశాల స్థాయి నుండే అవగాహన కల్పిస్తూ, క్షేత్రస్థాయిలో సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. ఇది ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఒక బలమైన పునాదిగా నిలవనుంది.

## హెచ్‌పీవీ టీకా డ్రైవ్‌కు శ్రీకారం



**విశ్వంభర, హైదరాబాద్ :** ఆడబిడ్డల ఆరోగ్య రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను హైదరాబాదులోని కింగ్ కోఠి ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం ప్రారంభించింది. కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించి, టీకా వేయించుకున్న బాలికలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. మూడు నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం కొనసాగనుంది. తొలి నెల రోజులు జనరల్ ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో టీకా అందుబాటులో ఉండగా, అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ అందించనున్నారు. రాష్ట్రంలో ఏటా 55 వేల నుంచి 60 వేల వరకు క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని మంత్రి తెలిపారు. సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ టీకా కీలకమని పేర్కొన్నారు. 14 ఏళ్లు నిండి, 15 ఏళ్లలోపు బాలికలకు ఉచితంగా టీకా ఇవ్వనున్నట్టు వెల్లడించారు. సుమారు 3.5 నుంచి 4 లక్షల మందికి టీకా అందించనున్నట్లు తెలిపారు. ప్రైవేట్‌లో ఒక్క డోసు ధర 3,000-4,000 రూపాయలు ఉండగా, ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

**డీసీసీ అధ్యక్షులకు సూచనలు**

వికారాబాదు హరిత రిసార్ట్స్‌లో నిర్వహించిన డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతుల్లో మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. విద్య, వైద్య రంగాల ప్రాధాన్యంపై వివరించారు. ప్రజారోగ్య బలోపేతానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించి, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.


## ఇంటర్ పరీక్షా కేంద్రంలోని టాయ్‌లెట్‌లో

### మృత శిశువుకు జన్మనిచ్చిన ఫస్ట్ ఇయర్ విద్యార్థిని

### ఇంగ్లిష్ పరీక్ష రాయటానికి వచ్చిన 16 ఏళ్ల బాలిక


### భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఈ ఘటన

**విశ్వంభర, ఖమ్మం :** ఇంటర్ పరీక్షా కేంద్రంలోని టాయ్‌లెట్ లో మృత శిశువుకు మైనర్ బాలిక జన్మనిచ్చిన ఘటన కలకలం రేపింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఈ ఘటన చోటుచేసుకుంది. పాల్వంచలోని ఓ కేంద్రానికి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న 16 ఏళ్ల బాలిక ఇంగ్లిష్ పరీక్ష రాయటానికి వచ్చింది. పరీక్ష ప్రారంభమైన తర్వాత ఇన్విజిలేటర్ అనుమతితో టాయ్‌లెట్‌కు వెళ్లింది. ఎంత సేపటికీ రాకపోవటంతో మరుగు దొడ్డి వైపు వెళ్లి చూశారు. బాలిక నెమ్మదిగా నడుచుకుంటూ బయటికి రావడంతో ఎగ్జామ్ సెంటర్ సిబ్బంది అనుమానం వ్యక్తం చేశారు. బాలిక వివరాలు ఆరా తీయటంతో అసలు విషయం బయటపడింది. సిబ్బంది వెళ్లిచూడగా.. బేసిన్‌లో మృతశిశువు పడి ఉండడంతో షాక్ కు గురయ్యారు. అయితే పరువు పోతుందనే భయంతోనే ఎవరికీ అనుమానం రాకుండా శిశువును బాత్రూం బేసిన్‌లో కుక్కినట్లు బాలిక తెలిపినట్లు సిబ్బంది తెలిపారు.




# నాన్న ఉంటే బాగుండు అమ్మ..

- నాన్న లేనందుకే నాకు ఇన్ని కష్టాలు
- సూసైడ్ లెటర్ రాసి మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య
- ధారూర్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న దివ్య



**విశ్వంభర, హైదరాబాద్ :** వికారాబాద్ పట్టణం గంగారంలో దివ్య అనే మహిళ కానిస్టేబుల్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ధారూర్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న దివ్య అనే కానిస్టేబుల్ సూసైడ్ లెటర్ రాసి ప్రాణాలు తీసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దివ్య ఆత్మహత్యకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఎవరైనా వేధించారా అనే కోణంలో బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆత్మహత్యకు ముందు దివ్య రాసిన లెటర్ గుర్తించారు. ఆ లెటర్ లో "నా చావుకు ఎవరు కారణం కాదు. మెంటల్ స్ట్రెస్ తట్టుకోలేకనే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు రాసుకొచ్చింది. నాన్న ఉంటే బాగుండు అమ్మ.. నాన్న లేనందుకే నాకు ఇన్ని కష్టాలు. అమ్మ నేను నీకు భారం కాకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నాను. నన్ను క్షమించు అమ్మ" అంటూ దివ్య రాసిన లెటర్ కన్నీళ్లు పెట్టిస్తోంది. కష్టపడి చదివి ఉద్యోగం సాధించి అర్థాంతరంగా తనువు చాలించడంతో మహిళా కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. 2020 బ్యాచ్ కు చెందిన కానిస్టేబుల్ దివ్య.. హైదరాబాద్ అంబర్ పేట్ లో కానిస్టేబుల్ శిక్షణ పొందింది. ఆరేళ్ల క్రితం తండ్రి మృతి చెందారు. దివ్య తల్లి జగదేవి. పోలీస్ హోంగార్డుగా పని చేసిన తండ్రి బాస్వరాజ్. ఎస్సై కావడానికి ఆసక్తి చూపిన దివ్య. బసవరాజ్ కు ముగ్గురు కూతుర్లు కాగా దివ్య మూడో కూతురు. దివ్య వికారాబాద్ జిల్లా ధారూర్ పోలీస్ స్టేషన్ లో ఐదు సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్నది. వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర కన్నీరు మున్నీరు అవుతున్నారు దివ్య బ్యాచ్ కు చెందిన మహిళా కానిస్టేబుళ్లు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వికారాబాద్ సీఐ రఘు కుమార్ తెలిపారు.

## కేంద్ర రైతు వ్యతిరేక విధానాలపై మార్చి 1 నుంచి గ్రామాల్లో ప్రచారం

### మార్చి 9న ఢిల్లీలో కిసాన్-మజ్దూర్ పార్లమెంట్





**విశ్వంభర, హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ మార్చి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో ప్రచారం చేపట్టి, రాష్ట్రపతికి వినతి పత్రాలు పంపనున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ టీ సాగర్ తెలిపారు. మార్చి 9న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద కిసాన్‌మజ్దూర్ పార్లమెంట్ నిర్వహిస్తామని వెల్లడించారు. శనివారం హైదరాబాదు బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అమెరికాతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, నాలుగు కార్మిక కోడ్‌లు, విద్యుత్ బిల్లు 2025, విత్తన బిల్లు 2025, వి బి గ్రామజీ చట్టం 2025లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి హామీ కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరుస్తున్న చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు పూర్తి రుణమాఫీ, అన్ని పంటలకు సి టూ ప్లస్ 50 శాతం కనీస మద్దతు ధర చట్టబద్ధత కల్పించడంలో కేంద్రం వెనుకంజ వేస్తోందని ఆరోపించారు. జీఎస్టీ వసూళ్లలో రాష్ట్రాలకు 60 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి రాము, డి జి ప్రసాద్, మండల వెంకన్న, బుర్రి ప్రసాద్, జక్కుల వెంకటయ్య, మామిడాల బిక్షపతి, విజయ్ పాల్గొన్నారు.

## కవితతో తెలంగాణకు ఒరిగేదేమీ లేదు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** కల్వకుంట్ల కవిత బయట ఉన్నా, లోపల ఉన్నా ఆమె వల్ల తెలంగాణ రాజకీయాలకు ఒరిగేదేమీ లేదని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఎద్దేవాచేశారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీ లిక్కర్ కేసుపై సీబీఐ హయ్యర్ కోర్టు కు వెళ్లాలని ఆయన పేర్కొన్నారు. తప్పు చేయకపోతే కేజ్రీవాల్ లిక్కర్ పాలసీ ఎందుకు మార్చాల్సి వచ్చిందని ప్రశ్నించారు. తమకు కవిత పాలిటిక్స్ పై ఇంట్రెస్ట్ ఏమాత్రం లేదని, తమకు రేవంత్ రెడ్డిపై ఇంట్రెస్ట్ ఉందన్నారు.

**కవిత ఇంగ్లిష్ చదువుకోలేదా?**

రాష్ట్రాన్ని క్రిమినల్ నడుపుతున్నారని, తమ టార్గెట్ ఆ క్రిమినల్ పై ఉంటుందని చురకలంటించారు. కవిత ఏమైనా పదవిలో ఉందా? అసలు ఆమె ఎవరని అర్వింద్ ఎద్దేవాచేశారు. కవిత ఇంగ్లిష్ చదువుకోలేదా? అని చురకలంటించారు. బీజేపీ వేరు బీఆర్ఎస్ వేరనే విషయం తనకు తెలియదా? అని సెటైర్లువేశారు. ఓటుకు నోటు కేసులో ఆధారాలతో దొరికిన రేవంత్ రెడ్డి బయట తిరుగుతున్నారని, ఆయన బ్యాగు మోయడం, కట్టలు తీసి పెట్టారని, ఎవిడెన్స్‌తో సహా దొరికారన్నారు. ఆయనపై ఆధారాలున్నా బయట తిరుగుతున్నారని, అలాగే కవితకు క్లీన్ చిట్ ఇవ్వలేదని, ఆధారాల్లేవని మాత్రమే కోర్ట్ తీర్పు ఇచ్చిందన్నారు. కవిత ముత్యంలా తిరిగిరావడానికి ఇప్పుడు కడిగారా అంటూ అర్వింద్ ఎద్దేవాచేశారు.





## విజ్ఞాన శాస్త్రంలో విశ్వగురువుగా భారత్

### - పినాకిల్ అకాడమీ ఓదెల చంద్రమౌళి వెల్లడి

**విశ్వంభర, హనుమకొండ జిల్లా ప్రతినిధి :** భారతదేశం కేవలం ఒక దేశం కాదు అది విజ్ఞానానికి, పరిశోధనలకు, సత్యాన్వేషణకు నిలయమైన భూమి అని పినాకిల్ అకాడమీ ఓదెల చంద్రమౌళి అన్నారు. శనివారం సైన్స్ డే సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయుడు ఓదెల చంద్రమౌళి మీడియాతో మాట్లాడుతూ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ప్రపంచానికి తన శాస్త్రీయ ప్రతిభను చూపించింది అని , చంద్ర యాన్3 ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో విజయవంతంగా ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది అని అన్నారు. ప్రయోగం ,పరిశీలన ,నిర్ధారణ అణుశక్తి, జీవవిజ్ఞానం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం ప్రతి రంగంలోనూ భారత్ తన ముద్ర వేసింది అని అన్నారు. మన పండుగలు ప్రకృతి పరిరక్షణను, ఆరోగ్యాన్ని, సామాజిక ఐక్యతను బోధిస్తాయి.

ముగింపు

భారత్ విజ్ఞాన శాస్త్రంలో విశ్వగురువుగా ఎదగడానికి కారణం నమ్మకాలకంటే ఆధారాలను నమ్మడం ఊహలకంటే ప్రయోగాలను ప్రాధాన్యం ఇవ్వడం మాటలకంటే డేటాతో నిరూపించడం ప్రయోగంతో నిరూపితమైనదే నిజమైన విజ్ఞానం.

## బిలియనైర్స్ నెట్‌వర్క్ కాన్‌క్లేవ్–2026

### విజనరీలు, పరిశ్రమ నాయకులు, యువ ఎంట్రప్రెన్యూర్లు ఒకే వేదికపైకి




**విశ్వంభర, హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా వ్యాపార రంగంలో ముందంజలో ఉన్న నాయకులు, పెట్టుబడిదారులు, స్టార్టప్ వ్యవస్థాపకులు, గ్రోత్ స్ట్రాటజిస్టులను ఒకే వేదికపైకి తీసుకువచ్చేలా బిలియనర్స్ నెట్‌వర్క్ కాన్‌క్లేవ్-2026ను మాదాపూర్ ఐటీసీ కోహినూర్‌లో నిర్వహించారు. బిలియనర్స్ నెట్‌వర్క్ వ్యవస్థాపకురాలు దీపికామహేశ్వరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాకేశ్ స్వామి (గ్రూప్ ప్రెసిడెంట్ & హెడ్ కార్పొరేట్ అఫైర్స్, గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్), తోపాటు తస్నీమ్ షరీఫ్ (ఇంటర్నేషనల్ స్ట్రాటజిస్ట్), సుమిత్ తివారి (ఫౌండర్ & సీఈవో టైముస్ లగేజ్ నాసిక్), ప్యానలిస్ట్ సభ్యులుగా విమల్ పార్వల్ (అసోసియేట్ డైరెక్టర్, ఛాయిస్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ ముంబై), రవి వర్మ (స్ట్రాటజిక్ అడ్వైజర్ & సీరియల్ ఎంటర్ప్రెన్యూర్ మార్క్యూ బ్రాండ్స్ లైక్ ఏషియన్ పెయింట్స్ ఐడియా సెల్లులార్ హెచ్డిఎఫ్సి అండ్ ఐసిఐసిఐ), సుమేష్ బాలకృష్ణన్ (సిఓ ఫౌండర్ అండ్ సిఎఫ్ఓ, కాగ్నిడా. ఏఐ) హాజరయ్యారు. ఈ సందర్భంగా దీపికా మహేశ్వరి మాట్లాడుతూ.. "బిలియనీర్ మైండ్‌సెట్" అనే ప్రధాన అంశంతో ఈ సమావేశం కొనసాగింది. ఆర్థిక సంపదకే కాకుండా దూరదృష్టి, విస్తరణ ఆలోచన, ప్రభావవంతమైన చర్యలే నిజమైన నాయకత్వానికి కొలమానం అని స్పష్టం చేశారు. "బ్యాంకులో ఉన్న డబ్బుతో కాదు, దృష్టి పరిమాణంతో, ఆలోచన విస్తృతితో, ప్రభావంతోనే బిలియనీర్‌ను నిర్వచించాలి" అని పేర్కొన్నారు.

## రాజగోపుర ప్రతిష్ఠాపన మహోత్సవంలో దేప భాస్కర్ రెడ్డి

**విశ్వంభర, సరూర్ నగర్ :** మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణ పురం డివిజన్ సౌభాగ్య పురంలో వెలసిన అలివేలుమంగ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానములో రాజగోపుర ప్రతిష్ఠాపన మహోత్సవంలో , కుంభప్రోక్షణ లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సౌభాగ్యపురంలో వెలసిన వేంకటేశ్వరస్వామి వారి దేవాలయ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొనడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఇలాంటి పవిత్రమైన పుణ్యకార్యంలో భాగస్వామిని కావడం చాలా సంతోషంగా ఉంది."ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత: "నేటి ఉరుకుల పరుగుల జీవితంలో భక్తి ఆధ్యాత్మికత ద్వారానే మనిషికి నిజమైన మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఆలయాలు సమాజంలో నైతిక విలువలను పెంపొందించే కేంద్రాలుగా నిలుస్తాయి. అని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, పున్నా నిర్మల గణేష్‌నేత, బండి మధుసూదన్ రావు, రమేష్‌నేత, నరసింహారెడ్డి, వెంకట్ రెడ్డి, సుధాకర్ గుప్తా,ముప్పిడి లింగా స్వామి గౌడ్,బొడ్డుపల్లి మహేందర్, ఎల్లయ్య, శ్రీశైలం, జగన్నాథం, విజయలక్ష్మి, సాయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో లక్షా 2 వేల మంది ఓటర్లకు నోటీసులు




**విశ్వంభర, హైదరాబాద్ :** జీహెచ్‌ఎంసీ పరిధిలోని హైదరాబాద్ రెవెన్యూ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఏప్రిల్ నుంచి నిర్వహించేందుకు ఎలక్షన్ వింగ్ అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఓటరు జాబితాలోని లోపాలను సరిదిద్దటంతో పాటు ప్రక్షాళన చేయటంలో భాగంగా ఎస్ఐఆర్ ను చేపట్టాలని భారత ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిసింది.

**క్రాస్ వెరిఫికేషన్ చేస్తూ..**

ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ ఎలక్షన్ వింగ్ విభాగం అధికారులు ఓటరు జాబితాను వడపోసేందుకు బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్ఓ)లు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ఒకే వివరాలతో రెండు చోట్ల ఓటరు వివరాలున్న సుమారు లక్షా 2 వేల మంది ఓటర్లను గుర్తించి, వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఈ ప్రక్రియకు సమాంతరంగా 2002 ఓటరు జాబితా, 2025 ఓటరు జాబితాతో పోల్చుతూ మ్యాపింగ్ చేస్తున్నట్లు తెలిసింది. 2002 ఓటరు జాబితాలోని వివరాలను 2025 ఓటరు జాబితాలోని వివరాలతో క్రాస్ వెరిఫికేషన్ చేస్తూ మ్యాపింగ్ చేస్తున్నట్లు సమాచారం.

**మూడు నోటీసులకు స్పందించకుంటే డిలిట్..**

ఒకే వివరాలతో రెండు చోట్ల, అంతకన్నా ఎక్కువ సార్లు ఓటు హక్కును కల్గి ఉన్న సుమారు లక్షా 2 వేల ఓటర్లకు మొదటి నోటీసు జారీ చేసినట్లు తెలిసింది. ఇలా ఓటర్లకు వరుసగా మూడు నోటీసులు జారీ చేసిన తర్వాత కూడా ఓటరు స్పందించకుంటే సదరు ఓటు వివరాలను డిలీట్ చేయనున్నట్లు సమాచారం. నిర్ణీత గడువును విధిస్తూ వరుసగా మూడుసార్లు వచ్చే ఈ నోటీసులకు స్పందించి, ఒకటి కన్నా ఎక్కువ సార్లు నమోదై ఉన్న ఓట్లలో ఒకదాన్ని ఓటరు ఎంపిక చేసుకుని కోరుకుంటే, మిగిలిన రెండు ఓట్ల వివరాలను ఫారమ్,7 ద్వారా డిలీట్ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఒకటి కన్నా ఎక్కువ సార్లు నమోదై ఉన్న ఓట్ల వివరాలు, బ్లర్ ఫొటోలు, సమాచారంలో సవరణ వంటి అంశాలకు సంబంధించి బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను త్వరలోనే ముమ్మరం చేసి, రిపీటెడ్ ఓట్లను, ఒకే ఇంటి నెంబర్ పై బల్క్ లో ఉన్న ఓట్లను గుర్తించనున్నట్లు తెలిసింది.

ప్రజా విశ్వంభర

# 'బ్యాండ్ మేళం' నుంచి సెకండ్ సింగిల్ రిలీజ్..



'కోర్ట్' చిత్రంలో హర్ష్ రోషన్, శ్రీదేవీ తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. మళ్లీ ఇప్పుడు వీరిద్దరూ కలిసి 'బ్యాండ్ మేళం' అంటూ ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. బ్లాక్ బస్టర్ రచయిత కోన వెంకట్ నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం రూపు దిద్దుకుంది. మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కావ్య, శ్రావ్య ఈ మూవీని నిర్మించారు. సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాని మార్చి 13న రిలీజ్ చేయబోతోన్నారు. ఇప్పటి వరకు వదిలిన కంటెంట్ ఆడియెన్స్‌లో ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. 'బ్యాండ్ మేళం' టీజర్, 'తిప్పూ కుంటానవ్' అనే పాట ఎంతగా వైరల్ అయ్యాయో అందరికీ తెలిసిందే. ఇక ఇప్పుడు ఈ మూవీ నుంచి రెండో పాటను విడుదల చేశారు. 'పల్లెలోని సందల్లన్ని మీవే' అంటూ సాగే మెలోడీ పాటను మాస్ మహారాజా రవితేజ సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు. పాటను రిలీజ్ చేసిన అనంతరం రవితేజ 'బ్యాండ్ మేళం' టీంకి బెస్ట్ విషెస్‌ను తెలియజేశారు. 'పల్లెలోని సందల్లన్ని మీవే' అంటూ సాగే ఈ బ్యూటీఫుల్ మెలోడీ పాటకు విజయ్ బుల్గానిన్ ఎంతో క్యాచీ ట్యూన్‌ను అందించారు. ఆస్కార్ అవార్డు గెలుచుకున్న గీత రచయిత చంద్రబోస్ సాహిత్యం ఎంతో అర్థవంతంగా ఉంది. ఈ పాటను శ్వేతా మోహన్ ఆలపించారు. లిరికల్ వీడియోని చూస్తుంటే.. గిరి, రాజిల స్కూల్, చైల్డ్ మోమరీస్‌కు సంబంధించినట్టుగా కనిపిస్తోంది. హర్ష్ రోషన్, శ్రీదేవి స్కూల్ యూనిఫాంలో కనిపించడం, స్కూల్లో చేసిన అల్లరి పనులు, కంపోజ్ చేసిన స్టెప్పులు, పాటను చిత్రీకరించిన తీరు అందరినీ మంత్రముగ్ధులను చేసేలా ఉంది. సునీల్ సున్నాపు, ఫాల్గుణి బంగేరా కంపోజ్ చేసిన హుక్ స్టెప్పులు నెట్టింట్లో వైరల్ అయ్యేలా కనిపిస్తున్నాయి. శివరాజు ప్రణవ్ ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరించారు. శివ ముప్పరాజు ఎడిటింగ్, స్క్రీన్ ప్లే బాధ్యతల్ని నిర్వర్తించారు. సతీష్‌ముత్యాల సినిమాటోగ్రఫర్‌గా పని చేశారు. ఇక ఈ మూవీలో సాయికుమార్ కీలక పాత్రను పోషించారు. ఈ సినిమాను మార్చి 13న భారీ ఎత్తున విడుదల చేయబోతోన్నారు.



# పెళ్లి ఫొటోలతో రికార్డులన్నీ బద్దలు!

టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తమ పెళ్లి ఫొటోలతో సోషల్ మీడియాలో సరికొత్త చరిత్ర సృష్టించారు. ఈ నెల 26న ఉదయ్‌పూర్‌లో అంగరంగ వైభవంగా ఒక్కటైన ఈ జంట, తమ వివాహ చిత్రాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకోగా లైకుల వర్షం కురుస్తోంది. ఈ పోస్ట్ కేవలం 24 గంటల్లోనే భారతీయ సెలబ్రిటీల పెళ్లిళ్ల రికార్డులన్నింటినీ తిరగరాసి, సోషల్ మీడియాలో వారికున్న అసాధారణమైన క్రేజ్‌ను మరోసారి నిరూపించింది.

ఇప్పటివరకు బాలీవుడ్ జంట కియారా అద్వానీ-సిద్ధార్థ్ మల్హోత్రా పెళ్లి ఫొటోలకు వచ్చిన 16 మిలియన్ల లైక్స్ అత్యధిక రికార్డుగా ఉండేది. అయితే, 'విరోష్' (విజయ్-రష్మిక) జంట ఈ మైలురాయిని కేవలం 14 గంటల్లోనే దాటేసి సంచలనం సృష్టించింది. ప్రస్తుతం వీరి పోస్ట్ 23.3 మిలియన్ల లైక్స్‌తో దూసుకుపోతోంది. దీంతో అలియా భట్-రణబీర్ కపూర్ (13 మిలియన్+), సమంత-నాగ చైతన్య (12 మిలియన్+), కత్రినా కైఫ్-విక్కీ కౌశల్ (10 మిలియన్+), దీపికా పదుకొనే-రణవీర్ సింగ్ (8 మిలియన్+) వంటి స్టార్ కపుల్స్ రికార్డులను ఈ జంట అధిగమించింది. ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే విరాట్ కోహ్లీ వ్యక్తిగత పోస్ట్ రికార్డుకు కూడా చేరువయ్యే అవకాశం కనిపిస్తోంది.

దాదాపు ఎనిమిదేళ్ల రహస్య ప్రేమ ప్రయాణానికి ముగింపు పలుకుతూ ఒక్కటైన ఈ జంటకు అభిమానులు, సినీ ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. "నా బెస్ట్ ఫ్రెండ్‌ను భార్యగా చేసుకున్నాను" అని విజయ్, "నాకు నిజమైన ప్రేమను పరిచయం చేసిన వ్యక్తి" అని రష్మిక పెట్టిన ఎమోషనల్ క్యాప్షన్లు నెటిజన్లను మరింతగా ఆకట్టుకున్నాయి. వీరి పెళ్లి ఫొటోలు టాలీవుడ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్నాయి. ఉదయ్‌పూర్ వేడుకల అనంతరం మార్చి 4న హైదరాబాద్‌లో జరగనున్న గ్రాండ్ వెడ్డింగ్ రిసెప్షన్‌కు సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు భారీ సంఖ్యలో హాజరుకానున్నట్లు తెలుస్తోంది.



## వెంకటప్పయ్య నాయుడుగా
# మోహన్ బాబు ఫస్ట్ లుక్ రిలీజ్

హార్డ్ హిట్టింగ్ సినిమాలు అందించడంలో పాపులరైన దర్శకుడు అజయ్ భూపతి ప్రస్తుతం' శ్రీనివాస మంగాపురం' చేస్తున్నారు. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు సోదరుడి కుమారుడు జయ కృష్ణ ఘట్టమనేని ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. వైరల్ అయిన ఉయ్ అమ్మ ట్రాక్‌తో దేశవ్యాప్తంగా అలరించిన తర్వాత రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంలో హీరోయిన్ గా నటిస్తున్నారు. అగ్ర నిర్మాత అశ్విని దత్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. నిర్మాత పి కిరణ్ నిర్మిస్తున్న శ్రీనివాస మంగాపురం ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్‌లతో స్ట్రాంగ్ బజ్‌ను సృష్టించింది. శనివారం మేకర్స్ ఈ చిత్రంలో మరో ప్రముఖ పాత్రను పరిచయం చేశారు. వెంకటప్పయ్య నాయుడుగా మోహన్ బాబు ఫెరోషస్ ఫస్ట్ లుక్ అదిరిపోయింది. పోస్టర్‌లో ఆయన ఇంటెన్స్ గా నడుస్తూ, రా అథారిటీని ప్రజెంట్ చేశారు. సాల్ట్ అండ్ పెప్పర్ జుట్టు, మీసం ఆయన ఫియర్స్ వ్యక్తిత్వాన్ని మరింత హైలైట్ చేస్తుంటే, తెల్లటి కుర్తా-ధోతి ఆయనను శక్తివంతమైన గ్రామ పెద్దగా చూపిస్తోంది. మెడలో బంగారు గొలుసులు, చేతికి వాచ్, బ్రేస్లెట్ వింటేజ్ మాస్ టచ్‌ను అందిస్తున్నాయి. ఆయన వెనుక తుపాకులతో నిలిచిన మనుషుల సమూహం చూస్తుంటే గౌరవంతో పాటు భయాన్ని కూడా కలిగించే వ్యక్తి అర్థమౌతుంది.మొత్తంగా ఈ పోస్టర్ తన నేలను గొప్ప సంకల్పంతో పాలించే వ్యక్తి స్వభావాన్ని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది. మోహన్ బాబు ఇప్పటికే టీమ్‌లో చేరగా, సినిమా షూటింగ్ ప్రస్తుతం కొనసాగుతోంది. దర్శకుడి కమాండింగ్ విజన్, కథను ముందుకు నడిపించే కొత్త లీడ్ పెయిర్, నెగటివ్ షేడ్స్‌తో కనిపించనున్న సీనియర్ పెర్ఫార్మర్ మోహన్ బాబు, గొప్ప థీమాటిక్ కాన్వాస్ తో "శ్రీనివాస మంగాపురం" అంచనాలని పెంచుతోంది.

## ఇజ్రాయెల్ పై ఇరాన్ దాడి
# తృటిలో బయటపడిన ఎన్టీఆర్



యూఎస్, ఇజ్రాయిల్ మధ్య యుద్ధ వాతావరణ పరిస్థితులు చోటుచేసకున్నాయి. అమెరికా, ఇరాన్ అణు ఒప్పందం మధ్య ఉద్రిక్తలు కొన సాగుతున్న నేపథ్యంలో ఇజ్రాయిల్ పై క్షిపణి దాడులకు పాల్పడింది. ఈ నేపథ్యంలోనే పెద్ద ఎత్తున ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకోవటమే కాకుండా ఈ క్షిపని దాడులలో భారీగా మరణాలు కూడా సంభవించాయి. ఈ యుద్ధ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో జోర్డాన్ లో ఉన్న భారతీయులకు అధికారులు అప్రమత్తం జారీ చేశారు. ఇలాంటి యుద్ధ వాతావరణ పరిస్థితులలో నటుడు జూనియర్ ఎన్టీఆర్ క్షేమంగా బయటపడ్డారని తెలుస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ ఇటీవల జోర్డాన్ వెళ్లిన సంగతి తెలిసిందే. డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటిస్తున్న డ్రాగన్ సినిమా షూటింగ్ పనుల నిమిత్తం చిత్ర బృందం ఇటీవల జోర్డాన్ వెళ్లారు. అయితే అక్కడ యుద్ధ వాతావరణ పరిస్థితులు ఏర్పడక ముందే చిత్ర బృందం షూటింగ్ ముగించుకొని సురక్షితంగా ఇండియా చేరుకున్నారు. దీంతో ఎన్టీఆర్ తో పాటు డ్రాగన్ చిత్ర బృందం ప్రమాదం నుంచి బయట పడ్డారనే చెప్పాలి. ఒకవేళ షూటింగ్ అనుకున్న సమయానికి పూర్తి కాకపోయి ఉంటే ఎన్టీఆర్ తో పాటు ఇతర చిత్ర బృందం కూడా జోర్డాన్ లో చిక్కుకుపోయే ప్రమాదం ఉండేది. అదృష్టవశాత్తు ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడక ముందే ఎన్టీఆర్ సురక్షితంగా ఇండియా చేరుకున్నారు. ఎన్టీఆర్ పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డారునే విషయం తెలియడంతో అభిమానులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ దేశాల మధ్య యుద్ధ వాతావరణ పరిస్థితిలో నెలకొనడంతో భారతీయులు ఎంతో భయాందోళనకు గురి అవుతున్నారు. ఇక ఎన్టీఆర్ సినిమా విషయానికి వస్తే.. ప్రస్తుతం ఈయన డ్రాగన్ సినిమా షూటింగ్ పనులలో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది.

# 'విసా - వింటారా సరదాగా' నుండి 'అనగా అనగా అమెరికా' రిలీజ్


అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'విసా వింటారా సరదాగా' చిత్రం నుండి తొలి గీతం 'అనగా అనగా అమెరికా' విడుదలైంది. విన్న తక్షణమే శ్రోతల హృదయాలను గెలుచుకుంటూ, అన్ని వేదికల్లోనూ విశేష స్పందనను సొంతం చేసుకుంటోంది. ఇప్పటికే టీజర్ అద్భుతమైన స్పందనతో అంచనాలను పెంచేయగా, ఇప్పుడు ఈ మధుర గీతం చిత్రంపై ఆసక్తిని రెట్టింపు చేసింది. 'అనగా అనగా అమెరికా' గీతం తక్షణ చార్ట్‌బస్టర్ అనడంలో సందేహం లేదు. మధురమైన సంగీతం, హృదయాన్ని తాకే సాహిత్యం, మనోహరమైన గానం, ఆకట్టుకునే విజువల్స్ ఇవన్నీ కలిసి ఎప్పటికీ మరిచిపోలేని ఒక అద్భుతమైన సంగీత అనుభూతిని అందిస్తున్నాయి. ఈ పాటకు సనారె రాసిన సాహిత్యం వినసొంపుగా, అందరూ అనుభూతి చెందేలా ఉండి, శ్రోతల మనసులను తాకుతోంది. "అనగా అనగా అమెరికా.. కథ మొదలిక.. మది గదులని తెరువగా.." అంటూ అంటూ సాగిన సాహిత్యం కట్టిపడేసింది. ప్రతిభావంతులైన గాయకుడు సంజిత్ హెగ్డే తన మధుర గానంతో ఈ పాటకు ప్రాణం పోశారు. సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ ఎప్పటికీ నిలిచిపోయే శ్రావ్యమైన పాటలను రూపొందించడంలో తన నైపుణ్యాన్ని మరోసారి నిరూపించుకున్నారు. తెరపై అశోక్ గల్లా, శ్రీ గౌరీ ప్రియ మధ్య కుదిరిన సహజమైన కెమిస్ట్రీ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రేమ, హాస్యం, భావోద్వేగాల మేళవింపుతో యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులు మెచ్చేలా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది.

# 'మృత్యుంజయ' ట్రైలర్ లాంచ్ చేసిన ఎన్టీఆర్



టాలీవుడ్‌లో విభిన్నమైన కంటెంట్‌తో ప్రేక్షకులను అలరించే హీరో శ్రీవిష్ణు. ఆయన నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ 'మృత్యుంజయ'. భారీ అంచనాల మధ్య రూపొందిన ఈ సినిమా ట్రైలర్‌ను మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ శనివారం విడుదల చేశారు. ట్రైలర్ కట్ చూస్తుంటే, శ్రీవిష్ణు ఖాతాలో మరో సాలిడ్ హిట్ పడటం ఖాయమనిపిస్తోంది. శ్రీవిష్ణు గత చిత్రాల కంటే భిన్నంగా 'మృత్యుంజయ'లో చాలా ఇంటెన్స్‌గా కనిపిస్తున్నారు. ట్రైలర్ లాంచ్ చేసిన అనంతరం ఎన్టీఆర్ చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. శ్రీవిష్ణు నటన, నేపథ్య సంగీతం, విజువల్స్ ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచాయి. సోషల్ మీడియాలో ఈ ట్రైలర్‌కు నెటిజన్ల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. "శ్రీవిష్ణు అన్న.. అసలు ఎలాంటి కంటెంట్ కావాలనుకున్నానో సరిగ్గా అలాంటి ట్రైలర్ ఇచ్చావు" అంటూ ఫ్యాన్స్ పోస్టులు పెడుతున్నారు. కాగా ఈ చిత్రం మార్చి 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. థ్రిల్లర్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులకు 'మృత్యుంజయ' ఒక మంచి ట్రీట్ అని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. తారక్ సపోర్ట్ తోడవ్వడంతో ఈ సినిమాపై అంచనాలు ఒక్కసారిగా రెట్టింపయ్యాయి.

## "రణబాలి" మూవీ నుంచి
# బ్యూటిఫుల్ మ్యారేజ్ సాంగ్




విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న ఇటీవలే వైవాహిక బంధంలోకి అడుగు పెట్టారు. అంగరంగ వైభవంగా జరిగిన వారి పెళ్లి వేడుక గురించి ప్రతి ఒక్కరూ మాట్లాడుకుంటున్నారు. ఈ సందర్భంగా ఈ కొత్త జంటకు శుభాకాంక్షలు చెబుతూ "రణబాలి" మూవీ టీమ్ ఈ చిత్రంలోని బ్యూటిఫుల్ వెడ్డింగ్ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ భారీ పాన్ ఇండియా మూవీలో విజయ్ రణబాలిగా, రశ్మిక జయమ్మ పాత్రల్లో కనిపించనున్నారు. "రణబాలి"లో వీరి పెళ్లి వేడుక సందర్భంగా ఓ అందమైన పాట చిత్రీకరించారు. ఈ పాటలో అప్పట్లో పెళ్లి సందడి ఎంత సంప్రదాయంగా ఉండేదో చూపించారు. పసుపు దంచడం, గోరింటాకు రుబ్బడం, ఎద్దు బండి సవారీలో నూతన వధూ వరులను తీసుకురావడం, అత్తవారింట్లో నవ వధువు శుభప్రదంగా అడుగుపెట్టడం..ఇవన్నీ ఎంతో అందంగా ఈ పాటలో రూపొందించారు. ఈ పాట ఎలా ఉందో చూస్తే 'ఎందయ్య సామీ, ఇంత కాస్తాందీ వెన్నెల, ఊపేస్తావుంది సిత్తరాల ఉయ్యాలా, వీచే గాలికి అత్తరద్దిందెవ్వరు, మారే ఝూముకి మందుపెట్టిందెవ్వరు, మాయదారి మనస్సాగక జాగరామన్నారా...' అంటూ సాగుతుందీ పాట. మ్యూజిక్ డైరెక్టర్స్ అజయ్ అతుల్ బ్యూటిఫుల్ గా ఈ పాటను కంపోజ్ చేశారు. రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో టీ సిరీస్ సమర్పణలో ప్రెస్టీజియస్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై "రణబాలి" సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. "రణబాలి" సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్ కు రాబోతోంది. ఇటీవల రిలీజ్ చేసిన ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్ హ్యూజ్ రెస్పాన్స్ అందుకుంది. 19వ సెంచరీ నేపథ్యంతో 1854నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా "రణబాలి" సినిమా రూపొందుతోంది.

# రూ.20 కోట్లతో సాయి దుర్గా తేజ్ ఫైట్ సీన్



మెగా సుప్రీం హీరో సాయి దుర్గా తేజ్ పాన్‌ఇండియా స్పెక్టికల్ ఎస్వైజీ (సంబరాల ఏటిగట్టు) తో ఇంతకు ముందెన్నడూ చూడని ఎక్స్ పీరియన్స్ అందించడానికి సిద్ధమవుతున్నాడు. రోహిత్ కెపి దర్శకత్వంలో పాన్‌ఇండియా బ్లాక్‌బస్టర్ హనుమాన్ అందించిన ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నెక్స్ట్ లెవల్ లో రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన అసుర ఆగమన గ్లింప్స్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. టీం ప్రస్తుతం భారీ, హైఆక్టేన్ క్లైమాక్స్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తోంది. మేకర్స్ క్లైమాక్స్ కోసం ప్రత్యేకంగా 20 కోట్లకు పైగా కేటాయించారు. 35 రోజుల షెడ్యూల్ జరుగుతోంది, ఇందులో 18 భారీ యాక్షన్ బ్లాక్‌లు ఉన్నాయి, ప్రముఖ స్టంట్ డైరెక్టర్ కెవిన్ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. యుద్ధభూమిని తలపించేలా రూపొందించిన క్లైమాక్స్ మహాభారతంలోని కురుక్షేత్ర యుద్ధం గుర్తు చేసేలా ఉండబోతుంది. ప్రేక్షకులకు రా, ఇమర్సివ్, విజువల్‌గా గ్రాండియర్ అనుభూతిని అందించేలా ఈ క్లైమాక్స్‌ను మలిచారు. సాయి దుర్గా తేజ్ ఈ చిత్రానికి పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించనున్నారు. ఇంటెన్స్, ఫియర్స్ మేకోవర్‌తో పాటు ముఖ్యంగా క్లైమాక్స్ సన్నివేశాల కోసం హైరిస్క్ స్టంట్స్‌ను స్వయంగా చేస్తూ, తన కెరీర్‌లో ఇప్పటివరకు మోస్ట్ ఛాలెంజింగ్ గా నిలిచిన పాత్రలో కనిపించబోతున్నారు. టాప్ టెక్నికల్ టీమ్ ఈ చిత్రానికి పని చేస్తోంది. సినిమాటోగ్రఫీని వెట్రివేల్ పళనిసామి అందిస్తుండగా, సంగీతాన్ని బి. అజనీష్ లోకనాథ్ సమకూరుస్తున్నారు. ఎడిటింగ్‌ను నవీన్ విజయకృష్ణ నిర్వహిస్తుండగా, ప్రొడక్షన్ డిజైన్‌ను గాంధీ నడికుడికర్ రూపొందిస్తున్నారు. ప్రతి విభాగంలోనూ అత్యుత్తమ నైపుణ్యంతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ పాన్‌ఇండియా విడుదలకు సిద్ధమవుతున్న "సంబరాల ఏటిగట్టు" ఈ సంవత్సరంలో బిగ్గెస్ట్ సినిమాటిక్ ఈవెంట్ గా నిలుస్తోంది.

రిపోర్టర్లు కావలెను
ప్రజా "విశ్వంభర" తెలుగు దిన పత్రిక
ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com